తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 21.05.2026 | సంపుటి :12 సంచిక : 301 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

ఇరాన్‌తో పోరులో అమెరికాకు చావుదెబ్బ

భారీ నష్టం ఏర్పడటంతో అగ్రరాజ్యం కకావికలం

అమెరికా-ఇరాన్ మధ్య చోటుచేసుకున్న తీవ్ర సైనిక సంఘర్షణలు (ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ) అగ్రరాజ్యం అమెరికాకు కోలుకోలేని ఆర్థిక, సైనిక నష్టాన్ని మిగిల్చాయి. ఇరు దేశాల మధ్య జరిగిన ఈ భీకర పోరులో అమెరికా దాదాపు 2 బిలియన్ డాలర్ల విలువైన సైనిక ఆస్తులను కోల్పోయిందని కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) తన తాజా నివేదికలో వెల్లడించింది.

- రూ. వేల కోట్ల విలువైన ఆస్తులు ధ్వంసం
- కూలిన 42 యుద్ధ విమానాలు, రీపర్ డ్రోన్లు
- రక్షణ శాఖపై రోజుకు 900 మిలియన్ డాలర్ల ఆర్థిక భారం
- అమెరికా కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ నివేదిక వెల్లడి
- అధికారిక ప్రకటన లేకుండానే యుద్ధమా?.. వైట్‌హౌస్‌పై కాంగ్రెస్ ఆగ్రహం

వాషింగ్టన్ (జనంసాక్షి) : ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా వైమానిక దళానికి గట్టి దెబ్బ తగిలింది. ఇరాన్ దాడుల ధాటికి అమెరికాకు చెందిన కనీసం 42 అత్యాధునిక యుద్ధ విమానాలు, ఫైటర్ జెట్లు, అత్యంత ఖరీదైన 'ఎంక్యూ-9 రీపర్' నిఘా డ్రోన్లు పూర్తిగా ధ్వంసమవడమో లేదా తీవ్రంగా నష్టపోవడమో జరిగిందని నివేదిక స్పష్టం చేసింది. వీటితో పాటు యుద్ధరంగంలో శత్రువులతో పోరాడుతూ పలువురు అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు తీవ్రంగా గాయపడటం వైట్ హౌస్‌ను తీవ్ర ఆందోళనలో పడేసింది.

రోజుకు 900 మిలియన్ డాలర్ల ఖర్చు

ఈ వివాదం ప్రారంభమైన తొలి దశల్లోనే అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్)పై ఊహించని స్థాయిలో ఆర్థిక భారం పడింది. యుద్ధ నిర్వహణ కోసమే రోజువారీ ఖర్చు దాదాపు 900 మిలియన్ డాలర్లగా



అంచనా వేయబడింది. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ యుద్ధ ఖర్చులు ఏకంగా 11 బిలియన్ డాలర్ల (రూ. 90 వేల కోట్ల పైమాటే) దాటడం గమనార్హం. ఈ యుద్ధంలో వ్యూహాత్మకంగా అమెరికాకు భారీ వ్యయం కావడానికి 'ఆయుధాల అసమానత' ప్రధాన కారణంగా నిలిచింది. ఇరాన్ ప్రయోగించిన చౌకైన 'షాహెద్' కామికాజే డ్రోన్‌లను కూల్చేందుకు అమెరికా భారీ ధర కలిగిన రక్షణ క్షిపణులను వాడాల్సి వచ్చింది. ఒక్కో ఇరాన్ డ్రోన్‌ను అడ్డుకోవడానికి అమెరికా దాదాపు 4 మిలియన్ డాలర్ల విలువైన 'పేట్రియాట్' క్షిపణిని లేదా ఏకంగా 13 మిలియన్ డాలర్ల ఖరీదైన 'థాడ్' ఇంటర్‌సెప్టర్‌ను ప్రయోగించాల్సి రావడం అమెరికా రక్షణ బడ్జెట్‌కు భారీ గండి కొట్టింది.

వార్ పవర్స్ యాక్ట్ ఉల్లంఘన

మరోవైపు ఈ సైనిక చర్యలపై అమెరికా రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. 1973 నాటి 'వార్ పవర్స్ యాక్ట్' ప్రకారం.. కాంగ్రెస్ (పార్లమెంట్) నుంచి అధికారికంగా ఎలాంటి యుద్ధ ప్రకటన లేదా అనుమతి లేకుండానే, ఇరాన్ గడ్డపై అమెరికా బలగాలను పంపి యుద్ధం చేయించడాన్ని కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. బైడెన్ యంత్రాంగం తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయాలపై అమెరికా సెనేట్‌లో తీవ్ర చర్చలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సంఘర్షణలపై కాంగ్రెస్ సభ్యులు లేవనెత్తిన ఆందోళనలు, వైట్ హౌస్ తీసుకున్న నిర్ణయాల పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

మెట్రో రెండో దశకు కేంద్రం సానుకూలం

డీపీఆర్ అందాక నిర్ణయం

విస్తరణకు సూత్రప్రాయ అంగీకారం

- కేంద్ర, రాష్ట్రాలు చెరో సగం ఖర్చుతో ముందుకెళ్లేందుకు సిద్ధం
- హైదరాబాద్ ప్రాజెక్టులపై కేంద్రమంత్రులు ఖట్టర్, కిషన్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణకు ముందడుగు పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ప్రకటించారు. మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకరిస్తుందని, అమృత్ 2.ా పథకం కింద రూ.3 వేల 975 కోట్లతో 39 ఎస్‌టీపీలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. దిల్లీలో జరిగిన సమావేశంలో హైదరాబాద్‌లో ప్రజా రవాణా, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల ప్రాజెక్టులపై సమీక్షించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై దిల్లీలో కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, కిషన్‌రెడ్డి సమీక్షించారు. సమావేశ వివరాలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌అండ్ టీ సంస్థ నుంచి మెట్రో రైల్‌ను ఇటీవలే టేకోవర్ చేసుకుంది. ఈ నేపథ్యంలో రెండో దశ పనులకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్), ఇతర సాంకేతిక వివరాలు అందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి

మిగతా 9లో..

జిల్లాలకూ ఐటీ వెలుగులు

ప్రతీ జిల్లాలో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసేలా ప్రభుత్వ పాలసీ

- 'బియాండ్ హైదరాబాద్' ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి
- హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొత్త డేటా సెంటర్లు
- ముఖ్యంగా వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ రూట్లలో ఏర్పాటుకు ప్రాధాన్యం
- అందుకుకోసం 1500 ఎకరాల భూ సేకరణ
- ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు
- నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ
- అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతుల కల్పన
- ఐటీ, పరిశ్రమలశాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ఐటీ రంగాన్ని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు విస్తరించే దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ వెలుపల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేసే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు. నిజామాబాద్,కరీంనగర్, వరంగల్ హైవేల వెంట జీసీసీలు, ఐటీ సంస్థలు ఏర్పాటు అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. 'బియాండ్ హైదరాబాద్' ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాల్లో ఐటీ విస్తరణ ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా డేటాసెంటర్ల ఏర్పాటుకు కంపెనీలకు ఇన్సెంటివ్స్ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై కూడా సీఎం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలో నెట్-జీరో విధానాలు అమలు చేయాలని, ప్రపంచ స్థాయి ఏఐ సదుపాయాలతో 'ఏఐ సిటీ'ని

మిగతా 2లో..

మెరిట్ ఆధారంగానే పోస్టింగులు

- శాంతి భద్రతలపై అలసత్వం సహించను
- కొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీసు శాఖ సిద్ధం కావాలి
- ఫ్లెక్సీలపై ఇక నుంచి కఠిన చర్యలు
- పోలీసు ఉన్నతాధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి

నేటినుంచి సరస్వతీ అంత్య పుష్కరాలు

భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి :సీఎం రేవంత్ రెడ్డి

హాజరు కానున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

మధ్యాహ్నం వేళ ప్రయాణాలు మానుకోండి

ఎండల దృష్ట్యా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన

వివరాలు 2వ పేజీలో..

జనగణనలో కులగణనకు సుప్రీం కోర్టు

ఓకే

వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్లు తిరస్కరించిన అత్యున్నత ధర్మాసనం

న్యూఢిల్లీ(జనంసాక్షి): కులగణనపై సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం కొట్టివేసింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించారు. సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేసింది. కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదని స్పష్టం చేసింది. జన గణన.. కుల ప్రాతిపదికన జరగాలా వద్దా అనేది విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉందని ఈ ధర్మాసనం వ్యాఖ్యానించింది. నగణన నుంచి కులగణనను మినహాయించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం తిరస్కరించింది.

మిగతా 2లో..

ప్రభుత్వ రాయితీ పొందినప్పుడు పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిందే

ప్రైవేట్ ఆస్పత్రులకు సుప్రీం కీలక ఆదేశాలు

2లో..

ఇటలీతో మా బంధం బలమైనది

- ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు సరికొత్త శిఖరాలకు
- భారత్-ఇటలీ మధ్య పురాతన సాంస్కృతిక సంబంధాలు
- సాంకేతిక రంగంలో పరస్పర సహకారం
- ఆ దేశ పర్యటనలో ప్రధాని మోదీ

రోమ్(జనంసాక్షి): భారత్-ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు సరికొత్త శిఖరాలకు చేరాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో జరిగిన విస్తృత స్థాయి చర్చల అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'భారత్-ఇటలీ సంయుక్త వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక 2025-29' గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలకు ఒక ఆచరణాత్మక, భవిష్యత్ ఆధారిత నిర్మాణాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఇరు దేశాల నాయకుల

మిగతా 2లో..



దేశ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మోదీ విదేశాల్లో

చాక్లెట్లు పంచుతూ బిజీగా ఉన్నారు

ప్రధానిపై రాహుల్ విమర్శలు..

వివరాలు లోపలి పేజీల్లో..

రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించండి

విద్యారంగంలో పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు ఇవ్వండి

కేంద్రాన్ని కోరిన భట్టి

న్యూఢిల్లీ(జనంసాక్షి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యారంగంలో భారీ పెట్టుబడులు, మూలధన

మిగతా 9లో..

అప్పుడు కేసీఆర్ సీఎం కాదు కదా..!

కవిత జైలుకెళ్తే కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా?

బీఆర్ఎస్ నిరసనలపై బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు స్పందన

విచారణకు సహకరించాలనే నా కుమారుడిని అప్పగించా: బండి సంజయ్

హైదరాబాద్, మే 18 (జనంసాక్షి) : పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ వ్యవహారంపై బీఆర్ఎస్ పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ సోమవారం తెలంగాణలోని పలు జిల్లాల్లో బీఆర్ఎస్ భారీ ప్రదర్శనలు నిర్వహించింది. అయితే ఈ నిరసనలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రాంచందర్ రావు స్పందించారు. లిక్కర్ కేసులో కవిత జైలుకు వెళ్తే కేసీఆర్, కేటీఆర్‌లు తమ పదవులకు రాజీనామా చేశారా? అంటూ ఆయన సంధించిన ప్రశ్నలు ఇప్పుడు ఆసక్తికర చర్చకు తెర తీశాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా అధినేత కేసీఆర్ కుమార్తె, అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ లిక్కర్ దందాలో అడ్డంగా బుక్కయ్యారని రాంచందర్

మిగతా 2లో..

అప్పుడు కేసీఆర్ సీఎం కాదు కదా..!

కవిత జైలుకెళ్తే కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా?

రావు గుర్తు చేశారు. పోలీసులు కవితను అరెస్టు చేసి తీహార్ జైలుకు తరలించారని ఆయన ప్రస్తావించారు. నాడు కుమార్తె చేసిన తప్పునకు కేసీఆర్ రాజీనామా చేశారా? సోదరి చేసిన తప్పునకు కేటీఆర్ పదవి వదిలారా? అని రాంచందర్ రావు నేరుగా ప్రశ్నించారు. నైతిక బాధ్యత గురించి మాట్లాడే ముందు బీఆర్ఎస్ నాయకులు తమ గతాన్ని సమీక్షించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

ఇంతకీ కవిత ఎప్పుడు అరెస్టయ్యారు!

కేసీఆర్, బీఆర్ఎస్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన విమర్శల నేపథ్యంలో మరో కొత్త చర్చ మొదలైంది. అప్పటి ఎమ్మెల్సీ కవిత తన తండ్రి ముఖ్యమంత్రి పదవిలో ఉండగా అరెస్టయ్యారా? ఆ తర్వాత జైలుకెళ్లారా అని పలువురు గూగుల్‌లో వెతకడం ప్రారంభించారు. అయితే సీబీఐ, ఈడీ సంయుక్తంగా మార్చి 15, 2024న ఆమెను అరెస్టు చేశాయి. ఆ సమయానికి బీఆర్ఎస్ అధికారంలో లేదు. డిసెంబర్ 3, 2023న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటికి కేసీఆర్ సీఎం పదవికి సైతం రాజీనామా చేశారు. కేటీఆర్ కూడా మంత్రి పదవిలో లేకపోవడం గమనార్హం.

విచారణకు సహకరించాలనే నా కుమారుడిని అప్పగించా: బండి సంజయ్

భాజపాలో ప్రతిఒక్కరూ సుశిక్షితులైన కార్యకర్తలేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కమిట్‌మెంట్‌తో పనిచేసే పార్టీ కార్యకర్తను చివరి కోరిక ఏంటని అడిగితే.. చనిపోయిన తర్వాత భాజపా జెండా కప్పాలని కోరుకుంటారని చెప్పారు. తాను ఎలాంటి వాడినో కార్యకర్తలకు తెలుసన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో సంజయ్ మాట్లాడారు. బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా సంజయ్ స్పందిస్తూ.. "కేసీఆర్ పార్టీకి లోక్‌సభలో ఒక్క ఎంపీ లేరు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని ఏదైనా చెబుతారు. ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది.. ఆ కుటుంబ పాలనను అంతం చేసింది మేమే. అందుకే మాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. కేటీఆర్ ఫేక్ సోషల్ మీడియా ఫ్యాక్టరీ నడుపుతున్నారు. కన్నకొడుకును పోలీసులకు స్వయంగా అప్పగించిన సందర్భం ఏదైనా ఉందా? విచారణకు సహకరించాలనే నా కుమారుడిని అప్పగించా." అని బండి సంజయ్ అన్నారు.

జిల్లాలకూ ఐటీ వెలుగులు

అభివృద్ధి చేయాలని సూచించారు. ఐటీ , డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పీడ్ పెంచారు. ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ లో జరిగిన పరిశ్రమలు, ఐటీ శాఖల రివ్యూ మీటింగ్‌లో రాష్ట్రంలో డిజిటల్ నెట్‌వర్క్, ఐటీ రంగాన్ని ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించడంపై సీఎం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఏకంగా 1500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఒక సరికొత్త 'డేటా సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ప్రకటన చేశారు. ఈ ప్రతిష్టాత్మక డేటా సిటీ నిర్వహణకు భారీగా నీటి అవసరాలు ఉంటాయని, అందుకోసం ప్యూర్ వాటర్ కాకుండా ఎస్ టీ పీ ల ద్వారా రీసైకిల్ చేసిన నీటిని వినియోగించేలా ఎ÷-లాన్ చేయాలని అధికారులకు సీఎం సూచనలు ఇచ్చారు. అలాగే గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్, పెద్ద పెద్ద డేటా సెంటర్ల ఏర్పాటు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా ద్వితీయ శ్రేణి నగరాలలో కూడా ఈ జీసీసీల ఏర్పాటుపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టేలా సరికొత్త ఐటీ అండ్ ఇండస్ట్రియల్ పాలసీని తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా రాబోయే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ పనులను తక్షణమే ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్ అయిన టీ-ఫైబర్ పై సీఎం రేవంత్ రెడ్డి డెడ్‌లైన్ విధించారు. రాబోయే మూడు నెలల్లోగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తప్పనిసరిగా నెట్‌వర్క్‌కు కనెక్ట్ కావాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ను కూడా మన ఫ్యూచర్ సిటీకే వచ్చేలా చూడాలని, అవసరమైతే దీని కోసం తాను స్వయంగా ప్రధాని మోడీని కలిసి రిక్వెస్ట్ చేస్తానని సీఎం అధికారులతో పేర్కొన్నారు. అలాగే హెల్త్ సిటీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్త్ సిటీ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వ సహకారం కోసం చర్చలు జరపాలని సీఎం సూచించారు. కంపెనీలు భూమిపూజలకు సిద్ధంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించే దిశగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కంపెనీలు ఎంఓయూలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు అందించే విధానాన్ని తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో అమలు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వచ్చే మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని ఆదేశించారు. టీ-ఫైబర్ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.54 కోట్లు విడుదలైనట్లు అధికారులు వెల్లడించారు.

నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ

ఫ్యూచర్ సిటీల పరిశ్రమల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి పరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీహెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ డిజైన్స్ ఉండాలని సీఎం తెలిపారు. మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని.. ఇందులో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్‌లకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం తెలిపారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలన్నారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్ రూపొందించాలని వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని.. డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని సూచనలు చేశారు. జీసీసీలు, డేటా సెంటర్లు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలని ఆదేశించారు. ద్వితీయ శ్రేణి నగరాలల్లో జీసీసీ ఏర్పాటు పైనా దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు.. టీఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు.

మెరిట్ ఆధారంగానే పోస్టింగులు

హైదరాబాద్(జనంసాక్షి):శాంతి భద్రతల విషయంలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. కొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీసు శాఖ సిద్ధం కావాలని ఆయన సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పావిలియన్‌లో పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర భద్రతా సలహాదారు శివధర్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పోలీసు కమిషనర్లు, ఐజీ ర్యాంక్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. పోలీసు శాఖలో అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మెరిట్ ఆధారంగానే పోస్టింగులు ఇవ్వాలని అన్నారు. ఎస్ఐ నుంచి నాన్ కేడర్ ఎస్పీ ర్యాంక్ అధికారి వరకు ప్రమోషన్లు ఇచ్చిన తర్వాత రెండేళ్ల పాటు ఇతర విభాగాల్లో పనిచేసేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని డీజీపీకి సూచించారు. ఉన్నతాధికారుల మధ్య సమన్వయం మెరుగుపడాలని, జిల్లా హెడ్‌క్వార్టర్ దాటితే తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని తేల్చి చెప్పారు. అన్ని పోలీసు స్టేషన్లలో క్యూ ఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రజాభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అన్నారు. ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపాలని పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. కల్తీ కారణంగా క్యాన్సర్లు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార కల్తీపై ప్రత్యేక చట్టాన్ని రూపొందించి నిబంధనలను కఠినతరం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆలోచనలను పంచుకోవాలన్న ఉద్దేశంతోనే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పోలీసు శాఖలో ప్రతి ఒక్క అధికారి వ్యవస్థకు లోబడి పనిచేయాలని ఆయన తేల్చి చెప్పారు. వ్యవస్థకు మించి వ్యవహారిస్తామంటే ఒప్పుకునేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శాంతి భద్రతల విషయంలో అలసత్వాన్ని సహించబోమన్నారు. ప్రతి ఒక్క అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇక నుంచి క్రైమ్ రివ్యూలు తప్పనిసరిగా నిర్వహించాలని, ఎస్పీలు జిల్లా పర్యటనలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాల్లో ఏం జరుగుతుందో ఐజీ స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. పోలీసు శాఖలో ఈవీ వాహనాలను ప్రవేశపెట్టాలని సూచించారు. నైట్ పెట్రోలింగ్‌ను బలోపేతం చేయాలని, రౌడీ షీట్లపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. కాలం చెల్లిన ఆయుధాలను పక్కన పెట్టి ఆధునిక ఆయుధాలను సమకూర్చుకోవాలని అన్నారు.

నేటినుంచి సరస్వతీ అంత్యపుష్కరాలు

- భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- హాజరు కానున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- విస్తృతంగా ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం

హైదరాబాద్(జనంసాక్షి): సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మే 21వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు ఆరోగ్యం కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ పుష్కర శుభాకాంక్షలు తెలిపారు. మే 21వ తేదీ ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభంకానున్నాయి. తొలి పుష్కర స్నానం కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ చేయనుండగా, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం కానుంది. 12 రోజుల పాటు కొనసాగే ఈ పుష్కరాలకు సుమారు 30 నుంచి 40 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.30.63 కోట్లతో భారీ ఏర్పాట్లు చేపట్టింది. పుష్కర ప్రాంతంలో భద్రత కోసం 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 100 మంది గజ ఈతగాళ్లను నియమించడంతో పాటు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, సేఫ్టీ బోట్లను మోహరించారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక హారతి, తెప్పోత్సవాలకు కూడా భారీ ఏర్పాట్లు చేశారు. అదనంగా రూ.1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయగా, నాగేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. మీడియా సెంటర్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గత సంవత్సరం జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల సందర్భంగా జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంత్య పుష్కరాలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం పకడ్బందీ చర్యలను చేపట్టింది.

మధ్యాహ్నం వేళ ప్రయాణాలు మానుకోండి

ఎండల దృష్ట్యా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన

రాష్ట్రంలో హీట్ వేవ్ దృష్ట్యా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసిన సీఎం

హైదరాబాద్(జనంసాక్షి):ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణలో ఉష్ణ తీవ్రత ఎక్కువగా ఉన్నందు వల్ల అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో హీట్ ?వేవ్ నేపథ్యంలో ఆయన అధికారులకు కీలక సూచనలు చేశారు. విద్యుత్ సరఫరా, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కీలక సూచన చేశారు. వడదెబ్బతో ఆసుపత్రుల్లో చేరితే తగిన వైద్య సహాయం అందించాలన్నారు. పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీలైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయవద్దని ప్రజలకు సూచించారు. జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని సీఎస్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

రైళ్లలో వరుస అగ్నిప్రమాదాలు.. అసాంఘిక శక్తుల పనే..

రైల్వేశాఖ ప్రకటన

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశంలో ఇటీవల జరిగిన రైలు అగ్నిప్రమాదాల వెనుక అసాంఘిక శక్తుల ప్రమేయం ఉందని రైల్వేశాఖ పేర్కొంది. తమ అంతర్గత దర్యాప్తులో ఈ విషయం బయటపడిందని తెలిపింది. ఇవి ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనలు కావని పేర్కొంది.

ఇటీవల రాజస్థాన్‌లోని అమర్‌పుర, కోటా, బిహార్‌లోని ససరాం, బెంగాల్‌లోని హౌరాలో నాలుగు వేర్వేరు రైళ్లలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలపై రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌తో దర్యాప్తు నిర్వహించగా.. పలు కీలక విషయాలు బయటపడినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. అమరపుర ఘటనలో బెడ్డింగ్ మెటీరియల్‌కు నిప్పు పెట్టినట్లు దర్యాప్తులో తేలిందని రైల్వేశాఖ పేర్కొంది. హౌరా ఘటనలో పెట్రోల్‌లో ముంచిన క్లాత్‌ను బోగీ బాత్‌రూమ్‌లో తగలబెట్టినట్లు గుర్తించినట్లు వెల్లడించింది. కోటాలోని రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలులో సైతం బాత్‌రూమ్ నుంచే మంటలు మొదలైనట్లు గుర్తించామని పేర్కొంది. ససరాంలో ఖాళీ బోగీలో గుర్తుతెలియని వ్యక్తి మండే వస్తువును విసిరినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపింది. రైళ్లలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే రైల్వే హెల్ప్‌లైన్ 139కి ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, వారి భద్రతకు రైల్వేశాఖ కట్టుబడి ఉందని తెలిపింది.

టెట్రా ప్యాక్‌లో వోడ్కా అమ్మకాలు వద్దు

ఎవరూ గుర్తించని విధంగా అలాంటి ప్యాకేజీల్లో మద్యం అమ్మకంపై నిషేధం విధించాలి.. కేంద్రానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ(జనంసాక్షి):టెట్రా ప్యాకెట్లు, సాచెట్లలో వోడ్కా విక్రయాలపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎవరూ గుర్తించలేని విధంగా అలాంటి ప్యాకేజీల్లో మద్యం అమ్మకంపై నిషేధం విధించాలని అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. అలాంటి ప్యాకేజీలు వినియోగదారులను తప్పుదారి పట్టించి, మైనర్లను మద్యపానం వైపు ప్రోత్సహించే అవకాశం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తంచేశారు. కమ్యూనిటీ అగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ అనే సంస్థ ఈ పిటిషన్ వేసింది. ఆ సంస్థ తరఫున లాయర్ విపిన్ నాయర్ వాదనలు వినిపించారు. "అలాంటి అనేక మద్యం ఉత్పత్తుల ప్యాకింగ్‌పై సరైన హెచ్చరికలు ఉండటం లేదు. అవి పండ్ల రసాలను పోలి ఉండేవిధంగా ప్యాక్ చేస్తున్న సందర్భాలున్నాయి. అలాంటి ప్యాకేజింగ్‌లో మద్యం అమ్మకాలను నిషేధిస్తూ.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఒకే విధమైన విధానాన్ని రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలి" అని కోరారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అభ్యర్థనను పరిశీలించింది. ఈ ప్యాకింగ్ తప్పుదోవ పట్టించే విధంగా ఉందంటూ కేంద్రం, రాష్ట్రాల్లోని ఎక్సైజ్ విభాగాలకు నోటీసులు జారీ చేసింది. నవంబర్ 2025లో కూడా టెట్రా ప్యాకలలో పెరుగుతోన్న మద్యం అమ్మకాల గురించి సుప్రీం ఆందోళన వ్యక్తంచేసింది.

జనగణనలో కులగణనకు సుప్రీం ఓకే

ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని వివరించింది. అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని తెలిపింది. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జయమల్యా బాగ్చీ, విపుల్ పంచోలీతో కూడిన ధర్మాసనం విచారించింది.

ప్రభుత్వ రాయితీ పొందినప్పుడు

పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిందే

ప్రైవేట్ ఆస్పత్రులకు సుప్రీం కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ భూములను రాయితీ ధరలకు పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు ఆర్థికంగా బలహీన వర్గాలకు తప్పనిసరిగా ఉచిత వైద్య సేవలు అందించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వానికి ప్రామాణిక కార్యాచరణ విధానం రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు ఉచిత చికిత్స అమలు విషయంలో కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ 51 ఆస్పత్రుల్లో కేవలం నాలుగు ఆస్పత్రులే నిబంధనలు పాటిస్తున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రైవేట్ ఆస్పత్రులు తమ ఇన్‌పేషెంట్ విభాగంలో 10 శాతం, అవుట్‌పేషెంట్ విభాగంలో 25 శాతం వరకు ఉచిత చికిత్స అందించడం తప్పనిసరని మరోసారి స్పష్టం చేసింది. 2018లో ఇచ్చిన తీర్పును సమర్థవంతంగా అమలు చేయడానికి స్పష్టమైన విధానం రూపొందించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. న్యాయస్థానం తీర్పును ఉల్లంఘించినట్లు తేలిన 51 ఆస్పత్రుల్లో మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వేంకటేశ్వర, మూల్ చంద్ హాస్పిటల్స్ ఉన్నాయి. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలిన ఆస్పత్రులపై గతంలో ధిక్కరణ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడైంది. ఈ అంశంపై ఢిల్లీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మే 23వ తేదీన ఢిల్లీ సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. 'యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ మూల్‌చంద్ ఖైరతీ రామ్ ట్రస్ట్' కేసులో జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.

ఇటలీతో మా బంధం బలమైనది

మధ్య పెరుగుతున్న నిరంతర చర్చలు, సమావేశాలు ఇరుపక్షాల మధ్య బలపడుతున్న సహకారానికి, పరస్పర నమ్మకానికి నిదర్శనమని మోదీ అన్నారు.

సాంకేతిక రంగంలో పరస్పర సహకారం

సాంకేతికత, ఆవిష్కరణలు మా భాగస్వామ్యానికి చోదక శక్తులు. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం, పౌర అణు ఇంధనం (సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ), అంతరిక్ష రంగాల్లో మా భాగస్వామ్యానికి అపరిమితమైన అవకాశాలు ఉన్నాయి. ఇరుదేశాల్లోని స్టార్టప్‌లు, పరిశోధనా కేంద్రాలు, వ్యాపారాలను అనుసంధానించడానికి మేము భారత్-ఇటలీ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుపై పనిచేస్తున్నాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గడచిన మూడున్నర ఏళ్లలో తనకు, ఇటలీ ప్రధాని మెలోనీతో పలుమార్లు సమావేశం అయ్యే అవకాశం వచ్చిందని మోదీ పేర్కొన్నారు. "ఇది భారత్-ఇటలీ మధ్య ఉన్న సన్నిహిత సహకారానికి, సయోధ్యకు ప్రతిబింబం. ఆమె నాయకత్వంలో మన ఇరుదేశాల సంబంధాలు సరికొత్త వేగాన్ని, నూతన దిశను, ఆత్మవిశ్వాసాన్ని సంతరించుకున్నాయి. మా సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ, ఈ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని మోదీ అన్నారు.

నాగరికత సంబంధాలు

భారత్-ఇటలీ మధ్య ఉన్న నాగరికతా సంబంధాలను కూడా మోదీ హైలెట్ చేశారు. ఇరుదేశాల మధ్య ఉన్న సంబంధాలు కేవలం ఇప్పటివి కావని అన్నారు. ఇటలీ రాజధాని రోమ్ నగరానికి, తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాశి (కాశీ)కి మధ్య ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రధాని మోదీ గుర్తుచేశారు."నాకు, నా ప్రతినిధి బృందానికి ఘన స్వాగతం పలికినందుకు నేను ప్రధాని మెలోనీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రపంచంలో రోమ్ నగరాన్ని శాశ్వత నగరం అని పిలుస్తారు. భారతదేశంలో నా లోక్?సభ నియోజకవర్గమైన కాశీ కూడా శాశ్వత నగరమే. ఈ రెండు గొప్ప నాగరికతలు కలిసినప్పుడు, చర్చలు కేవలం ఒక ఎజెండాకే పరిమితం కావు. అందులో లోతైన చరిత్ర, భవిష్యత్తు వీక్షణం, నిరాండర స్నేహం స్పష్టంగా కనిపిస్తాయి" అని మోదీ పేర్కొన్నారు. ప్రధాని తన ఐదు దేశాల పర్యటనలో భాగంగా నార్వే, స్వీడన్, నెదర్లాండ్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)ల్లో పర్యటించారు. చివరిగా మంగళవారం నాడు ఇటలీ పర్యటనకు వెళ్లారు. ఇటలీ చేరుకున్న ప్రధాని మోదీకి రోమ్‌లో సైనిక వందనం చేస్తూ ఘన స్వాగతం పలికారు. రోమ్ చేరుకున్న వెంటనే ఆయన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనితో ప్రత్యేక విందులో పాల్గొన్నారు. అనంతరం ఇరువురు నేతలు రోమ్‌లోని ప్రఖ్యాత చారిత్రక కట్టడం 'కొలోసియం'ను సందర్శించారు. తర్వాత ఇరుదేశాల నేతలు సమావేశమై వాణిజ్యం, రక్షణ, క్లీన్ ఎనర్జీ, సాంకేతిక రంగాలపై ప్రత్యేకంగా చర్చలు జరిపారు.

దేశ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మోదీ విదేశాల్లో

చాక్లెట్లు పంచుతూ బిజీగా ఉన్నారు

ప్రధానిపై రాహుల్ విమర్శలు..

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాని నరేంద్ర మోదీ ఐరోపా దేశాల పర్యటనలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఆర్థిక సంక్షోభం వల్ల దేశ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధాని మాత్రం ఇటలీలో చాక్లెట్లు పంచుతూ బిజీగా ఉన్నారని దుయ్యబట్టారు. ఇటువంటి చర్యలు నాయకత్వం అనిపించుకోవని..ఓ జిమ్మిక్కు మాత్రమేనని అన్నారు.ప్రధాని మోదీ పిలుపునిచ్చిన పొదుపు చర్యలను ఆయనే పాటించడం లేదని విమర్శించారు. పశ్చిమాసియా సంక్షోభం ఇలాగే కొనసాగితే దేశంలో గ్యాస్, ఎరువులు, ఇంధనాల సరఫరా పూర్తిగా ఆగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనలో భాగంగా ఇటలీ వెళ్లిన మోదీ ఆ దేశ ప్రధాని మెలోనికి 'మెలోడి' చాక్లెట్లు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.ప్రధానిపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను భాజపా అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా తిప్పికొట్టారు. ఆయన చేసే వ్యాఖ్యల వెనుక పాక్ హస్తం ఉందని..అక్కడి నేతలు చెప్పినట్లుగా ఆయన మాట్లాడతారని విమర్శించారు. ప్రధానిని అగౌరవపరచడం అతనికి అలవాటుగా మారిపోయిందన్నారు.

నిప్పుల వాన

రాష్ట్రంలో భానుడి ప్రతాపం..

నిర్మల్‌లో 46.5 డిగ్రీలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. తెలంగాణలో 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా ఏపీలోనూ ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి అత్యధికంగా పిడుగురాళ్లలో 47.6, తెలంగాణలోని నిర్మల్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఏపీలోని కంకిపాడు (కృష్ణా), నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.1 డిగ్రీలు, తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తెలంగాణలోని హనుమకొండలో 46.4, జగిత్యాలలో 46.3, ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరగనుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.



సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం

పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్నది. దీనికి రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరుకానున్నట్టు తెలుస్తోంది. న్యూఢిల్లీ వేదికగా జరగనున్న ఈ సమావేశాలకు పుతిన్ హాజరవుతారని దక్షిణాఫ్రికాలోని రష్యా ఎంబసీ ధ్రువీకరించినట్టు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. జిన్‌పింగ్ కూడా ఈ సమావేశాలకు హాజరయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తోంది. అయితే, చైనా అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. జిన్‌పింగ్ భారత పర్యటనపై ఇప్పటికే అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. 2019లో జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. ఆ తరువాత 2020లో గాల్వాన్ లోయలో ఇరు దేశాల మధ్య తలెత్తిన ఘర్షణలు, 2022లో తవాంగ్ బోర్డర్ వద్ద ఉద్రిక్తతల కారణంగా కొంతకాలం పాటు పరిస్థితులు గంభీరంగా మారాయి. ఆ తరువాత రష్యాలో కజాన్ వేదికగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మోదీ, జిన్‌పింగ్‌లు సమావేశమయ్యారు. భౌగోళిక రాజకీయాలు, ఇరాన్ యుద్ధం విషయంలో బ్రిక్స్ కూటమిలో భేదాభిప్రాయాలు నెలకొన్నాయన్న వార్తల నడుమ తాజా సమవేశాలకు రష్యా, చైనా అధినేతలు హాజరుకానున్నారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ విదేశాంగ శాఖ మంత్రులు, ప్రతినిధుల సమావేశంలో భేదాభిప్రాయాల కారణంగా దేశాల సంయుక్త ప్రకటన ఏదీ వెలువడలేదు.

స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే 'సూర్యాస్త్ర'

విజయవంతంగా రాకెట్ ప్రయోగం

భువనేశ్వర్(జనంసాక్షి):స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా భారత్ మరో ముందడుగు వేసింది. ప్రైవేట్ రంగ రక్షణ సంస్థ అయిన నిబే లిమిటెడ్ తన సుదూర రాకెట్ వ్యవస్థ సూర్యాస్త్ర ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఒడిశాలోని చాందీపూర్ టెస్టింగ్ రేంజ్ నుంచి ఈ పరీక్షను చేపట్టింది. 150-300కి.మీ దూరంలోని లక్ష్యాలపై దాడి చేయగల రెండు రకాల సూర్యాస్త్ర రాకెట్ వేరియంట్లను పరీక్షించింది. 1.5 మీటర్ల నుంచి 2 మీటర్ల కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించినట్లు అధికారులు వెల్లడించారు. దీనిని కొనుగోలు చేయడానికి భారత సైన్యం ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది.

సూర్యాస్త్ర అంటే ఏమిటి?

సూర్యాస్త్ర అనేది ఒక సుదూర గైడెడ్ రాకెట్ ఫిరంగి వ్యవస్థ. శత్రు భూభాగంలోని స్థావరాలు, కమాండ్ సెంటర్లు, రాడార్ కేంద్రాలు లాజిస్టిక్స్ హబ్‌లపై కచ్చితమైన దాడులు చేయడానికి దీనిని రూపొందించారు. సంప్రదాయ ఫిరంగి గుండ్లలా కాకుండా.. ఈ డీప్ స్ట్రైక్ గైడెడ్ రాకెట్లు అధునాతన నావిగేషన్ నియంత్రణ వ్యవస్థల సాయంతో సుదూర ప్రాంతాల్లోని లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదిస్తాయి. త్వరలోనే ఈ సూర్యాస్త్ర భారత అమ్ములపొదిలో చేరనుంది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న క్షిపణి వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి స్వదేశీ సంస్థలు ఈ తరహా ఆయుధ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నాయి.

మమతల తల్లి.. మన కొండా సురేఖమ్మ

□ పసి పిల్లలపై మంత్రి ఆప్యాయత

వరంగల్ ఈస్ట్, మే 20 (జనం సాక్షి) : వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని చందాకాంతయ్య మెమోరియల్ హాస్పిటల్ (సికేఎం) లో ఓ పి రెనవేషన్ కౌంటర్స్, ఫార్మసీ కౌంటర్స్ ప్రారంభోత్సవాలతో పాటు ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు బుధవారం రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓపి విభాగం వద్ద పసి పిల్లలతో ఉన్న తల్లులు కనిపించడంతో ఆప్యాయంగా ప్రేమగా ఆ పిల్లలను ఎత్తుకొని మంత్రి సంతోషాన్ని పంచుకున్నారు. అక్కడికి వచ్చిన వారందరూ కూడా మంత్రి చూపిన ఆప్యాయతకు మురిసిపోయారు.

ఉత్తరాఖండ్ మాజీ సీఎం భవన్ చంద్ర ఖండూరీ మృతి

□ దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన గవర్నర్

హైదరాబాద్ (జనంసాక్షి) : ఉత్తరాఖండ్ మాజీ సీఎం, మేజర్ జనరల్ (రిటైర్డ్) భువన్ చంద్ర ఖండూరి మరణం పట్ల గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు లోక్ భవన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడిగా ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను గవర్నర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. సాయుధ దళాల్లోనూ, ప్రజా జీవితంలోనూ భువన్ చంద్ర ఖండూరి గారు అందించిన సేవలు చిరస్మరణీయమనీ అన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. భువన్ చంద్ర ఖండూరి కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

యువకుడిపై కర్రలతో దాడి..

□ ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

కొత్తగూడెం(జనంసాక్షి) : డబ్బుల విషయంలో జరిగిన గొడవలో దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తుల పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు 2 టౌన్ సీఐ ప్రతాప్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 20 వ తేది రాత్రి 11:40 గంటల సమయంలో కట్ట శ్రీనివాస్, నేరేడుమల్లి నవదీప్ కలిసి కేవీకే వెళ్లే దారిలోని కల్వర్టు వద్ద బొల్లి కార్తీక్‌తో డబ్బుల విషయంలో గొడవపడ్డారు. ఈ క్రమంలో ఇద్దరూ కర్రలతో బొల్లి కార్తీక్ పై దాడి చేయగా అతని ముక్కుకు తీవ్ర గాయమైంది. ఈ ఘటన పై బాధితుడు బొల్లి కార్తీక్ మార్చి 22న పోలీసులకు ఫిర్యాదు చేయగా, కట్ట శ్రీనివాస్, నేరేడుమల్లి నవదీప్‌లతో పాటు ఫోన్‌లో దూషించిన నేరేడుమల్లి సందీప్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితులు కట్ట శ్రీనివాస్, నేరేడుమల్లి నవదీప్‌లను బుధవారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపినట్లు టూ టౌన్ ఇన్స్పెక్టర్ డి. ప్రతాప్ వెల్లడించారు.

వ్యవసాయ బావుల వద్ద మోటార్ పంప్‌సెట్‌లను దొంగతనం

□ నిందితుడు అరెస్ట్, 4 మోటార్లు స్వాధీనం

కడెం, మే 20 (జనంసాక్షి) : వ్యవసాయ బావుల వద్ద మోటర్ పంపు సెట్ లను దొంగలించిన దొంగలు పోలీసులు బుధవారం రోజున పట్టుకున్నారు. ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని కడం పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ బావుల వద్ద జరుగుతున్న ఎలక్ట్రిక్ మోటార్ పంప్‌సెట్‌ల దొంగతనాల కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. కడం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన ఎల్కలపాట గంగరాజం (29) అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి మొత్తం 04 ఎలక్ట్రిక్ మోటార్ పంప్‌సెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 10వ తేదీన కడెం గ్రామంలోని రాజరాజేశ్వర ఇంజినీరింగ్ షాప్ ముందు ఉంచిన ఎలక్ట్రిక్ మోటార్‌తో పాటు, పాత మద్దిపడగ గ్రామానికి చెందిన రైతు వ్యవసాయ బావి వద్ద ఉన్న మోటార్ పంప్‌సెట్ దొంగతనానికి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా విశ్వసనీయ సమాచారం మేరకు కడెం పోలీసులు కొత్త మద్దిపడగ గ్రామ శివారులో తనిఖీలు నిర్వహించి నిందితుడిని పట్టుకున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్ పంప్‌సెట్‌లనుదొంగిలించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. అనంతరం అతని వ్యవసాయ పొలంలో దాచిపెట్టిన 04 మోటార్ పంప్‌సెట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వ్యవసాయ బావుల వద్ద మోటార్ పంప్‌సెట్‌లు దొంగతనానికి గురైన రైతులు ఎవరైనా ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా కడం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఖానాపూర్ సీఐ సూచించారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన ఖానాపూర్ ఇన్స్పెక్టర్ అజయ్, కడెం ఎస్సై సాయి కిరణ్, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి

□ బొగ్గు గ్యాసిఫికేషన్ దిశగా సింగరేణి ముందడుగు

□ కేంద్ర సహకారం కోరిన డిప్యూటీ సీఎం భట్టి

□ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో భేటీ

న్యూఢిల్లీ, మే 20 (జనంసాక్షి) : బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతో పాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసంధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆయన కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్ మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా, భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే, సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సింగరేణి దక్షిణ భారతదేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని తెలిపారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్ తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఈ బ్లాక్ వేలంలో కేటాయించబ డినప్పటికీ నాలుగేళ్లు గడిచినా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్ ఎఎఎను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిచెర్ల కోల్ బ్లాక్ ఎఎ అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ బ్లాక్‌కు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీ-మైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ పక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. తాడిచెర్ల కోల్ బ్లాక్ అభివృద్ధి సింగరేణి భవిష్యత్ అవసరాలకు, తెలంగాణ విద్యుత్ భద్రతకు కీలకమని చెప్పారు. తాడిచెర్ల కోల్ బ్లాక్ చట్టం, 1957లోని సెక్షన్ 5 కింద ముందస్తు అనుమతి మంజూరు చేసి, మైనింగ్ లీజ్ పక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. అంశాలపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సింగరేణి బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రణాళికలు, కొయ్యగూడెం బ్లాక్ ఎఎఎ కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్ మైనింగ్ లీజ్ అంశాలపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ డా. జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ శ్రీ కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

2026 వానాకాలం వ్యవసాయ ప్రణాళికను ప్రకటించాలి

రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో సీనియర్ నాయకులు మల్లారెడ్డి, జూలకంటి, సాగర్

హైదరాబాద్ (జనంసాక్షి) : 2026 వానాకాలం సాగు ప్రణాళికను వెంటనే ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు కారంపల్లి మల్లారెడ్డి కేంద్ర కమిటీ సభ్యులు చులకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. 'మే 24తో రోహిణి కార్తె ప్రవేశిస్తుంది. వర్షాలు పడితే మెట్ట పంటలు వేస్తారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం 2021 నుండి వ్యవసాయ ప్రణాళిక ప్రకటించడం నిలిపి వేసింది. "నాభూమి నా ఇష్టమైన పంట" అనే విధంగా పత్తి, వరి కి మొగ్గ చూపుతున్నారు. ఇప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ప్రణాళిక లేని ఉత్పత్తి వల్ల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, పప్పులు, వంటనూనెలు, మాంసం, చిరుధాన్యాల ఉప ఉత్పత్తులు దిగుమతులు చేసుకుంటున్నాము. వాస్తవానికి హార్టికల్చర్ పంటలను ప్రస్తుతం 12 లక్షల ఎకరాలలో వేస్తున్న వాటిని 25 లక్షల ఎకరాలకు పెంచాలని రైతాంగం కోరుతున్నా నిధుల కేటాయింపు లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ అభివృద్ధిపై సమగ్రమైన ప్రణాళిక లేదని అర్థమౌతున్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల ప్రకారం బ్యాంకులు తమ వ్యాపార ధనంలో 40 శాతం వ్యవసాయ రంగానికి, అనుబంద రంగాలకు రుణాలివ్వాలి. వ్యవసాయ పంట రుణాలకు 18 శాతం ఇవ్వాలి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులందరికీ రుణాలివ్వాలి. 2025-26 యాసంగి 73.94 లక్షల ఎకరాలలో పంటలు వేశారు. వరి- 58.70, ముతక ధాన్యాలు- 15.09, పప్పు ధాన్యాలు -2.46, నూనె గింజలు- 2.44, పొగాకు- 0.11 లక్షల ఎకరాలలో పంటలు వేశారు. 90 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు 8,575 కేంద్రాలను ఏర్పాటు చేసింది. 19.05.2026 నాటికి 40.03 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రైతులకు రూ॥ 6,463 కోట్లు చెల్లించారు. లక్షంలో ఇంకా 50 లక్షల టన్నులు కొనుగోలు చేయాలి. మార్కెట్‌కు వచ్చిన ధాన్యం వారాల తరబడి కొనకుండా గోనె సంచులు, లారీలు, హమాలీలు లేరని, గోదాముల అందుబాటు లేదని కొనుగోలు జాప్యం చేస్తున్నారు. అకాల వర్షాల వల్ల మార్కెట్‌కు తెచ్చిన ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని మంత్రులు ప్రచారం చేస్తున్నారు. ఆచరణలో అమలు జరగటం లేదు. మొక్క జొన్నలు కొనుగోలుకు 120 కేంద్రాలు తెరుస్తామని 70 మాత్రమే తెరిచారు. కొనుగోలు నత్తనడకగా ఉన్నాయి. రెండు రోజుల క్రితం 2026-27కు మద్దతు ధరల నిర్ణయం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇవి నామమాత్రంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు.

'వానాకాలం పంటలు జూన్‌లో వేస్తారు. పంటలు వేసే నాటికి రైతులకు రైతు భరోసా నిధులు జమ చేయాలి. బ్యాంకులలో జమచేసిన ఈ నిధులు ఎలాంటి ఆటంకం లేకుండా రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలి. నిబంధనలు పాటించని బ్యాంకులకు లైసెన్స్‌లు రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు పి జంగారెడ్డి, అరిబండి ప్రసాద్ రావు, మూడ్ శోభన్,ఉడుత రవీందర్, బొంతు రాంబాబు, వీరేపల్లి వెంకటేశ్వర్లు,అన్నవరపు సత్యనారాయణ, కొక్కెరపాటి పుల్లయ్య, మల్లు నాగార్జున రెడ్డి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, మాటూరి బాలరాజు గౌడ్, చందు నాయక్, ఈసంపల్లి బాబు, రామ్ చందర్, ఎం శ్రీనివాస్,డి. బాల్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాల సాధనే ధ్యేయంగా ఉద్యోగులు పునరంకితం కావాలి

□ మందమర్రి జీఎం రాధాకృష్ణ

బెల్లంపల్లి, మే 20 (జనంసాక్షి) : ఉత్పత్తి లక్ష్యాల సాధనే ధ్యేయంగా ఉద్యోగులు పునరంకితం కావాలని మందమర్రి జీఎం రాధకృష్ణ అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని గనిలో సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు సంస్థ వ్యాప్తంగా అన్ని ఏరియాలలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలను నిర్వహించారు. ఇందులో భాగంగా మందమర్రి ఏరియా పరిధిలోని చారిత్రాత్మక, అత్యంత కీలకమైన శాంతిఖని భూగర్భ గని మొదటి, రెండవ, మూడవ షిఫ్ట్ ఉద్యోగులతో ప్రత్యేక మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్షా సమావేశాలను నిర్వహించారు. శాంతిఖని గని ప్రాముఖ్యతపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మందమర్రి ఏరియాలోనే కాకుండా సింగరేణి సంస్థలోనే శాంతిఖని గనికి ఎంతో ఘనమైన చరిత్ర, ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఎన్నో దశాబ్దాలుగా నమ్మకమైన ఉత్పత్తిని అందిస్తూ, ఎంతోమంది నైపుణ్యంగల ఉద్యోగులకు, అధికారులకు శాంతిఖని పుట్టినిల్లుగా నిలిచిందని కొనియాడారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, సంక్లిష్టమైన భౌగోళిక పరిస్థితులను అధిగమించి బొగ్గును వెలికితీయడంలో శాంతిఖని ఉద్యోగుల శ్రమ అమోఘమైనదని, రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో నిర్దేశిత వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించి ఏరియా ప్రగతిలో శాంతిఖని అగ్రగామిగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ విస్తృత స్థాయి సమావేశాలలో కంపెనీ నిర్దేశించుకున్న ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధనపై సుదీర్ఘంగా చర్చించారు. భూగర్భ గనులలో అత్యాధునిక యంత్రాల సరైన వినియోగం, ఉత్పాదకత పెంపుదల, సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ఆర్థిక సంబంధిత విషయాలను అధికారులు ఉద్యోగులకు వివరించారు. కంపెనీ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు, రాబోయే రోజుల్లో ఎదుర్కోబోయే సవాళ్లు, వాటిని అధిగమించి నిర్దేశిత లక్ష్యాలను ఎలా చేరుకోవాలో చర్చించారు. గని ఉద్యోగులు యాజమాన్యం సూచించిన సలహాలు, సూచనలను నిరంతరం పాటించడం ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతను మరింత పెంచవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగులందరూ పూర్తి నిబద్ధతతో, క్రమశిక్షణతో తమకు కేటాయించిన విధులను సకాలంలో నిర్వర్తించడం, పనితనాన్ని మెరుగుపరుచుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించగలమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

నాణ్యత నియంత్రణకు ప్రాధాన్యత...

సింగరేణి సంస్థ తమ భూగర్భ గనుల నుండి వెలికితీసే బొగ్గు నాణ్యతను మరింత మెరుగుపరచడానికి సమగ్ర నాణ్యతా నియంత్రణ చర్యలను చేపట్టి వినియోగదారులకు అత్యుత్తమ శ్రేణి బొగ్గును అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని అన్నారు. బొగ్గును వెలికితీసే క్రమంలో దానితో పాటు రాయి, మట్టి కలవకుండా గని లోపలే తగిన జాగ్రత్తలు వహించాలని స్పష్టం చేశారు. శాంతిఖని గని నుండి వెలువడే బొగ్గు నాణ్యతకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, దానిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కార్మికులందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం జిఎల్ ప్రసాద్, ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, ఎస్కే గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ (ఈ డ ఎం) బాలాజీ భగవతి జ, ఏజీఎం (ఎఫ్‌డఏ) ఆర్వీఎస్ఆర్కే ప్రసాద్, డీజీఎం పర్సనల్ సీహెచ్ అశోక్, డీజీఎం ఐఈడి కిరణ్ కుమార్, క్వాలిటీ ఇంచార్జ్ ప్రదీప్, శాంతిఖని గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, ఐఈడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్, సంక్షేమ అధికారి రవి కుమార్, గని ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలపై తేనెటీగల దాడి

కుల్కచర్ల (జనంసాక్షి) : కుల్కచర్ల మండల పరిధిలోని బోరబండ ప్రాంతంలో బుధవారం ఉపాధి హామీ పనులు జరుగుతుండగా కూలీల పై అకస్మాత్తుగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో 35 మంది ఉపాధి కూలీలు గాయపడ్డారు. వీరందరికి కుల్కచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించారు. ఇద్దరు కూలీల పై దాడి తీవ్రత ఎక్కువగా ఉండడంతో మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు పని సమయాల్లో తగు జాగ్రత్తలు వహించాలని సూచనలు తెలిపారు.

కత్తితో దాడికి పాల్పడ్డ వ్యక్తులపై కేసు నమోదు

వరంగల్ ఈస్ట్, మే 20 (జనం సాక్షి) : వరంగల్ గిర్మాజీపేట కు చెందిన కైఫ్, అతని స్నేహితుడు హరీష్ వీధుల్లో మద్యం సేవిస్తూ బీరు బాటిల్లు పగలగొడుతూ న్యూసెన్స్ చేస్తూ ఉండగా అది గమనించిన అదే ఏరియాకు చెందినటువంటి బూర రత్నసాగర్ అను అతడు వారిని మందలించడం జరిగింది. అది మనసులో పెట్టుకొని నిన్నటి రోజు అనగా ఈనెల 19న రాత్రి సుమారు 11:30 గంటలకు రత్నసాగర్ తన బంధువుల ఇంటికి వెళ్లి వస్తూ ఉండగా గిర్మాజిపేట బొడ్రాయి సమీపంలో పై ఇద్దరు వ్యక్తులు రత్నసాగరును వెంబడించి అతడిని చంపే ఉద్దేశం కత్తితో దాడి చేయగా అతడికి రక్తపు గాయాలు అయినవి. ఆ సమయంలో రత్నసాగర్ తన అన్న మూర్తి కిరణ్ కి ఫోన్ చేసి విషయం తెలుపగా అతని అన్న వారి ఇంటి పక్కన వ్యక్తితో అక్కడికి చేరుకొని రక్తపు గాయాలతో ఉన్న రత్నసాగరును వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం బుధవారం డిస్చార్జ్ అయిన తర్వాత బాధితుడు రత్నసాగర్ వరంగల్ ఇంతే జారుగంజ్ పోలీస్ వారికి ఫోన్ చేసి విషయం తెలుపగా, ఇన్స్పెక్టర్ సుకూర్ సూచన మేరకు ఎస్సై తేజ బాధితుని ఇంటి వద్దకే వెళ్లి దరఖాస్తు తీసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగింది.

దోచుకోవడమే రేవంత్ పని

□ బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర ఆదాయాన్ని దోచుకోవడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా మారిపోయిందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ అన్నారు. నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద ఏర్పాటు చేసిన నిరుద్యోగుల ఆవేదన సభలో పాల్గొని మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టుల ద్వారా రాష్ట్ర ఆదాయన్ని దోచుకునే మీద ఉన్న దృష్టి నిరుద్యోగులకు ఇచ్చిన హామీ అమలు చేయాలని లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఐఏఎస్ అధికారి బిస్వాల్ నివేదిక ప్రకారం 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని.. అధికారం ఇస్తే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. జీవో నంబర్ 46 రద్దు చేస్తామని నిరుద్యోగులను రెచ్చగొట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి కేబినెట్ సమావేశంలో 20 వేల పోస్టులతో మేఘా డీఎస్సీ నోటిఫికేషన్లు వేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. యూత్ డిక్లరేషన్ పేరుమీద ప్రియాంక గాంధీతో హామీ ఇప్పించి ఆమె మాటలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గాలికొదిలేసిందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి హయాంలో పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జాక్ నేతలు కయ్య వెంకటేశ్, కిరణ్ రాథోడ్, కిరణ్, మోహన్, గోపినాథ్, మధు, నాగరాజుగౌడ్, విశాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

తుఫాను ముందు సంకేతాలు

డాలర్ మారకంలో రూపాయి చరిత్రలో ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది. ఇది కేవలం కరెన్సీ మార్కెట్ హెచ్చుతగ్గు మాత్రమే కాదు దేశ ఆర్థిక వ్యవస్థలో లోతుగా పాతుకుపోతున్న సంక్షోభానికి బాహ్య ప్రతిఫలనం. నోట్లు మారవచ్చు, సంఖ్యలు మారవచ్చు. కానీ విశ్వాసం ఒకసారి కదిలితే తిరిగి నిలబెట్టడం సులభం కాదు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్ డీఐ) వెనక్కి వెళ్తున్నాయంటే అర్థం ప్రపంచం భారత్‌పై పెట్టుకున్న నమ్మకం సడలుతోందని. పెట్టుబడిదారుడు లాభాన్ని మాత్రమే చూడడు, స్థిరత్వాన్ని చూస్తాడు. మన విధాన రూపకల్పనలో అస్థిరత, నియంత్రణ వ్యవస్థల్లో అనిశ్చితత్వం ఇవే ఇప్పుడు పెట్టుబడులను వెళ్లగొడుతున్నాయి. అదే సమయంలో విదేశీ మారక నిల్వలు కరగడం ఆందోళన కలిగిస్తోంది. రూపాయిని కాపాడటానికి రిజర్వ్ బ్యాంక్ మార్కెట్లో జోక్యం చేసుకుంటుంది. అంటే మన రక్షణ కవచమే అరిగిపోతోంది. బంగారు నిల్వలు తగ్గడం ఇంకా తీవ్రమైన సంకేతం. అత్యవసర పరిస్థితుల్లో దేశాన్ని నిలబెట్టే చివరి దిక్కు అదే.

పెట్రోల్, డీజిల్ ధరలు ప్రజల జీవన వ్యయాన్ని నేరుగా తాకుతున్నాయి. రూపాయి పతనం వల్ల దిగుమతి అయ్యే చమురు మరింత ఖరీదవుతోంది. ఇది గొలుసు ప్రతిచర్య రవాణా ఖర్చులు పెరుగుతాయి, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతాయి, సామాన్యుడి వంటగది నుండి రైతు పొలం వరకూ దెబ్బ తగులుతుంది. ఈ అన్ని సమస్యలూ వేర్వేరు కాదు, ఒకే నాణేనికి వేర్వేరు పార్శ్వాలు. విదేశీ చెల్లింపుల లోటు పెరుగుతుంటే, నిల్వలు తరిగిపోతుంటే, పెట్టుబడులు పారిపోతుంటే రూపాయి పడిపోవడం తప్పనిసరి పరిణామం. చరిత్ర చెప్పిన పాఠంమన్మోహన్ సింగ్ నేర్పిన దారి.

ఇక్కడ చరిత్రను గుర్తు చేసుకోవడం అత్యవసరం. 2008లో అమెరికా సబ్‌ప్రైమ్ సంక్షోభం ప్రపంచాన్ని కుదిపేసింది. లెహ్మాన్ బ్రదర్స్ కుప్పకూలింది, వాల్‌స్ట్రీట్ వణికింది, యూరప్ తల్లడిల్లింది. ఆ తుఫాను అలలు భారత తీరాన్ని కూడా తాకాయి. సెన్సెక్స్ నేలకు కూలింది, విదేశీ సంస్థాగత పెట్టుబడులు ఒక్కసారిగా వెనుదిరిగాయి, రూపాయి కంపించింది. కానీ అప్పుడు దేశానికి సారథ్యం వహించింది ఒక అసాధారణ మేధావి డాక్టర్ మన్మోహన్ సింగ్. ఆయన కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, ప్రపంచ స్థాయి ఆర్థికవేత్త, 1991లో భారతాన్ని దివాలా అంచు నుండి గట్టెక్కించిన శిల్పి. మొదట ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీలను తెచ్చారు. 2008-09 మధ్య దాదాపు లక్ష కోట్ల రూపాయల ఉద్దీపన చర్యలు ప్రకటించారు. మౌలిక సదుపాయాల కల్పనపై వ్యయం పెంచి, గ్రామీణ ఉపాధిని నిలబెట్టి, వినియోగ శక్తిని చురుకుగా ఉంచారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ డి. సుబ్బారావుతో సమన్వయంతో వడ్డీ రేట్లను తగ్గించి, నగదు ప్రవాహాన్ని సురక్షితంగా నిర్వహించారు. బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్టంగా ఉంచడం వల్ల భారతీయ బ్యాంకులు విదేశీ బ్యాంకుల మాదిరిగా కుప్పకూలలేదు.

అంతర్జాతీయ వేదికలపై జీ20 సమావేశాల్లో మన్మోహన్ సింగ్ భారత్ గొంతు మోగించా రు. ప్రపంచ ఆర్థిక పునర్నిర్మాణంలో భారత్ కీలక భూమిక పోషించేలా చేశారు. ఫలితం.. 2008-09లో ప్రపంచ వృద్ధి రేటు మైనస్‌లో కూరుకుపోయినప్పుడు, భారత్ 6.7 శాతం వృద్ధి సాధించింది. అమెరికా, యూరప్ తీవ్ర మాంద్యంలో కొట్టుమిట్టాడినప్పుడు, భారత్ ఒక స్థిర దీపస్తంభంలా నిలబడింది. ఇది అదృష్టం కాదు, అది సమర్థమైన, నిశ్శబ్ద నాయకత్వం.

ఈరోజు మనం ఎదుర్కొంటున్న సవాళ్లు అప్పటి కంటే భిన్నంగా ఉండవచ్చు, కానీ పరిష్కారాల సూత్రాలు మారవు. నిపుణులకు స్వతంత్రత ఇవ్వడం, సంస్థలను గౌరవించడం, రాజకీయ ప్రకటనలకు బదులు ఆర్థిక వాస్తవాలను గుర్తించడం, ఇవే ఆనాటి విజయ రహస్యాలు. ప్రభుత్వానికి ఇప్పుడు కేవలం స్వల్పకాలిక చర్యలు చాలవు. దిగుమతి వ్యయాన్ని తగ్గించే దీర్ఘకాలిక ఇంధన విధానం, పెట్టుబడులకు అనుకూలమైన విశ్వసనీయ పాలన, ఎగుమతులను పెంచే పారిశ్రామిక వ్యూహం ఇవి తక్షణ అవసరం.

రూపాయి పతనం ప్రభుత్వ వైఫల్యానికి గుర్తు అని ప్రతిపక్షాలు అంటున్నాయి. ప్రపంచ పరిస్థితుల ప్రభావమని అధికార పక్షం చెబుతోంది. నిజం రెండింటిలోనూ ఉంది. కానీ సమాధానం మాత్రం ఒక్కటే అయి ఉంటుంది. సత్వర, సమగ్ర, నిజాయితీగా అమలయ్యే ఆర్థిక సంస్కరణలు. చరిత్ర మనకు అద్దం పట్టింది. మన్మోహన్ సింగ్ దారి చూపించారు. ఇప్పుడు ఆ అద్దంలో మన ముఖం చూసుకుని, సరైన నిర్ణయాలు తీసుకోవడం నేటి నాయకత్వ బాధ్యత.

ఇండో-మెడిటరేనియన్ భాగస్వామ్యం

ఇటలీ, యూరప్‌లోని ప్రాచీన నాగరికతకు ప్రతీక. భారతదేశం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలకమైనశక్తి. ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారాయి. ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోని, భారత ప్రధాని నరేంద్ర మోదీల మధ్య జరిగిన చర్చలు, రెండు దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక, సాంకేతిక, రక్షణ రంగాల్లో సహకారాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇది కేవలం ద్విపక్ష సంబంధాలు మాత్రమే కాదు; ఇండో-పసిఫిక్ అలాగే మెడిటరేనియన్ ప్రాంతాలను అనుసంధానం చేసే "ఇండో-మెడిటరేనియన్" దృక్పథం యొక్క ప్రతీక కూడా. అయితే, ఈ భాగస్వామ్యం యొక్క వాస్తవికతను, సామర్థ్యాన్ని, సవాళ్లను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.
ఇటలీ-భారత దేశాల మధ్య వాణిజ్యం గత కొన్ని సంవత్సరాల్లో గణనీయంగా పెరిగింది. 2024-25లో ద్విపక్ష వాణిజ్యం సుమారు 13.76 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత్ నుంచి ఇటలీకి ఎగుమతులు ఎక్కువగా ఉండటం వల్ల వాణిజ్య బ్యాలెన్స్ భారత్ పక్షాన ఉంది. 2029 నాటికి 20 బిలియన్ యూరోల వాణిజ్య లక్ష్యం నిర్దేశించడం ఆశావహం. "మేక్ ఇన్ ఇండియా"కి ఇటలీ యొక్క అధిక నాణ్యత, ఆటోమోటివ్, మెషినరీ, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లోని నైపుణ్యం పూరకంగా ఉన్నాయి. భారత్‌లో ఇటాలియన్ కంపెనీలు, ఇటలీలో భారతీయ సంస్థలు - ఇది పరస్పర లాభదాయకమైన సహకారానికి ఆధారం అవుతుంది. సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాల్లో సహకారం రెండు దేశాల భవిష్యత్తుకు కీలకం కానుంది. ఇటలీ యొక్క ఇంజనీరింగ్ నైపుణ్యం... భారత్ యొక్క డిజిటల్ టాలెంట్ పూల్ రెండూ కలిస్తే గ్లోబల్ సప్లై చైన్‌లో బలమైన స్థానం సాధించవచ్చు. ఇంధన రంగంలో పునరుత్పాదక ఇంధనాలు, హైడ్రోజన్ టెక్నాలజీలపై సహకారం కూడా ముఖ్యం. ఇటలీ యొక్క అధునాతన సాంకేతికత భారత్ యొక్క ఇంధన మార్పిడి లక్ష్యాలకు సహాయపడుతుంది.
రక్షణ రంగంలో సహకారం మరింత లోతుగా విస్తరిస్తోంది. 2023లో సంతకం చేసిన స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ తర్వాత, కో-ప్రొడక్షన్, కో-డెవలప్‌మెంట్ ఒప్పందాలు జరుగుతున్నాయి. 2026-27 మిలిటరీ కోఆపరేషన్ ప్లాన్ ద్వారా సంయుక్త వ్యాయామాలు, సాంకేతిక బదలాయింపులు పెరుగుతాయి. ఏరోస్పేస్, స్పేస్ టెక్నాలజీల్లో కూడా సహకారం ఉంది. ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఈసీ)లో ఇటలీ యొక్క ట్రీస్ట్ పోర్ట్ కీలక పాత్ర పోషించవచ్చు. ఇది చైనా యొక్క బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌కి ప్రత్యామ్నాయంగా చూడవచ్చు.
అయితే, ఈ భాగస్వామ్యాన్ని విమర్శనాత్మకంగా పరిశీలిస్తే కొన్ని సవాళ్లు కనిపిస్తాయి. వాణిజ్య వాల్యూమ్ ఇంకా సామర్థ్యానికి అనుగుణంగా లేదు. భారత్ యొక్క మొత్తం ఎగుమతుల్లో ఇటలీ వాటా చాలా తక్కువ. భాష, సంస్కృతి, వ్యాపార పద్ధతుల్లో ఉన్న తేడాలు, లాజిస్టిక్స్ ఖర్చులు, (ఎస్.ఎమ్.ఈ.)లకు ఫైనాన్స్ లభ్యత వంటి సమస్యలు కూడా ఉన్నాయి. ఇటలీలో ఇమ్మిగ్రేషన్ నిబంధనలు కఠినంగా ఉండటం వల్ల మానవ వనరుల మార్పిడి పరిమితంగా ఉంది. ఈ సమస్యను పరస్పర సహకారం తో అధిగమించాలి.
జియోపాలిటికల్ సందర్భంలో కూడా సవాళ్లు ఉన్నాయి. ఇటలీ సహజంగా యూరోపియన్ యూనియన్ సభ్యుడు కావటం వల్ల (ఈయూ) నిబంధనలు, చైనా వ్యతిరేక వైఖరి వంటి అంశాలపై ప్రభావం చూపుతాయి. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం, మిడిల్ ఈస్ట్ అస్థిరత వల్ల ఎనర్జీ ధరలు, సప్లై చైన్ సమస్యలు రెండు దేశాలను ప్రభావితం చేస్తున్నాయి. (ఐఎంఈసీ) వంటి ప్రాజెక్టులు పైకి చూడడానికి ఆకర్షణీయంగా కనిపిస్తున్నప్పటికీ, భూ-రాజకీయ (జియో పాలిటిక్స్) సంక్షోభాలు, ఫైనాన్సింగ్ సవాళ్లు, పర్యావరణ ప్రభావాలు వంటి సమస్యలు వాటిని ఆలస్యం చేయవచ్చు.
ఈ సందర్భంలో, భారత్ తన వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటూ ఇటలీతో సహకారాన్ని ముందుకు తీసుకెళ్లాలి. రక్షణ కో-ప్రొడక్షన్‌లో స్థానిక తయారీపై ఎక్కువ దృష్టి పెట్టాలి. సాంకేతిక బదలాయింపులు ఏకపక్షంగా కాకుండా పరస్పర లాభదాయకంగా ఉండేలా చూడాలి. సంస్కృతి, విద్య, టూరిజం రంగాల్లోనూ సహకారం విస్తరించాలి. ఇటలీ యొక్క సాంస్కృతిక (రెనెసాన్స్) వారసత్వం అలాగే భారత్ యొక్క "ధర్మ" భావన ... ఈ రెండూ మానవ కేంద్రీకృత అభివృద్ధికి స్ఫూర్తి ఇవ్వవచ్చు.
ఇటలీ-భారత భాగస్వామ్యం ప్రపంచ దక్షిణ దేశాలు మరియు యూరప్ మధ్య వారధిగా మారాలంటే, మాటలకు మించి చర్యలు అవసరం. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ త్వరగా పూర్తి చేయడం, స్టార్టప్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాములు, జాయింట్ రీసెర్చ్ సెంటర్లు మొదలైనవి ఆచరణాత్మక అడుగులు. ఈ భాగస్వామ్యం విజయవంతమైతే, అది కేవలం రెండు దేశాలకు మాత్రమే కాకుండా, స్థిరమైన, బహుముఖ ప్రపంచ వ్యవస్థకు ఉదాహరణగా నిలుస్తుంది.
అయితే, ఈ ఆశావాదంతో పాటు వాస్తవిక పరిమితులను కూడా మరచిపోకూడదు. భారత్ యొక్క ఆర్థిక వృద్ధి, డెమోగ్రాఫిక్ డివిడెండ్ ఇటలీ యొక్క టెక్నాలజీ ఈ రెండూ కూడా మార్కెట్ అవసరాలతో సమన్వయం చేసుకోగలిగితేనే ఈ భాగస్వామ్యం నిజమైన అర్థం సంతరించుకుంటుంది. ఇది కేవలం ఒక ద్విపక్ష ఒప్పందం కాదు. ఇది 21వ శతాబ్దపు బహుపోలర్ ప్రపంచంలో సహకార మోడల్‌కి ఒక పరీక్ష. దీన్ని విజయవంతం చేయడం రెండు దేశాల నాయకత్వాల మీద, ప్రజల మధ్య అవగాహన మీద ఆధారపడి ఉంటుంది.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

అవినీతిని సమూలంగా నిర్మూలించలేమా..!

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు సేవకులనే భావనతో పనిచేయాలి. కానీ నేటి పరిస్థితులను పరిశీలిస్తే, కొందరు అధికార దర్పంతో వ్యవహరిస్తూ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాలు కొన్నిచోట్ల బ్రోకర్ల అడ్డాలుగా,లంచాల కేంద్రాలుగా మారిపోతుండటం ప్రజాస్వామ్యానికి మచ్చ తెస్తోంది.
ఒక సాధారణ పౌరుడు ప్రభుత్వ కార్యాలయానికి వెళ్తే పని త్వరగా జరగాలంటే "ఎవరినైనా కలవాలి", "మధ్యవర్తిని ఆశ్రయించాలి", "లంచం ఇవ్వాలి" అనే పరిస్థితి ఏర్పడటం దురదృష్టకరం. ఫైల్ కదలాలంటే డబ్బు,ధృవపత్రం రావాలంటే పరిచయం,సంక్షేమ పథకం పొందాలంటే రాజకీయ సిఫారసు అవసర మవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.శ్రమించి (కట్టెలు కొట్టి) సంపాదించికున్న ప్రజల సొమ్ముకు...ప్రజల కడుపులు కొట్టిన అవినీతి సొమ్ముకు స్వభావంలో చాలా తేడా ఉంటుంది. సేవ పేరుతో ప్రజాప్రతినిధులైన వాళ్ళు, జీతం వస్తున్నా కూడా లంచంకు ఆశపడే ప్రభుత్వ ఉద్యోగులు నిస్సాయ స్థితిలో గుడిమెట్ల దగ్గర బిచ్చగాళ్ళ కన్నా అధ్వాన్నం కాదా!. ఈ పరిస్థితులు ప్రజలలో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బ తీస్తున్నాయి.

డిజిటల్ పాలన..కానీ పారదర్శకత ఎక్కడ..?

ప్రభుత్వాలు కంప్యూటరైజేషన్, డిజిటలైజేషన్, ఆన్‌లైన్ సేవలు అంటూ గొప్పలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజలకు ఇంకా ఇబ్బందులు తప్పడం లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందేనన్న పరిస్థితి కొనసాగుతోంది. సాంకేతికత ప్రజల సమయాన్ని ఆదా చేయాలి గానీ, కొత్త రకాల అవినీతి మార్గాలకు కారణం కాకూడదు.కొన్ని శాఖల్లో టెండర్లు, భూ వ్యవహారాలు, సంక్షేమ పథకాలు,కాంట్రాక్టుల మంజూరు వంటి అంశాల్లో భారీ అవినీతి ఆరోపణలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ప్రజల పన్నుల ధనంతో అమలు చేసే పథకాల్లోనే అక్రమాలు చోటుచేసుకుంటే సామాన్యుడికి న్యాయం ఎక్కడ దొరుకుతుంది?.

పదవులు సేవకా-సంపాదనకా..?

ప్రజల సేవ కోసం ఎన్నికైన కొందరు ప్రజాప్రతినిధులు అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి."అవినీతి వటవృక్షానికి-తల్లి వేరు రాజకీయ అవినీతేనని"అనేక అధ్యయనాలు చెప్పాయి. కావున రాజకీయ అవినీతి వటవృక్షాన్నిసమూలంగా పెకిలించాల్సి ఉంది. అప్పుడే అవినీతి రహిత సమాజానికి మార్గం వేయగలం.అంతే కాదు ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన వారు కమీషన్లు, కాంట్రాక్టులు, రాజకీయ లాభాల చుట్టూ తిరుగుతుంటే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుంది. అలాగే జీతాలు ప్రజల పన్నుల ధనంతో తీసుకుంటున్న కొందరు ఉద్యోగులు కూడా బాధ్యత మరచి వ్యవహరించడం బాధాకరం. పని చేయడానికి జీతం సరిపోదన్నట్లు లంచాలకు అలవాటు పడటం సమాజానికి ప్రమాదకరం.సేవా దృక్పథం లేకుండా ఉద్యోగం కేవలం ఆదాయ వనరుగా మారితే ప్రజలు కార్యాలయాలంటేనే భయపడే పరిస్థితి వస్తుంది.

సేవా హక్కు చట్టం కఠినంగా అమలు కావాలి

ప్రజలకు నిర్దిష్ట గడువులో సేవలు అందేలా "సేవా హక్కు చట్టం"ను మరింత కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. పనులను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలి. లంచం తీసుకునే వారిపై కఠిన శిక్షలు అమలు చేస్తేనే వ్యవస్థలో మార్పు కనిపిస్తుంది.అవినీతిని ప్రశ్నించే ధైర్యం ప్రజల్లో పెరగాలి. అదే సమయంలో అవినీతిని బయటపెట్టే వ్యక్తులకు రక్షణ కల్పించాలి. ఫిర్యాదు చేసిన వారినే వేధించే పరిస్థితులు మారకపోతే నిజాయితీ గల పౌరులు ముందుకు రావడం కష్టమే.
ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు, పాలకులు- అధికారులు ప్రజాసేవకులనే భావన పరిపాలనలో ప్రతిఫలించాలి.కార్యాలయాలు భయపెట్టే కేంద్రాలుగా కాకుండా, సమస్యలను పరిష్కరించే సేవా మందిరాలుగా మారాలి. అధికారంలోకి వచ్చిన వారు ఆస్తులు పెంచుకోవడానికి కాదు, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడానికి పని చేయాలి.అవినీతి రహిత పాలన, పారదర్శక వ్యవస్థ, బాధ్యతాయుత పరిపాలన ఏర్పడినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. లేదంటే ప్రజల కష్టార్జిత పన్నుల ధనం కొందరి స్వార్థాలకు బలైపోతూనే ఉంటుంది.ఈ సమాజాన్ని అవినీతి నుంచి రక్షించడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు..ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత కూడా.ఈ ఉమ్మడి బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తూ-అవినీతిని ఈ సమాజం నుంచి నిర్మూలించబడినప్పుడే,అవినీతి రహిత సమాజాన్ని నిర్మించుకోగలం.

మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

సమాజంలో క్షీణిస్తున్న మానవ సంబంధాలు

చదువుకోమన్న తల్లిని హత్య చేసిన కొడుకు

భారతీయ సంస్కృతి ప్రపంచ చరిత్రలో కుటుంబ బంధాలకు, మానవ సంబంధాలకు, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలిచింది. "మాతృదేవో భవ", "పితృదేవో భవ", "ఆచార్యదేవో భవ" వంటి వాక్యాలు కేవలం శ్లోకాలుగా కాదు, భారతీయుల జీవన విధానంగా ఉండేవి. తల్లి ప్రేమను దేవుని కరుణతో, తండ్రి త్యాగాన్ని పర్వతంతో, కుటుంబ బంధాలను జీవనాధారంగా భావించిన సమాజం మనది. ఒకప్పుడు కుటుంబం అంటే కేవలం కలిసి నివసించే వ్యక్తుల సమూహం కాదు; అది ప్రేమ, బాధ్యత, గౌరవం, త్యాగం, పరస్పర అండదండల సమాహారం.
కానీ నేడు ఆ బంధాల పునాదులు కదులుతున్నాయి. ప్రేమ స్థానంలో కోపం, గౌరవం స్థానంలో అహంకారం, ఆప్యాయత స్థానంలో అనుమానం చోటు చేసుకుంటున్నాయి. విజయనగరం జిల్లాలో చదువుకోమని మందలించిన తల్లిని 16 ఏళ్ల కొడుకు కత్తితో పొడిచి హత్య చేయడం ఈ సామాజిక పతనానికి అత్యంత భయంకరమైన ఉదాహరణ. ఇది కేవలం ఒక కుటుంబ విషాదం కాదు; సమాజం ఎటు దారితీస్తుందో చూపించే అద్దం. తల్లి అనే పదం వినగానే గౌరవంతో తల వంచే దేశంలో, కన్న కొడుకే తల్లి ప్రాణం తీయడం మానవత్వం మట్టిలో కలిసిపోతున్న సంకేతం.
ఒకప్పుడు పిల్లలు తల్లిదండ్రుల కాళ్ల దగ్గర కూర్చొని జీవన విలువలు నేర్చుకునేవారు. ఇప్పుడు మొబైల్ స్క్రీన్‌ల ముందు కూర్చొని హింస, రౌడీయిజం, మాఫియా సంస్కృతి నేర్చుకుంటున్నారు. చిన్న పిల్లల చేతుల్లో ఫోన్లు పెట్టి, వారు ఏం చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఎలాంటి కంటెంట్ ప్రభావానికి లోనవుతున్నారు? అనే విషయాలను చాలా కుటుంబాలు పట్టించుకోవడం లేదు. ఇంట్లో సంభాషణలు తగ్గిపోయాయి. తల్లిదండ్రులతో మాట్లాడే సమయం తగ్గి, డిజిటల్ ప్రపంచంతో గడిపే సమయం పెరిగింది. ఒకప్పుడు కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేసే సమయంలో నవ్వులు, చర్చలు, ఆప్యాయతలు పంచుకునేవారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో ఒక మొబైల్ ఉంది, కానీ ఒకరితో ఒకరికి మాట లేదు. ఈ మౌనం క్రమంగా భావోద్వేగ దూరాన్ని పెంచుతోంది. ప్రేమతో చెప్పే మందలింపును కూడా పిల్లలు నియంత్రణగా భావిస్తున్నారు. "చదువుకో", "జాగ్రత్తగా ఉండు", "మంచి మార్గంలో నడువు" అని చెప్పే తల్లిదండ్రులను శత్రువులుగా చూడడం ప్రారంభమైంది.
ఈ పరిస్థితికి ప్రధాన కారణం విలువల విద్య క్షీణత. పాఠశాలల్లో మార్కుల కోసం పోటీ పెరిగింది. కానీ మనిషిగా ఎలా జీవించాలో చెప్పే విద్య తగ్గిపోయింది. నైతిక విలువలు, కుటుంబ గౌరవం, పెద్దల పట్ల మర్యాద వంటి అంశాలు విద్యార్థుల జీవితాల్లో కనుమరుగవుతున్నాయి. చదువులో తెలివిగా ఉన్నప్పటికీ, భావోద్వేగ పరిపక్వత లేని తరం తయారవుతోంది. చిన్న విషయానికే కోపావేశాలు, హింసాత్మక ప్రవర్తన, ఆత్మహత్యలు, కుటుంబ హత్యలు పెరుగుతున్నాయి.
సినిమాలు, వెబ్ సిరీస్‌లు, సోషల్ మీడియా కూడా యువత మనస్తత్వాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. రౌడీయిజం, మాఫియా సంస్కృతి, గ్యాంగ్ జీవితం, హింసాత్మక ప్రవర్తనను హీరోయిజంగా చూపించడం యువతలో తప్పు ఆకర్షణను పెంచుతోంది. విజయనగరం ఘటనలో ముంబై వెళ్లి మాఫియా గ్యాంగ్‌లో చేరాలని ఆ బాలుడు ఆలోచించడం యాదృచ్ఛికం కాదు. ఇది మీడియా ప్రభావం ఎంత లోతుగా యువత మనసుల్లోకి చొచ్చుకుపోయిందో తెలియజేస్తోంది.
ఆర్థిక స్వేచ్ఛ, వినియోగదారుల సంస్కృతి, డబ్బు ప్రాధాన్యత కూడా కుటుంబ బంధాలపై ప్రభావం చూపుతున్నాయి. డబ్బు సంపాదన కోసం తల్లిదండ్రులు రోజంతా పనుల్లో మునిగిపోతున్నారు. పిల్లలకు సమయం కేటాయించలేకపోతున్నారు. పిల్లలు ఒంటరితనంలో పెరుగుతున్నారు. ఆ ఒంటరితనాన్ని ఫోన్లు, చెడు స్నేహాలు, హింసాత్మక కంటెంట్ ఆక్రమిస్తున్నాయి.
ఒకప్పుడు భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. తాత అమ్మమ్మలతో కలిసి జీవించడం, పెద్దల అనుభవం వినడం, అన్నదమ్ముల ఐక్యత, అక్కచెల్లెళ్ల ఆప్యాయత మన సంస్కృతికి మూలస్తంభాలు. కానీ ఇప్పుడు సంయుక్త కుటుంబ వ్యవస్థ కూలిపోతోంది. వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయి. తల్లిదండ్రులను చూసుకోవడం బాధ్యతగా కాక భారంగా భావించే పరిస్థితులు పెరుగుతున్నాయి. వేదకాలం నుంచి ఆధునిక కాలం వరకు మానవ సంబంధాల బలం ఎలా మారిందో పరిశీలిస్తే, ఒకప్పుడు 95 నుంచి 100 శాతం స్థాయిలో ఉన్న కుటుంబ బంధాలు, నేడు 20 నుంచి 30 శాతం స్థాయికి పడిపోయాయనే సామాజిక విశ్లేషణలు ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతికంగా ఎదిగినా, మానవత్వాన్ని కోల్పోతున్న సమాజంగా మారుతున్నామనే సంకేతం ఇది.
అయితే పరిస్థితి పూర్తిగా చేతులు దాటిపోలేదు. ఇంకా మార్పుకు అవకాశం ఉంది. తల్లిదండ్రులు పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడాలి. ఫోన్ కన్నా కుటుంబానికి ప్రాధాన్యత ఇవ్వాలి. పిల్లల భావోద్వేగాలను అర్థం చేసుకోవాలి. ప్రేమతో చెప్పే మాటలు, కలిసి గడిపే సమయం, కుటుంబ భోజనాలు, పండుగల సంబరాలు మళ్లీ కుటుంబ బంధాలను బలపరచగలవు.
పాఠశాలల్లో నైతిక విలువలు, మానవ సంబంధాల ప్రాముఖ్యత, మానసిక ఆరోగ్య అవగాహన తప్పనిసరిగా బోధించాలి. సినిమాలు, మీడియా హింసను మహిమాపరచకుండా, కుటుంబ బంధాలను గౌరవించే కంటెంట్‌ను ప్రోత్సహించాలి. సమాజం మొత్తం కలిసి కుటుంబ వ్యవస్థను కాపాడే బాధ్యత తీసుకోవాలి. విజయనగరం ఘటన మనకు ఒక కఠినమైన హెచ్చరిక. తల్లిని కత్తితో పొడిచి చంపిన సంఘటనను కేవలం ఒక నేరంగా చూడకూడదు. ఇది మనం ఎటు వెళ్తున్నామో ఆలోచింపజేసే ఘోర సంకేతం. పిల్లలకు మంచి విద్య ఇవ్వడం మాత్రమే కాదు, మంచి మనసు కూడా నేర్పాలి. డబ్బు సంపాదించడం మాత్రమే కాదు, సంబంధాల విలువను కూడా చెప్పాలి. భారతదేశం మళ్లీ మానవ సంబంధాల ఆదర్శ దేశంగా నిలవాలంటే ప్రతి ఇంట్లో ప్రేమ పెరగాలి. ప్రతి కుటుంబంలో సంభాషణ పెరగాలి. ప్రతి మనిషిలో మానవత్వం మేల్కొనాలి. తల్లి తండ్రిని గౌరవించే పిల్లలు, పిల్లలను ప్రేమతో అర్థం చేసుకునే తల్లిదండ్రులు, పెద్దలను ఆదరించే కుటుంబాలు పెరిగితేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది.మానవ సంబంధాలను కాపాడటం అంటే కేవలం కుటుంబాన్ని కాదు; మన సంస్కృతిని, మన భవిష్యత్తును, మన భారతదేశాన్ని కాపాడటమే.
ప్రేమ, గౌరవం, సహనం, సంభాషణ తిరిగి కుటుంబాల్లోకి రావాలి. అప్పుడే మన సమాజం మళ్లీ మనుషుల మధ్య బంధాల వెలుగుతో ప్రకాశిస్తుంది.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

సిరా ఆరినా.. సమస్యలు ఆరని బతుకులు!

తెల్లవారుజామున నాలుగు గంటలు పక్షుల కిలకిలారావాల కంటే ముందే గ్రామాల్లో, పట్టణాల్లో ఒక వింత నిశ్శబ్దం అలుముకుని ఉంటుంది. కానీ ఆ రోజు మాత్రం వాతావరణంలో ఏదో తెలియని ఉద్వేగం. అది ఎన్నికల ఉదయం. ఆకాశంలో నారింజ రంగు వెలుగు ఇంకా పూర్తిగా పరుచుకోకముందే, పోలింగ్ కేంద్రాల బయట పాములా మెలికలు తిరుగుతున్న క్యూ లైన్లు కనిపిస్తాయి. ఆ లైన్ లో అందరూ సమానమే. అక్కడ హోదా లేదు, ఆస్తిపాస్తుల పట్టింపు లేదు. ఆ క్యూలో రిక్షా తొక్కుతూ ఒళ్ళంతా హూనం చేసుకునే రాజయ్య ఉన్నాడు. ఎండనక వాననక పొలం కాపలా కాస్తూ, మట్టినే నమ్ముకున్న లక్ష్మమ్మ ఉంది. కండలు కరిగించి మేడలు కట్టే మేస్త్రీ సోమయ్య ఉన్నాడు. చిరిగిన చెప్పులను కుడుతూ, జీవితపు అతుకులను సరిచేసుకునే ముసలి నరసయ్య ఉన్నాడు. వీరందరూ తమ వంతు కోసం వేచి చూస్తున్నారు. వారి చేతుల్లో ఉన్న ఓటరు కార్డు వారి ఆత్మగౌరవ పత్రం. లోపలికి వెళ్లి, ఆ చిన్న యంత్రం మీద తమకు నచ్చిన గుర్తును నొక్కినప్పుడు కలిగే ఆ తృప్తి వర్ణనాతీతం. ఆ క్షణంలో రాజయ్యకు, నరసయ్యకు ఒక గర్వం కలుగుతుంది. తమ వేలికి పడిన ఆ నీలి రంగు సిరా చుక్కను చూసుకుని వాళ్ళు మురిసిపోతారు. ఈ దేశాన్ని నడిపించే సత్తా నా వేలికి ఉంది, నా ఓటుతో నేను చరిత్రను మారుస్తాను అన్న ఆశ వారి కళ్ళలో మెరుస్తుంది.
ఫలితాలు వస్తాయి. గెలిచిన నాయకుడి ఇంటి ముందు బాణసంచా పేలుతుంది. పూలమాలలు, రంగుల జెండాలు, గెలుపు నినాదాలు మిన్నంటుతాయి. కానీ ఆ హడావుడి తగ్గాక మళ్ళీ అదే నిశ్శబ్దం. రాజయ్య మళ్ళీ తన పాత రిక్షాను బయటకు తీస్తాడు. లక్ష్మమ్మ మునుపటి లాగే చెమటలు చిందుస్తూ పొలానికి వెళ్తుంది. సోమయ్య కూలి పనుల కోసం అడ్డా దగ్గర నిలబడతాడు. నరసయ్య తన కుట్టు మిషన్ ముందు కూర్చుంటాడు. ఎన్నికల రోజున వాగ్దానాలు చేసిన నాయకులు ఇప్పుడు ఏసీ గదుల్లో ఉంటారు. కానీ ఈ సామాన్యుల జీవితాలు మాత్రం గాలికెగిరిన కాగితాల్లా అలాగే ఉంటాయి. వారి పేదరికం ఇంచు కూడా కదలదు. వారి పిల్లల భవిష్యత్తు చీకట్లోనే మగ్గిపోతుంది. ఐదు సంవత్సరాల పాటు ఆ రాజయ్య ఓటు విలువ అక్షరాలా సున్నా.నిజానికి మన దేశంలో ఎన్నికలు అంటే ఒక ప్రజాస్వామ్య పండుగ అంటారు కానీ, అది ఒక మాయా విక్రయం గా మారిపోయింది. ఎన్నికల ముందు గల్లీల్లో కార్యకర్తల సందడి మామూలుగా ఉండదు. బియ్యం బస్తాలు, రంగుల చీరలు, మందు సీసాలు, గుట్టుచప్పుడు కాకుండా చేతులు మారే నగదు నోట్లు.. ఇవి పేదవాడి ఆకలిని, అవసరాన్ని పెట్టుబడిగా మార్చుకుంటాయి. ఒక పేద ఓటరు ఆ క్షణంలో తప్పు చేస్తున్నానని అనుకోడు. ఎవరు గెలిచినా మనకేం వస్తుంది? కనీసం ఈ ఐదు వందలైనా ఇప్పుడొస్తున్నాయి కదా అన్నది అతని ఆవేదన.ఒక పేద కుటుంబానికి ఐదు వందల రూపాయలు అంటే రెండు రోజుల కష్టార్జితం. ఆ డబ్బుతో వాళ్ళు ఆ రోజు కడుపు నిండా భోజనం చేయగలరు. కాబట్టి దీన్ని నైతిక పతనంగా చూడలేం. ఇది వ్యవస్థ సృష్టించిన ఆర్థిక ఒత్తిడి. పేదవాడు తన ఓటును అమ్ముకోవడం లేదు, తన జీవితం మీద ఆశ వదిలేసుకుని ఒక తాత్కాలిక ఉపశమనాన్ని పొందుతున్నాడు. ఎందుకంటే, ఎవరికి ఓటు వేసినా తన బతుకు మారదు అనే చేదు నిజాన్ని అతను దశాబ్దాలుగా అనుభవిస్తూనే ఉన్నాడు. ఇది కేవలం ఓటర్ల తప్పు కాదు, వ్యవస్థ ప్రజలకు కల్పించాల్సిన భరోసాను ఇవ్వలేకపోవడం వల్ల కలిగిన దుస్థితి.ఎన్నికల ప్రచారంలో నేతలు వేదికల మీద ఊగిపోతూ మాట్లాడతారు. మీరే నా బలం మీ బిడ్డగా మీ కష్టాలు తీరుస్తా అని కన్నీరు పెట్టుకుంటారు. సామాన్యులు ఆ మాటలకు కరిగిపోతారు. కానీ గెలిచిన మరుక్షణమే ఆ నేత ప్రయాణించే కారు మారుతుంది, అతని చుట్టూ ఉండే భద్రతా వలయం మారుతుంది. చివరకు అతను మాట్లాడే భాష కూడా మారిపోతుంది. ఒకప్పుడు తన భుజం మీద చేయి వేసి పలకరించిన నేతను కలవడానికి రాజయ్య వెళితే.. సారు బిజీగా ఉన్నారు, అపాయింట్‌మెంట్ లేదు అని అనుచరులు తోసేస్తారు.ఆ ఐదేళ్ల కాలంలో రాజయ్యకు పాలనలో ఎలాంటి భాగస్వామ్యం ఉండదు. కేవలం వార్తాపత్రికల్లో తన గ్రామంలో రోడ్డు వేస్తున్నట్లు, లేదా ఫ్లై ఓవర్ ప్రారంభించినట్లు ఫోటోలు చూసి మురిసిపోవడమే. కానీ వాస్తవానికి అతని ఊరిలో రోడ్లు గుంతలమయంగానే ఉంటాయి, ఆసుపత్రిలో కనీసం పారాసిటమాల్ బిళ్ళ కూడా దొరకదు. అభివృద్ధి అనేది అక్షరాల్లో తప్ప, పేదవాడి కంచంలోకి చేరదు.మన ప్రజాస్వామ్యంలో పేదవాడి ఓటు శక్తిహీనంగా మారడానికి ప్రధానంగా నాలుగు కారణాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, బడ్జెట్ కేటాయింపులు, నాయకుల పనితీరుకు సంబంధించిన నిజమైన గణాంకాలు పేదవారికి చేరవు. వారు చూసే టీవీ ఛానళ్లు కేవలం రాజకీయ రంగులనే ప్రసారం చేస్తాయి తప్ప, వాస్తవాలను కాదు. అజ్ఞానంలో ఉన్న ఓటరును మోసం చేయడం పాలకులకు చాలా సులభం.కార్పొరేట్ దిగ్గజాలకు తమ హక్కుల కోసం పోరాడే లాబీయిస్టులు ఉంటారు. కానీ రాజయ్యలు, సోమయ్యలు చెల్లాచెదురుగా ఉంటారు. వారు తమ గొంతును ఒక్కటిగా వినిపించే వేదికలు లేవు. రాజకీయ పార్టీలు వీరిని కేవలం ఒక 'ఓటు బ్యాంకు'గా మాత్రమే చూస్తాయి తప్ప, ఒక నిర్ణయాత్మక శక్తిగా గుర్తించవు. కడుపు నిండిన వాడు హక్కుల గురించి పోరాడతాడు. కానీ పూట గడవని వాడు ఆ రోజు పని దొరుకుతుందా లేదా అని ఆలోచిస్తాడు. ఈ ఆర్థిక నిస్సహాయతే అతడిని రాజకీయ పోరాటాలకు దూరం చేస్తోంది. ఒక పక్క అభివృద్ధి జరుగుతున్నట్లు బిల్లులు పాస్ అవుతాయి, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంటుంది.అయితే, ఇదంతా చూసి ఓటు వేయడం దండగ అని అనుకుంటే అది మనల్ని మనం మోసం చేసుకోవడమే అవుతుంది. ఓటు అనేది కేవలం ఎన్నికల రోజున వేసే ముద్ర కాదు, అది ఐదేళ్ల పాటు నాయకుడిని ప్రశ్నించే లైసెన్స్. మన దగ్గర అధికారం లేదని పేదవాడు భయపడకూడదు. రాజ్యాంగం ఇచ్చిన ఓటు అనే వజ్రాయుధాన్ని ఎలా వాడాలో తెలుసుకోవాలి. పేద పిల్లలు చదువుకోవాలి. చదువుకున్న వాడు ప్రశ్న అడుగుతాడు. తన హక్కులు ఏమిటో గ్రహిస్తాడు. ఒక తరం విద్యావంతులైతే, ఆ తర్వాత తరం ఓటును ఎవరో కొనలేరు. పంచాయతీలు, గ్రామ సభలు సజీవంగా ఉండాలి. బడా నాయకుల కంటే తన కంటికి కనిపించే సర్పంచ్‌ను, వార్డు మెంబర్‌ను నిలదీయగలిగే ధైర్యం ప్రజల్లో రావాలి.ఆర్టీఐ చట్టం గురించి ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలి. మా ఊరికి వచ్చిన నిధులు ఏమయ్యాయి అని ప్రశ్నించిన రోజున ఏ నాయకుడూ నిర్లక్ష్యంగా ఉండలేడు. కేవలం జెండాలు మోయడానికే కాకుండా, రాజకీయాల్లో మార్పు తేవడానికి విద్యావంతులైన యువత ముందుకు రావాలి.ప్రజాస్వామ్యం అంటే కేవలం పాలకులు మారడం కాదు, పాలన సామాన్యుడి ముంగిట తలవంచడం. రాజయ్య ఓటు వేసినప్పుడు ఉన్న ఆ గర్వం ఐదేళ్ల పాటు అతని కళ్ళలో ఉండాలంటే, మనం కేవలం ఓటర్లుగానే కాదు, బాధ్యతాయుతమైన పౌరులుగా మారాలి. మన మౌనం పాలకులకు బలం అవుతుంది, మన ప్రశ్న వారిలో జవాబుదారీతనాన్ని పెంచుతుంది. ఎన్నికల సిరా వేలి మీద ఆరిపోయినా, మన హక్కుల నిప్పు గుండెల్లో ఆరిపోకూడదు. రాజయ్య రిక్షా టైర్లు అరిగిపోవచ్చు, కానీ అతను తన ప్రతినిధిని ప్రశ్నించే గొంతు మాత్రం ఎప్పుడూ పదునుగా ఉండాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఆ మార్పు మనతోనే మొదలవ్వాలి.

డా .సూర్యదేవర రామకృష్ణ,
9490754169

యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

● తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

వెల్దండ, మే 20 (జనంసాక్షి) : యువత క్రమశిక్షణ తోపాటు, నాయకత్వ లక్షణాలతో క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాచూర్ గ్రామంలో గత వారం నుంచి నిర్వహించిన (ఆర్పిఎల్) క్రికెట్ టోర్నమెంట్ ముగింపు ఆయన ముఖ్య అతిథులుగా హాజరై గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోలి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కావని, యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి స్నేహభావాన్ని పెంపొందించే సాధనమన్నారు. ముఖ్యంగా క్రికెట్ ఆటలో గెలుపు, ఓటములు సహజమని, కానీ క్రీడాస్ఫూర్తి అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలవాలనే లక్ష్యంతో ఆడాలని, అదే సమయంలో పరస్పర గౌరవం మరియు క్రమశిక్షణను పాటించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి టోర్నమెంట్‌లు మంచి అవకాశాలుగా నిలుస్తాయని పేర్కొంటూ, భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని యువతకు ఆకాంక్షించారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో వెల్దండ మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుట్టా రామిరెడ్డి, జిల్లా నాయకులు నాగులు నాయక్, సర్పంచ్గన్నేళ్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గణేష్,మాజీ ఎంపీపీ గోవర్ధన్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, కల్వకుర్తి మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సింగం విజయ్ గౌడ్, మాజీ సర్పంచ్ పవన్ కుమార్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, తాజుదిన్, రాజు, రమేష్, నగేష్, వార్డు సభ్యులు నరేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత ఉండాలి

● రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 20 (జనంసాక్షి) : ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు.బుధవారం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం అత్యంత పారదర్శకంగా,ఖచ్చితమైన విచారణతో బాధ్యతాయుతంగా పని చేస్తుందని స్పష్టం చేశారు.రాజకీయ నాయకులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు.ఇందుకోసం ప్రతి రాజకీయ పార్టీ తక్షణమే తమ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి,ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని,అధికారులతో రాజకీయ నాయకులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు.జూన్ 15 నుండి బూత్ స్థాయి అధికారులకు పూర్తిస్థాయి శిక్షణ,బిఎల్ఓలచే ఇంటింటి సమగ్ర విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు.

బీఎల్ఓల పాత్ర అత్యంత కీలకం

కొత్త ఓటర్ల నమోదు, జాబితా ప్రక్షాళనలో బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి క్షుణ్ణంగా విచారణ చేసిన అనంతరం మాత్రమే కొత్త ఓటరు నమోదు ప్రక్రియ చేపడతారని, స్థానికంగా చనిపోయిన వారి పేర్లను తొలగించడం,వలస వెళ్లిన వారిని గుర్తించడంతో పాటు అర్హులైన కొత్త ఓటరు ఎవరూ కూడా జాబితాలో చేర్చే బాధ్యత బీఎల్ఓలపై ఉందని కలెక్టర్

స్పష్టం చేశారు. 1-10-2026 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతి యువతీ,యువకుడు తప్పనిసరిగా ఫామ్-6 ద్వారా కొత్త ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.అలాగే ఓటర్ల జాబితాలో తప్పుల సవరణలు,మార్పులు,చేర్పుల కోసం ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ఒక దృఢమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు ప్రక్రియలో సహకరించాలని కోరారు.బహుళ అంతస్తుల మరియు ఎత్తైన భవనాల్లో నివసించే ఓటర్లకు ప్రస్తుతం వారి నివాసాలకు దూరంగా ఉన్న వేర్వేరు పోలింగ్ కేంద్రాలను కేటాయించినందున,అటువంటి భవనాల్లోనే కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల దృష్ట్యా,ఓటర్ల జాబితా నుండి నకిలీ నమోదులను తొలగించాలని మరియు మరణించిన ఓటర్ల పేర్లను తొలగించాలని కోరారు.సంబంధిత ఎన్నికల నమోదు అధికారులకు'ఆదేశాలు జారీ చేసి, 'బూత్ స్థాయి అధికారుల'ఖాళీలు ఏర్పడిన వెంటనే వాటిని తక్షణమే భర్తీ చేసేలా చూడాలని కోరారు.ఒకే ఇంటి నంబరు కింద 50 మందికి పైగా ఓటర్లు ఉన్న గృహాలను గుర్తించి,భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఆ కేసులను పరిశీలించి,అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సార్ 2002 ఓటర్ల జాబితా నకళ్లను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయాలని కోరారు.సార్ ప్రక్రియ ప్రారంభానికి ముందే,రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో బిఎల్ ఓలు పర్యవేక్షకులు సరైన శిక్షణ నిర్వహించాలని కోరారు.ఓటర్ల గణన పత్రాలను ఏదేని అనధికార వ్యక్తికి గుంపుగా కాకుండా,కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగానే పంపిణీ చేయాలని ఈఆర్ఓ అందరికీ ఆదేశాలు ఇవ్వాలని కోరారు.ఓటర్ల గణన పత్రాల డేటా ఎంట్రీ (దత్తాంశ నమోదు) సమయంలో,నిర్దేశిత విధానాన్ని కచ్చితంగా పాటించాలని సూచించారు. డేటా ఎంట్రీ ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా,పారదర్శకత మరియు కచ్చితత్వాన్ని పాటించేలా చూడాలని కోరారు. జిహెచ్ఎంసి పరిధిలోకి వచ్చే పోలింగ్ కేంద్రాల వివరాలను నియోజకవర్గాల వారీగా అందజేయాలని కోరారు. అనంతరం,రాజకీయ పార్టీలతో పంచుకోవడం జరుగుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులందరికీ తెలిపారు. ఈ సమావేశంలో మర్రి శశిధర్ రెడ్డి, (బీజేపీ),అంబోజీశ్రీనివాస్(బిజెపి),కొప్పుల నర్సింహా రెడ్డి, (బీజేపీ), వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి(బీజేపీ), తులసిముభేష్ ముదిరాజ్ (బిజెపి), సరికొండ దుర్గేష్ (బీఆర్ఎస్), యాదయ్య (బీఆర్ఎస్), వి.నవీన్ కుమార్ (బీఆర్ఎస్), పి.ధర్మ రెడ్డి (బీఆర్ఎస్), జిల్లా రెవెన్యూ అధికారి శారద, ఆర్డీఓలు అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సరిత, ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో కాంగ్రెస్ భారీ నిరసన

● పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను ఖండిస్తూ, ఎడ్ల బండి, రిక్షా ర్యాలీ

కరీంనగర్ బ్యూరో, మే 20 (జనంసాక్షి) : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను వ్యతిరేకిస్తూ బుధవారం రోజు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఇందిరా చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కొనసాగింది. చొప్పదండి ఎమ్మెల్యే , కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్య లతో పాటు పలువురు నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.మేడిపల్లి సత్యం, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఎడ్ల బండ్ల పై ఎక్కి నిరసన తెలపగా, పార్టీ శ్రేణులు రిక్షా పై ద్విచక్ర వాహనాలను ఎక్కించి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించినారు. అనంతరం జిల్లా కలెక్టర్ కి రాసిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ కి అందజేశారు. డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. ఎన్నికల అనంతరం పెట్రోల్, డీజిల్ ఇంధన ధరలు పెరుగుతాయని తస్మాత్ జాగ్రత్త అని మా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ముందే హెచ్చరించారు. వారు చెప్పినట్లుగానే ఎన్నికలు ముగిసిన వారం రోజుల వ్యవధిలోనే పెట్రోల్, డీజిల్ ఇంధన ధరలను అమాంతం పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తోందని అన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ పేద ప్రజల ఉసురు పోసుకోకుండా పెంచిన పెట్రోల్, డీజిల్ ఇంధన ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్

మాట్లాడుతూ... బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు వాగ్దానాలు ఎన్నికల తర్వాత ధరల పెంపు సిద్ధాంతాలతో పనిచేస్తుందని మండిపడ్డారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధర తగ్గినప్పటికీ ఇంధన ధరలు మాత్రం పెరుగుతూ ఉన్నాయని, దాని ద్వారా నిత్యావసర ధరలు పెరుగుతూ ప్రజల జీవనం సమస్యగా మారిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కటకంమృత్యుంజయం మాట్లాడుతూ... ఇంధన ధరల పెరుగుదలతో రైతులు, ఆటో కార్మికులు, చిన్న వ్యాపారులు, కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై భారం వేస్తున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇంధన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున రాజేందర్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, ఉప్పుల అంజనీ ప్రసాద్,చాంద్ పాషా, ఎండి తాజ్, పులి ఆంజనేయులు గౌడ్ , ముత్యం శంకర్ గౌడ్, నునావత్ భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి

● అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, మే 20 (జనం సాక్షి) : నందిగామ మండలశీ చాకలిగుట్ట తండా పరిధిలోని అయ్యప్ప టెంపుల్ (రెడ్డి) కాలనిలో బుధవారం సర్పంచ్ గబ్రు చౌహాన్ నేతృత్వంలో సుమారు 20లక్షల రూపాయల వ్యయంతో అండర్ డ్రైనేజీ పైపులైన్ పనులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. లిసర్పంచ్ మాట్లాడుతూలి ఎన్నో సంవత్సరాలుగా రెడ్డి కాలనీ వాసులు నిరీక్షణ చేశారని ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారని, ఎన్నో ఏళ్లుగా రెడ్డి కాలనీ వాసుల కల తీర్చిన ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు సర్పంచ్ గబ్రు చౌహాన్.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజల ప్రయోజనాలు కల్పించాలని ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సంతోషం వ్యక్తం చేస్తూ మాది చేతల ప్రభుత్వం, బిఆర్ఎస్ పార్టీ లాగా మాటల ప్రభుత్వం కాదని,చాకలిగుట్ట తండా పరిధిలోని ఎలాంటి అభివృద్ధి పనులకైనా కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మండలఅధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ,ఆవులమంద శివశంకర్, పసుల బుచ్చయ్య, జంగా నరసింహులు, నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్ల ప్రజల సహకరించాలి

వనపర్తి బ్యూరో, మే 20 (జనంసాక్షి) : జిల్లాలో ఇండ్ల గణన ప్రక్రియ ఈనెల 11 నుంచి కొనసాగుతూ ఉండడంతో... ఇందుకోసం వచ్చే ఎన్యూమరేటర్ల ప్రజలు సహకరించి ఖచ్చితమైన సమాచారాన్ని తెలియపరచాలని 19, 18 వార్డుల సెన్సస్ సూపర్వైజర్ పద్మావతి అన్నారు.బుధవారం 19వ వార్డులో ఇంటింటి గణన కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్ల తో కలిసి పాల్గొని, ఇంటి యజమానులతో సమాచారానికి సంబంధించిన విషయాలను వివరించారు. ఈ యొక్క ఇంటి గణన లో భాగంగా ప్రతి ఇంటి పరిస్థితి ఇంటి నిర్మాణ స్వభావం, గదుల సంఖ్య, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్తు, వంట ఇంధనం, వాహనాలు, ఇంటర్నెట్ సదుపాయం వంటి వివరణ స్వీకరిస్తారని, అలాగే మొబైల్ ఫోన్లో, టెలివిజన్, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ వంటి వివరణ నమోదు చేయాల్సి ఉంటుందని ఇంటి యజమానులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆయా వార్డులకు సంబంధించిన ఎన్యూమరేటర్ల గంధం ప్రసాద్, యాదగిరి, సుధాకర్, బాలకృష్ణ పలువురు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

● జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

యాలాల, మే 20 (జనంసాక్షి) : రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని లక్ష్మీనారాయణపూర్, అగ్గనూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులతో కలిసి కొనుగోలు కేంద్రానికి చేరుకున్న కలెక్టర్ అక్కడ భారీగా నిల్వ ఉన్న వరి ధాన్యం బస్తాలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు.ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం తూకంలో నాలుగు కిలోల వరకు వ్యత్యాసం చూపిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ సంబంధిత అధికారులను మందలిస్తూ తక్షణమే తూకం వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు నష్టం కలిగించే విధంగా ఎలాంటి అక్రమాలు జరిగితే సహించబోమని స్పష్టం చేశారు.అదేవిధంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు వివరించడంతో వెంటనే ట్రాన్స్‌పోర్ట్ లారీలను ఏర్పాటు చేసి ధాన్యం తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. స్థానిక రైస్ మిల్లులకు ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తీసుకెళ్లేందుకు అనుమతించడం లేదని రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ నేరుగా స్థానిక పద్మావతి రైస్ మిల్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్ నిర్వాహకుడి పై రైతులు పలు ఆరోపణలు చేశారు. సరైన సమయంలో ధాన్యం తీసుకోవడం లేదని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు.దీనిపై స్పందించిన కలెక్టర్ మిల్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే ధాన్యం స్వీకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరిస్తూ, నిర్లక్ష్యం కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతుల శ్రమ వృథా కాకుండా ధాన్యం కొనుగోలు, తూకం, తరలింపు ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. ఈ తనిఖీలలో డి ఆర్ డి ఓ శ్రీనివాస్, తాండూర్ ఆర్డీవో అనిత, డిప్యూటీ తాసిల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో లు ఆనంద్ కుమార్, శ్రీనిజ గ్రామ పంచాయతీ సెక్రెటరీలు తారకచారి, రమాదేవి వివిధ శాఖ అధికారులు, డీసీఎంఎస్ నిర్వాకులు సలీం భాషా , తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఇందిరాకాంతిలో పనిచేస్తున్న వివోఏలా సమస్యలు పరిష్కరించాలి

కుల్కచర్ల, మే 20 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో ఇందిరా కాంతి పథకంలో పనిచేస్తున్న వివోఏలా గ్రామ సంఘం సహాయకుల సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పరిష్కరించాలని బుధవారం కుల్కచర్ల మండల మహిళా సమాఖ్య ముందు నిరసన చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఇందిరా కాంతి పథకం వివో ఎలా జేఏసీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమం చేపట్టామని విబికేలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో గ్రామాలలో ఉన్న మహిళా సంఘాల మహిళలకు సేవ చేస్తున్నామని, పని భారాన్ని గుర్తించి వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటిన వేళలో మాకు గౌరవితనంగా 5000 రూపాయలకు పనిచేస్తున్నామని, రాత్రి పగలు అనకుండా ఉద్యోగం చేస్తున్నాము. ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేసిన గ్రామ సంఘం సహాయకులతో పనిచేపిస్తుందని, మాకు ప్రభుత్వం నుండి క్యాబ్ సౌకర్యం లేదు అయినా మా సొంత మొబైల్ ఫోన్లో యాప్లు వేసి పనిచేస్తున్నామని వారు సూచించారు. ప్రభుత్వానికి మా యొక్క ప్రధాన డిమాండ్లు విబికే లకు నెలకు కనీసం వేతనం 20000 ఇవ్వాలని, సేర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఐర్ పాలసీ వర్తింపచేయాలని, అర్హులైన

విబికేలను సీసీలుగా పదోన్నతి కల్పించాలని, వివో ఏలకు సాధారణ ఆరోగ్య భీమా 20 లక్షల వరకు ఇవ్వాలని, ట్యాబ్ నెట్ సౌకర్యం కల్పించాలని, 58 జీవోను సవరించి మాకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వివోఏలు చంద్రయ్య ఘనపూర్, గుండుమల నర్సింలు తిరుమలాపూర్, గోపాల్ రెడ్డి పుట్టా పహాడ్, శివరాములు అంతారం, వి సునీత ఇప్పాయిపల్లి, రాంపూర, కుస్మసముద్రం, అంతారం, కుల్కచర్ల తదితర గ్రామాల వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

గద్వాల నడిగడ్డ, మే 20 (జనం సాక్షి) : జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణను వేగవంతం చేసి సంబంధిత ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.జవహర్ నెట్టెంపాడు, తుమ్మిళ్ల,గట్టు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి చేపడుతున్న భూ సేకరణ, ఆర్ అండ్ ఆర్ అంశాలపై గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ లో ఉన్న భూసేకరణను వేగవంతం చేసేందుకు నీటిపారుదల, రెవిన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయా ఎత్తిపోతల ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణకు సంబంధించి అవార్డు పూర్తయిన రైతులకు నిబంధనల ప్రకారం

పరిహారం చెల్లించి, పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగంగా చేస్తున్న వివిధ పనులను సంబంధిత గుత్తేదారులు నిర్దేశిత గడువులోగా పూర్తిచేసేలా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు ప్రారంభమై 20 ఏళ్లు అవుతున్న కొన్ని ప్యాకేజీల్లో నేటికీ భూ సేకరణ ప్రక్రియ పూర్తి కాలేదని ఈ విషయంలో సంబంధిత అధికారుల పనితీరు మెరుగుపడాల్సి ఉందన్నారు. భూ సేకరణ విషయంలో రైతుల నుంచి ఏమైనా అభ్యంతరాలు వ్యక్తం అయితే ప్రాజెక్టుల ఆవశ్యకతను, ప్రభుత్వ అవసరాలను గురించి సంబంధిత అధికారులు తెలియజేసి ఒప్పించాలని సూచించారు. నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా చేస్తున్న 99 ప్యాకేజీ పనులను సకాలంలో పూర్తిచేసి సంబంధిత ఆయకట్టుకు సాగునీరు అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, నీటిపారుదల శాఖ ఎస్ఈ రహీముద్దీన్, సర్వే ఏడి నూకరాజు , కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, పలువురు నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, ఆయా మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారుల పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

ఊర్కొండ, మే 20 (జనం సాక్షి) : ఉపాధి హామీ కూలీలకు వేసవి దృశ్య ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పని చేస్తున్న ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఉరుకొండ పేట ఐదవ వార్డు సభ్యులు షబ్బీర్ అన్నారు. మండల పరిధిలోని ఉరుకొండ పేట గ్రామంలోని ఊరకుంట చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం షబ్బీర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాలలో కనీసం కూలీలకు మంచినీటి సరఫరా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచకపోవడం పట్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీల ఆరోగ్య భద్రత చూడవలసిన బాధ్యత సంబంధిత అధికారులదే అని తెలిపారు. అనంతరం ఎండ తీవ్రత అధికంగా ఉండడం వల్ల ఉపాధి హామీ కూలీలు తగు జాగ్రత్తలు సూచనలు పాటించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీలపై చిన్న చూపు చూడడం తగదని విమర్శించారు. పని ప్రదేశాలలో సరైన వసతులు ఉపాధి హామీ కూలీలకు కల్పించాలని ఈ సందర్భంగా కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
21 మే 2026

పాలమూరు చుట్టే రాజకీయం

- అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం
- 90 శాతం పనులను పూర్తి చేశామని బీఆర్ఎస్
- కాల్వలు తవ్వి 50 శాతం పనులు కాలేదని కాంగ్రెస్
- బీఆర్ఎస్ నేతల ఉద్యమ కార్యాచరణ
- నార్లాపూర్ నుంచి ఉండంపూర్ వరకు పాదయాత్ర
- సీఎం సమీక్షతో మరోమారు పాలమూరుపై ఫోకస్

మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 20 (జనంసాక్షి) : దశాబ్దాల పాటు పాలమూరును అన్ని పార్టీలు రాజకీయంగా వాడుకొని వెనకబడ్డ జిల్లాగా మార్చేసిన ఘనత అన్ని పార్టీలకు దక్కుతుందనేది జనం మాట పాలమూరులో బీడు వారిన పొలాల్లో కృష్ణమ్మ నీటిని పారించి పచ్చని మాగాణి గా మారుస్తామన్న ఉద్యమ నేతలు ప్రారంభించిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పాలమూరు ప్రజలకు అందని ద్రాక్షేనా ? వలసలకు పేరుగాంచిన పాలమూరు ప్రజలకు సాగునీరందించే ప్రాజెక్టు పట్ల తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందా ? పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా పాలమూరు జిల్లాలో ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నార్లాపూర్ నుంచి ఉండంపూర్ వరకు ఈ పాదయాత్ర కొనసాగనుండగా, పాలమూరు రైతుల సాగునీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని నేతలు పేర్కొన్నారు. ప్రాజెక్టు ద్వారా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాలకు సాగునీరు అందుతుందని, లక్షల ఎకరాలకు నీరందించే ఈ పథకాన్ని ఆలస్యం చేయడం అన్యాయమని పార్టీ నేతలు విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేగంగా సాగిన పనులు ప్రస్తుతం నెమ్మదించాయని ఆరోపించారు. పాలమూరు ప్రజల ఆకాంక్షల కోసం బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుంది. రైతుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ ప్రాజెక్టును పూర్తి చేయించేవరకు ఉద్యమం ఆగదు అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అలాగే, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ ప్రాజెక్టును రాజకీయాలకు అతీతంగా పూర్తి చేయాలని కోరారు. జిల్లాల్లో ఉద్యమాల జోరు ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు జిల్లాల వారీగా సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించే కార్యక్రమాలు చేపట్టనున్నారు. చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకే పాదయాత్ర అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కౌంటర్ మరో పక్క పాలమూరు జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ బిఆర్ ఎస్ చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే పాదయాత్ర అంటూ మరో కొత్త నాటకానికి తెరలేపిందని ఆరోపిస్తున్నారు. తొమ్మిదేళ్లలో ప్రాజెక్టు ఎందుకు పూర్తికాలేదని అప్పుడు మౌనం ఇప్పుడు పోరాటమా అని ఎద్దేవా చేస్తూ ఒకరినొకరు రాజకీయ విమర్శలు చేసుకుంటున్నారు. అధికార ప్రతిపక్షాలు మాటల యుద్ధమే కొనసాగుతుంది. మొద్దునిద్ర వీడాలని బిఆర్ఎస్, కమీషన్లు మింగింది మీరే అని కాంగ్రెస్ విమర్శలు సంధించుకుంటున్నారు . ప్రాజెక్టులపై మా ముఖ్యమంత్రి రేవంతరెడ్డి కి చిత్తశుద్ధి ఉందని ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని. జిల్లా ఎమ్మెల్యేలు చెప్తున్నమాట . సీఎం సమీక్షతో పాలమూరుపై ఫోకస్ ఈ నెల 19న సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్షా సమావేశం నిర్వహించటం తో మరో మారు పాలమూరు ప్రాజెక్టుపై ప్రాధాన్యత సంతరించుకుంది. పాలమూరు ప్రాంత అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టుపై మళ్లీ రాజకీయ చర్చ మొదలైంది. రైతులు, యువత, ప్రజాసంఘాలు ప్రాజెక్టు పూర్తి కావాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారుత్వరగా పనులు ప్రారంబించాలని సీఎం ఆదేశం ఇప్పటికైనా ప్రాజెక్టు పనులు ముందుకుపడాలని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఫార్మసీ ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలి

సంగారెడ్డి టౌన్, మే 20 (జనం సాక్షి) : ఈ ఫార్మసీ ఆన్లైన్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ ఫార్మసీ యజమాన్యులు నిరసన వ్యక్తం చేశారు రాష్ట్ర మెడికల్ అసోసియేషన్ మెడికల్ షాపుల బంద్ కు ఆదేశాల మేరకు బుధవారం సంగారెడ్డి మెడికల్ షాప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా బందును కొనసాగించారు ఈ బందుకు ఐఎంఏ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి మెడికల్ ఫార్మసీ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ కరోనా స్వయంమయంలో కేంద్ర ప్రభుత్వం జిఎస్ఆర్ 220 జిఎస్ఆర్ 187 ఆన్లైన్ విధానాన్ని జీవన్ ప్రకటించారు కరోనా సమయంలో అత్యవసర సేవలకు ఈ ఫార్మసీ ఆన్లైన్ విధానాన్ని ప్రారంభించారని దానివల్ల అనేకమంది అనేక డ్రగ్సులతో నష్టపోతున్నారని అన్నారు జీవోను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ మెడికల్ మందుల ద్వారా చిన్న మెడికల్ షాప్ యజమానులు పూర్తిగా నష్టపోతున్నారని వాళ్ల జీవన విధానాన్ని కోల్పోతున్నారని అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆన్లైన్ మెడికల్ విధానాన్ని రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఈర్ణ కృష్ణయ్య, సెక్రెటరీ అనుముల సంతోష్ కుమార్, జిల్లా అధ్యక్షులు దశరథ్, ఉపాధ్యక్షులు కృష్ణ, జ్ఞానేశ్వర్, శశికాంత్, కృష్ణ, సంగారెడ్డి కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు మెడికల్ షాప్ యజమాన్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రైపాడ్ అగ్రిమెంట్ లేకుండా కొత్త డిస్కం జీవో 44 విడుదల చేయాలి

సంగారెడ్డి టౌన్, మే 20 (జనం సాక్షి) : ట్రైపాడ్ అగ్రిమెంట్ లేకుండా కొత్త డిస్కం ఏర్పాటు చేస్తూ జీవో 44 విడుదల చేయడంపై ఎస్సీ, ఎస్టీ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బుధవారం సంగారెడ్డిలో జరిగిన సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు, ఏడీఈ ఆనంద్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. 1999లో డిస్కంలు ఏర్పాటు చేసినప్పుడు ప్రభుత్వం, మేనేజ్‌మెంట్, ఉద్యోగుల మధ్య ట్రైపాడ్ అగ్రిమెంట్ జరిగిందని, కానీ ఇప్పుడు ఎలాంటి చర్చలు లేకుండా ఆగమేఘాలపై రైతు డిస్కం తీసుకురావడం అన్యాయమని ఆయన ఆరోపించారు. ఇప్పటికే ఉద్యోగుల నుంచి ఆప్షన్లను అడుగుతున్నారని, 2000 మంది సిబ్బందితో కొత్త డిస్కం నడపడం అసాధ్యమని స్పష్టం చేశారు. గత 26 సంవత్సరాలుగా రైతులకు, ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విజయవంతంగా విద్యుత్ సేవలు అందిస్తున్నామని గుర్తుచేశారు. ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ ఎప్పుడో రావాల్సి ఉన్నా ఇప్పటికీ ప్రకటించలేదని, ఈనెల కరువు భత్యంపైనే పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు చేసే చిన్నపాటి తప్పులకు పెద్ద శిక్షలు విధిస్తున్నారని, ఇతర ఉద్యోగులకు ఇచ్చే శిక్షలతో సమానంగా తమకు కూడా న్యాయం చేయాలని కోరారు. బేషరతుగా సమ్మెను విరమిస్తే అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చి, ఆర్టిజన్ల రెగ్యులరైజేషన్ విషయంలో ఇప్పటికీ మాట నిలబెట్టుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రజలకు సేవ చేస్తున్నామని, రెండు సంవత్సరాలుగా 4000 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ జరిగి సంవత్సరం గడుస్తున్నా ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడం దారుణమని, వెంటనే ఖాళీలను భర్తీ చేస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ బీచ్ పల్లి రెడ్డి ,అమృతరావ్ సంగారెడ్డి సర్కిల్ అధ్యక్షులు ఎం సుధాకర్, సంగారెడ్డి సర్కిల్ సెక్రెటరీ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగమే ప్రమాదాలకు కారణం

- రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, మే 20 (జనంసాక్షి) : మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లో కొత్త రహదారులు, బైపాస్‌లపై అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగి ప్రాణనష్టం సంభవిస్తున్న నేపథ్యంలో, ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా ప్రత్యేక కోఆర్డినేషన్ కమిటీ ద్వారా చర్యలు చేపడుతున్నట్లు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎన్.ఐ.సి వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ చర్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రమాదాలకు కారణం అవుతున్న బైపాస్ రోడ్డు పై ప్రత్యేక దృష్టి సారించి స్పీడ్ బ్రేకర్ లు ,స్పీడ్ గన్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రధాన రహదారులపై అనుమతి లేకుండా మీడియన్లను తెరవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు అధికమవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాలకొండ బైపాస్ రోడ్, భూత్పూర్ నుంచి వన్‌టౌన్ వరకు రహదారి, హన్వాడ నుంచి పాలమూరు యూనివర్సిటీ వరకు కొత్తగా నిర్మించిన రహదారులపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం ప్రమాదాలకు దారితీస్తోందన్నారు. సంబంధిత శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, అనుమతి లేని మీడియన్ ఓపెనింగ్‌లను మూసివేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. పట్టణానికి అనుసంధానమైన ప్రధాన రహదారులపై హెచ్చరిక బోర్డులు, వేగ పరిమితి సూచికలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణలో భాగంగా ప్రస్తుతం ఉన్న 200 సీసీటీవీ కెమరాలకు అదనంగా మరో 500 కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతర నిఘా ఉంచనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నాలుగు ప్రధాన రహదారులపై స్పీడ్ గన్స్ ఏర్పాటు చేసి అతివేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రధాన జంక్షన్‌ల వద్ద తగిన లైటింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ, అవసరమైన చోట స్ట్రీట్ లైట్లు, హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ, ప్రమాదాలకు గురవుతున్న జంక్షన్‌లను గుర్తించి అక్కడ భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ప్రభుత్వం, పోలీసు శాఖ ద్వారా తీసుకుంటున్న చర్యల ను ప్రజలకు తెలియపరుస్తూ ప్రతి నెల మీడియా సమావేశాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మేయర్4 గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, అదనపు ఎస్.పి. ఎన్ బి.రత్నం, డి.ఎస్.పి.వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ రామానుజుల రెడ్డి ఆర్ అండ్ బి ఈ సంధ్య, జాతీయ రహదారులు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాశాఖకు సంపూర్ణ సహకారం

- జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట జిల్లా బ్యూరో, మే 20 (జనం సాక్షి) : జిల్లాలో విద్యాశాఖకు సంపూ ర్ణ సహకారం అందిస్తామని కలిసి విద్యాభివృద్ధి సాధిద్దా మని జిల్లా కలెక్టర్ సీ ఎచ్. ప్రియాంక అన్నారు. నారా యణపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలోటీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల, నారాయణపేటలో జిల్లా వార్షిక విద్యా ప్రణాళిక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ మేడమ్ ముఖ్య అతిథిగా హాజరై ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అకా డమిక్ రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులను ఉద్దేశించి మార్గదర్శక ప్రసంగం చేశారు. విద్యాశాఖకు సంపూర్ణ సహ కారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా విద్యా నాణ్యతాభివృద్ధి, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల సమస్యల పరిష్కారం, అవసరమైన పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగు దల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల అభ్యా స స్థాయిల పెంపు, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడం జిల్లా యంత్రాం గం ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధి కారి గోవిందరాజు మాట్లాడు తూ జిల్లాలో చేపట్టే అన్ని అకాడమిక్ కార్యక్రమాలు సమగ్ర ప్రణాళికతో, స్పష్టమై న కార్యాచరణతో నిరంతర పర్యవేక్షణతో అమలు చేయ బడతాయని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యా ప్రమాణా లు మెరుగుపడేలా, ఉపాధ్యా యుల భాగస్వామ్యంతో ఫలితాధారిత చర్యలు తీసు కుంటామని అన్నారు. జిల్లా కలెక్టర్ అందించిన ప్రోత్సా హం, మార్గదర్శకత్వం విద్యా శాఖ సిబ్బందిలో నూతన ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఏఎంఓ విద్యాసాగర్, ఎస్వో నాగార్జున రెడ్డి, సీఎస్ఎఫ్ ప్రతినిధులు శ్యామ్ సింగ్, జై, శ్రీహర్ష, ఆలోకిత్ ప్రతినిధులు సాయి ప్రమోద్, పవన్, నగేష్, ఎంఈఓలు నిజాముద్దీన్, ఆంజనేయులు, మాధవి, రాంరెడ్డి, గణేష్ సింగ్, బాలాజీ, కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు భాగ్యలక్ష్మి, చంద్రకళ, కిషోర్, అకాడమిక్ ప్యానెల్ సభ్యు లు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మునిపల్లి, మే 20 (జనం సాక్షి) : జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని పెద్ద చెల్మెడ లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరిగిందన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జొన్నల ప్రతి క్వింటాలుకు రూ. 3699 వేలు ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని , ప్రతి ఎకరానికి 10-క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తారనీ తెలిపారు. రైతులు ప్రైవేట్ లో తక్కువ ధరకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రలోనే విక్రయించాలని చైర్మన్ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దుర్గయ్య, గ్రామ సర్పంచ్ రాధాభాయ్ జోషి, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్‌లు, మార్కెట్ కమిటీలు డైరెక్టర్లు, పీఏసీఎస్ సెక్రటరీలు శివారెడ్డి, వినోద్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యం

కొల్చారం, మే 20 (జనం సాక్షి) : గ్రామ అభివృద్ధి నా లక్ష్యం ప్రజలు నాకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను. గ్రామ అభివృద్ధి కోసం మెదక్ ఎంపీ రఘునందరావుని కలవడం జరిగిందనీ గ్రామ సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని) తెలిపారు. గ్రామంలోని రెండు అంగన్వాడీ సెంటర్లు సిసి రోడ్లు గ్రామపంచాయతీ మరమతుల కోసం నిధులు విడుదల చేయాలని ఎంపీ నీ కలిసి కోరడం జరిగిందన్నారు. ఎంపి సానుకూలంగా స్పందించారాని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతంశెట్టిపల్లి సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్, కొమ్ముల రాజా గౌడ్, మహేష్ గౌడ్, నెల్లి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే ప్రాజెక్టు పనులు వేగవంతం

- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

మక్తల్, మే 20 (జనంసాక్షి) : మక్తల్ – నారాయణపేట – కొడంగల్ జీవో 69 ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే ఎత్తిపోతల పథకంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తుండగా, ఊట్కూర్ మండలంలో 38 వేల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య క్రీడలు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని తిప్రాస్ పల్లి గ్రామ శివారులోని బాపూర్ శివారులో కొనసాగుతున్న ఎత్తిపోతల పథకం పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సహకారంతోనే భూ సేకరణ పనులు ఇప్పటికీ 98 శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు. అధికారులు ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చేపట్టాలని నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎకరాకు రూ. 20 లక్షల పరిహారం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎకరాకు రూ. 20 లక్షలు పరిహారం చెల్లించారని గుర్తు చేశారు. రైతులు సహకరించడం వల్లే ప్రాజెక్టు పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. రైతులకు ప్రభుత్వం మార్కెట్ విలువ కంటే ఆరు రెట్లు అధిక పరిహారం అందించిందని, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే ప్రాజెక్టు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. నారాయణపేటను శశ్యామలం చేయడమే లక్ష్యం వెనుకబడిన నారాయణపేట జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారని, గతంలో కర్ణాటక సరిహద్దులో ఉన్న నారాయణపేట అన్ని రంగాల్లో వెనుకబడి ఉండగా, సొంత జిల్లాను అభివృద్ధి చేయాలని ఎన్ని అడ్డంకులు వచ్చినా నారాయణపేట జిల్లాను శశ్యామలం చేసేందుకు ఎత్తిపోతల పథకం పనులు చేపట్టి బీడు భూములు సాగు యోగ్యంలోకి తెచ్చి అన్నదాతల కళ్ళల్లో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

వచ్చే ఏడాది నాటికి ఊట్కూర్ మండలంలో 38 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ప్రాజెక్టు పనులు వేగవంతంగా చేపట్టాలని అధికిరులను ఆదేశించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని అన్నారు.

ఉత్సవంలా ప్రజా ప్రణాళిక

□ గణపురంలో మాక్ పార్లమెంట్

□ హెరిటేజ్ వాక్‌తో యువతలో స్ఫూర్తి

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమాలు జిల్లాలో ఉత్సవంలా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలో యువతలో చైతన్యం నింపే కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ జిల్లా అధికారి చిర్ర రఘు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మాక్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఎంపీలుగా, స్పీకర్‌గా వ్యవహరిస్తూ పార్లమెంటరీ విధానాలు, చట్టసభల పనితీరుపై ప్రత్యక్ష అవగాహన పెంచుకున్నారు. ప్రజాస్వామ్య విలువలు, చర్చల ప్రాధాన్యతను యువతకు తెలియజేయడమే ఈ కార్యక్రమ లక్ష్యమని క్రీడల శాఖ అధికారి రఘు తెలిపారు. జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో గణపురం సెంటర్ నుంచి చారిత్రక కోటగుళ్ల గుడి వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. పురా తన కట్టడాల చరిత్ర, వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై ఆర్కియాలజీ డైరెక్టర్ బుజ్జీ యువతకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో గణపురం ఉప సర్పంచ్ కృష్ణ, సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రవీందర్, జిల్లా యువజన, క్రీడల శాఖ సిబ్బంది ఎం. శివసాగర్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జంట హత్య కేసులో సంచలన తీర్పు

□ నిందితుడికి ఉరిశిక్ష విధించిన వరంగల్ జిల్లా కోర్టు

చెన్నారావుపేట, మే 20 (జనంసాక్షి) : వరంగల్ జిల్లా చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని 16చింతల్ తండ గ్రామంలో 2024 జూలై 10వ తేదీన అర్ధరాత్రి చోటుచేసుకున్న దారుణ జంట హత్య కేసులో వరంగల్ జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. భార్యాభర్తలను అత్యంత క్రూరంగా హత్య చేసి ప్రియురాలిని అతడి తమ్ముడిని ఇద్దరిని తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితుడికి ఉరిశిక్ష విధిస్తూ వరంగల్ వన్ అదనపు జిల్లా న్యాయమూర్తి జె. మైత్రేయి బుధవారం కఠిన తీర్పును ప్రకటించారు. బిఎన్ఎస్ సెక్షన్లు 333, 103(1), 109, 351(3) మరియు ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 25(1బి) కింద నమోదైన ఈ కేసులో నిందితుడు మేకల నాగరాజు అలియాస్ బన్నీ దోషిగా తేలాడు. బిఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద నేరం రుజువుకాగా బిఎన్ఎస్ సెక్షన్ 238(2) ప్రకారం మెడకు ఉరి వేసి మరణించే వరకు ఉరిశిక్ష అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. అదనంగా రూ.5 వేల జరిమానా కూడా విధించింది. ఈ ఘటనలో బానోత్ సుగుణ (45), ఆమె భర్త బానోత్ శ్రీను (50) ప్రాణాలు కోల్పోగా వారి కూతురు బానోత్ దీపిక (21), బానోత్ మదన్ లాల్ (17) తీవ్ర గాయాలతో బయటపడ్డారు. బాధితులంతా ఎస్టి లంబాడ వర్గానికి చెందిన వారు. ఈ దారుణ ఘటనపై బానోత్ ఈరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేకల నాగరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో మొదట చంద్ర మోహన్ సిఐ ఆఫ్ పోలీస్ ఎస్ బి వరంగల్ దర్యాప్తు చేపట్టగా అనంతరం శ్రీనివాస్ సీఐ నెక్కొండ సర్కిల్ విచారణ కొనసాగించారు. ప్రస్తుతం చెన్నారావుపేట ఎస్ హెచ్ ఓ గా రాజేష్ రెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బృందాదేవి సమర్థవంతమైన వాదనలు వినిపించడంతో కేసులో నిందితుడిగా ఉన్న మేకల నాగరాజుకు కఠిన శిక్ష పడినట్లు న్యాయవర్గాలు తెలిపాయి. నాగరాజుకు ఉరిశిక్ష పడడంతో 16 చింతల తండా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వరి కోయకాళ్లకు పెట్టిన నిప్పు

□ తప్పిన పెనుప్రమాదం!

మల్హార్, మే 20 (జనంసాక్షి) : మండల పరది లోని కొయ్యూర్ గ్రామపరిధిలో వరి పొలాల్లో కోసిన కోయకాళ్లను,ఎండుగడ్డిని కాల్చడానికి గుర్తు తెలియనివారు పెట్టిన నిప్పుతో మంటలు చెలరేగాయి. పొలాల ప్రక్కన రైతులు విక్రయించడానికి అరబోసిన ధాన్యం కుప్పలకు మంటలు అంటుకునే పరిస్థితిని రైతులు వెంటనే గమనించి అగ్నిమాపక వాహనానికి సమాచారం ఇచ్చారు. కోద్ది క్షణాల్లో అగ్నిమాపక వాహనం చేరుకొని మంటలు అర్పివేయడంతో పెద్ద పెనుప్రమాదం తప్పడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ధాన్యం కొనుగోళ్లపై రైతుల ఆవేదన

□ ఆర్ఐ వ్యాఖ్యలపై ఆగ్రహం

నెన్నెల్, మే 20 (జనం సాక్షి) : నెన్నెలలో ధాన్యం కొనుగోళ్ల ఆలస్యంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్లు త్వరగా కొనుగోలు చేయాలని కోరుతూ రైతులు ఆర్ఐ సులోచనను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కొందరు రైతులు అవసరమైతే మీ కాళ్లు మొక్కుతాం అంటూ వేడుకున్నారు. దీనికి స్పందించిన ఆర్ఐ సులోచన 'నా కాళ్లు కాదు. సార్ కాళ్లు మొక్కండి' అని వ్యాఖ్యానించినట్లు వీడియోలో వినిపిస్తోంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలువురు రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, రైతుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడారని విమర్శిస్తున్నారు. ఘటనపై స్పందించి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

యూత్ లీడర్షిప్‌పై అవగాహనా సదస్సు

నిర్మల్ బ్యూరో, మే20 (జనంసాక్షి) : 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక శిక్షణ కేంద్రం (ఐటిఐ)లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. యూత్ లీడర్ షిప్ సమ్మిట్ అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలువురు అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, దేశ రాజకీయాల్లో యువత పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. యువజన, క్రీడల శాఖ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మిట్ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఐటిఐ కన్వీనర్ కోటిరెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ప్రభుత్వ నేత్ర వైద్య ఆసుపత్రికి మహర్దశ

□ అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ

□ 100 పడకలకు విస్తరణ, రూ. 1.73 కోట్లతో అత్యాధునిక పరికరాలు ప్రారంభం

వరంగల్ బ్యూరో, మే 20 (జనం సాక్షి) : వరంగల్ ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య ఆసుపత్రి (ఆర్ ఇ హెచ్) అభివృద్ధిలో భాగంగా రూ. 75 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజ్ రిటైర్డ్ ఐపీఎస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. అనంతరం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్ డి ఎస్) సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సామాన్యులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం మంత్రి కొండా సురేఖ చేశారు. వరంగల్ రీజనల్ ఐ హాస్పిటల్‌ను అత్యాధునిక వైద్య సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రోగులకు మెరుగైన సేవలందించడమే కాకుండా, ఆసుపత్రిని అన్ని విధాలా బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఏజెన్సీ ద్వారా రిక్రూట్మెంట్ అయినా వర్కర్స్ విధినిర్వహణలో ఇబ్బందులకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని, విధులకు భంగం కల్పించకుండా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించుటకు వైద్య అధికారులు ముందుండాలని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. సికేం ఆస్పత్రి అభివృద్ధి లో భాగంగా వారు మాట్లాడుతూ నవ మాసాలు మోసిన తల్లికి బిడ్డ దక్కకపోతే ఆ తల్లి భాద వర్ణనాతీతమని, ప్రతి ఒక్క గర్భిణి అయినా ప్రతి మహిళ పుట్టింటి నుండి సాగనంపినట్లు గా 108 వాహనం ద్వారా ఆసుపత్రి నుండి వారి ఇంటికి చేర్చాలని ఈసందర్భంగా సి.ఎం సూపర్డెంట్ ను ఆదేశించారు. పేషంట్ బిడ్డతో డిశ్చార్జ్ అయినప్పుడు వారి వీడియోలు సోషల్ మీడియా ద్వారా వైరల్ చేసి పేషెంట్ మాటలను ప్రజలకు తెలిసే విధంగా పబ్లిసిటీ ఇవ్వాల్సిందిగా మంత్రి పేర్కొన్నారు. నార్మల్ డెలివరీలకు ప్రోత్సహించాలని అందుకు యోగా మాస్టర్ను ద్వారా నర్మల్ డెలివరీ అయ్యేందుకు ఉపయోగపడే యోగాసనాలను చేయించేలా చూడాలన్నారు.

సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు

ప్రస్తుతం ఉన్న 75 పడకల సామర్థ్యాన్ని 100 పడకలకు పెంచుతూ ప్రభుత్వానికి నివేదికలు పంపించేందుకు నిర్ణయం తీసుకున్నారు. మూడో దశ విస్తరణలో భాగంగా కార్నియా, గ్లాకోమా, రెటినా మరియు స్క్వింట్ విభాగాల యూనిట్లను 4 నుండి 6కు పెంచుటకు నిర్ణయం తీసుకున్నారు. ఆరోగ్యశ్రీ రివాల్వింగ్ ఫండ్ ద్వారా రూ. 1.73 కోట్లతో అత్యాధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేసేందుకు కమిటి ద్వారా ఆమోదం తెలుపనైనది. భద్రత, పారిశుధ్యం మరియు పేషెంట్ కేర్ సిబ్బందిని 32 నుండి 62 మందికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఖాళీగా ఉన్న టెక్నికల్, నాన్-టెక్నికల్ పోస్టులను ఏజెన్సీ ద్వారా కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులను పెంపొందించేందుకు, ఆసుపత్రి ప్రాంగణంలో వాణిజ్య దుకాణాలను నిర్మించి అద్దెకు ఇవ్వాలనే ప్రతిపాదనపై చర్చించారు. ఈ కార్యక్రమానికి అడ్మిన్ కమిటి మెంబెర్స్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైబి గణేష్, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, డిబిసిడిఓ పుష్పలత, డి ఎస్ డి ఓ భాగ్యలక్ష్మి, ఇరిగేషన్ ఈ సునీత, ఎంజీఎం సూపర్డెంట్. హరిచంద్ర రెడ్డి, డాక్టర్ జి ఆర్ భరత్ కుమార్, డాక్టర్ కేబి చంద్ర భాను, డాక్టర్ వి శ్రీకుమార్, డాక్టర్ విజయ్ శ్రీ, డాక్టర్ వంశీ ప్రియ, డాక్టర్ చరణ్, డాక్టర్ శరత్, డాక్టర్ సంధ్యారాణి, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఎంత చెప్పినా వినిపించుకోరా?

□ రసాయనాల భారం పెరిగి దిగుబడికి తగ్గుతుందని నిపుణుల హెచ్చరిక

ఎల్కతుర్తి (జనంసాక్షి) : మండల పరిధిలోని వివిధ గ్రామాలలోని వ్యవసాయ బావుల వద్ద మొక్కజొన్న వరి పొలాలను తరచుగా కాల్చవద్దని ఇటీవల అగ్రికల్చర్ ఆఫీసర్. మండ రాజ్ కుమార్‌తో పాటు కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి సమావేశల ద్వారా ఏర్పాటు చేసినప్పటికీ అవశేషాలను కాల్చవద్దని మీడియా ద్వారా వివరించినప్పటికీ రైతులు మెలకువలలో నిర్లక్ష్య వైఖరి చేస్తున్నారని వారు అన్నారు కానీ ప్రజలు ఎంత చెప్పిన కూడా మాట వినకుండా అవశేషాలను కాలుస్తూ చింతలపెల్లిలో ఓ ఆసామి కనిపించారు పంటలు అధిక దిగుబడి రావడానికి పంటలను మార్పు చేస్తూ అవశేషాలను కాల్చవద్దని ప్రతిరోజు మీడియా ద్వారా తెలిపినప్పటికీ రైతులు నసమేరా అంటూ కాలుస్తున్నట్లు కనిపిస్తున్నారు పంటల వ్యర్థాలను కాల్చడం వల్ల కార్బన్ మోనాక్సైడ్ మెట్రోజన్ డయాక్సైడ్ వంటి ప్రమాదకరమైన వాయు వెలువడి గాలి ద్వారా కాలుష్యం వెలుబడి ప్రజలు రైతులు ప్రమాదానికి గురవుతారని నిపుణులు హెచ్చరించినా రైతుల మనస్సును మార్చుకోవడం లేదు భూమిలో వ్యర్థాలు ఉండడం వలన కాంపోస్ట్ మార్చి మల్సింగ్ తేమ లేకుండా చూసుకోవాలని అన్నారు. రైతులు ఇలాంటి మెలకువాలు నేర్చుకోవడం వలన రసాయన ఎరువుల భారం తగ్గ అధిక దిగుబడి సాధించవచ్చని రైతుల సమావేశములో సంబంధిత ఆఫీసర్లు రైతులకు తెలిపి హెచ్చరించారు

మంచిర్యాలలో మెడికల్ షాపుల బంద్ విజయవంతం

మంచిర్యాల మే 20 (జనంసాక్షి): ఆన్ లైన్ మందుల విక్రయాలు ఆపాలని, కార్పోరేట్ సంస్థలకు భారీ డిస్కౌంటులను రద్దు చేయాలని ఈ నెల 20న ఇచ్చిన దేశ వ్యాప్త ఒక రోజు మెడికల్ షాపు ల బంద్ పిలుపులో భాగంగా జిల్లాలో బంద్ విజయవంతం చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మోటూరి చంద్రశేఖర్ రావు, తొగరు సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఆన్లైన్ ఫార్మసీ వలన మందుల అమ్మకాలపై నియంత్రణ ఉండదని తెలిపారు. నకిలీ, మత్తు కలిగించే మందులు ప్రిస్క్రిప్షన్ లేకుండా విచ్చలవిడిగా లభించే అవకాశం ఉంటుందని, యువతకు తేలికగా ఇలాంటి మందులు దొరకడం వల్ల వారి భవిష్యత్తుకు ప్రమాదకరంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పోరేట్ సంస్థలకు ఇస్తున్న విపరీత డిస్కౌంట్ విధానాల వల్ల దేశ వ్యాప్తంగా 13 లక్షల మందుల షాపుల మనుగడకు ప్రమాదం ఉందని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల మందుల షాపుల భవిష్యత్తుకు ప్రమాదం ఉందని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా ఆల్ ఇండియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ మద్దతుగా, తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లాలో చేపట్టిన మెడికల్ షాపులు ఒకరోజు బంద్ కు హోల్సేల్ మెడికల్ అసోసియేషన్, మెడ్ ప్లస్, అపోలో, మెడికల్ రిప్రజెంటేటివ్స్ మద్దతు ఇచ్చారని, జిల్లాలో బంద్ విజయవంతం అయిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎం. బాలేశ్వరరావు, గోవిందరెడ్డి, జి. రాజు, చంద్రశేఖర్, చొక్కారపు శ్రీనివాస్, కిరణ్ కుమార్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సహారా బాధితుల ఆందోళన

బెల్లంపల్లి, మే 20, (జనంసాక్షి) : బెల్లంపల్లి పట్టణంలోని సహారా ఇండియా కార్యాలయం ముందు బుధవారం బాధితులు ఆందోళన చేపట్టారు. తాము కట్టిన డిపాజిట్లు వెంటనే చెల్లించాలని నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లే కార్డులు పట్టుకొని ఆందోళన చేశారు. సహారా ఇండియా కార్యాలయంలోని సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, సహారా బాధితుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ మేము కష్టపడి పైసా పైసా పోగేసి కూడ పెట్టుకుని సంపాదించిన లక్షలాది రూపాయలను సహారా సంస్థ ఏజెంట్ల మాయ మాటలు నమ్మి సింగరేణి విశ్రాంత ఉద్యోగులు, వయోవృద్ధులు, ఒంటరి మహిళలు, కూలీ నాలి చేసుకునే మధ్యతరగతి ప్రజలు, చిరు వ్యాపారస్తులు సహారా ఇండియా సంస్థలో కోట్లాది రూపాయలను ఫిక్స్ డిపాజిట్ చేశామని అన్నారు. కాలపరిమితి దాటి పోయి 3 - 4 సంవత్సరాలు గడుస్తున్నా పాలసీలు మెచ్యూరిటీలు పూర్తయిన లక్షలాది మంది సహారా బాధితులకు వారి డబ్బులు చెల్లించడం లో సహారా ఇండియా యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసశారు. సహారా ఇండియా సంస్థలో మేము డిపాజిట్ చేసిన డబ్బులను వెంటనే చెల్లించాలని, లేని యెడల జిల్లా వ్యాప్తంగా ఉన్న సహారా ఇండియా కార్యాలయాల ముందు సహారా బాధితులు శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూనే, ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని సహర యాజమాన్యానికి హెచ్చరించారు. కోట్లాది మంది సహారా ఇండియా బాధితుల పక్షాన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక అధ్యక్షుడు, సహారా బాధితుడు, బీసీ సంఘాల నాయకుడు గజెల్లి వెంకటయ్య , సహారా బాధితులు వేముల కనకయ్య, దోవనపల్లి వెంకన్న, వేముల సతీష్ కుమార్, ఎం రాజమౌళి, టీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో పోలీస్, యాంటీ నార్కోటిక్స్ వింగ్ ఆకస్మిక తనిఖీలు

బెల్లంపల్లి, మే 20, (జనంసాక్షి) : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్, మంచిర్యాల నార్కోటిక్ టీమ్ సంయుక్తంగా నార్కోటిక్ స్నిఫర్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి బుధవారం బెల్లంపల్లి బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైక్ పార్కింగ్ ప్రాంతం, ఆటో స్టాండ్, హోటళ్లు, పాన్ షాపులు, ఇతర అనుమానాస్పద ప్రదేశాల్లో చేపట్టారు. తనిఖీల సందర్భంగా బస్టాండ్ ప్రాంగణం, ప్రయాణికుల సామగ్రి, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు, అలాగే చిన్నపిల్లలకు మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు, గుట్కా, సిగరెట్లు వంటి నిషేధిత వస్తువులు విక్రయించిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడం లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు.

గ్రామస్తులకు ప్రత్యేక అనుమతి

□ ఆధార్ చూపిస్తే వాహనాలకు ప్రవేశం

కాళేశ్వరం , మే 21 (జనం సాక్షి) : మహా సరస్వతి నది అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం కు భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సంకీర్త్ తెలిపారు. కాళేశ్వరం గ్రామానికి చెందిన స్థానికులు బయటకు వెళ్లి తిరిగి రావడానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక అనుమతి ఇచ్చారు. గ్రామస్తులు తమ ఆధార్ కార్డు చూపిస్తే, వారి బైకులు, కార్లు చెక్‌పోస్టుల వద్ద అనుమతించి లోపలికి ప్రవేశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. భక్తుల రద్దీ కారణంగా విధించిన ట్రాఫిక్ నియమాలను గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు.

వడదెబ్బతో మహిళ మృతి

మల్హార్, మే20 (జనంసాక్షి) : మండల పరది లోని మల్లారం గ్రామానికి చెందిన గొట్టం ఉమా భర్త లక్ష్మయ్య వడదేబ్బ కారణంగా మృతి చెందింది అని భర్త లక్ష్మయ్య తెలిపారు. మృతురాలు భర్త తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు ప్రతి రోజులాగే వ్యవసాయ కూలి పనులకు పోయి అక్కడే కళ్ళు తిరిగి పడిపోయింది. భూపాలపల్లి లోని ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుకెళ్లగా అప్పటికే పరిస్థితి విషమించిందని వైద్యులు చెప్పగా వెంటనే వరంగల్లోని ఎంజిఎం కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రోజు తెల్లవారుజామున మృతి చెందింది అని మృతురాలు భర్త తెలిపారు. మృతురాలు కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. తల్లి మరణం తో పిల్లలు ఆనాధలైనారు. ప్రభుత్వము వారి కుటుంబాన్నికి ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

బారులు తీరిన ట్రాక్టర్లు

చిట్యాల మే 20 (జనంసాక్షి): యాసంగిలో రైతులు పండించిన మక్కలు మండల కేంద్రంలోని పిఎసిఎస్ గోదాం ఆవరణలో బుధవారం దిగుమతి కోసం ట్రాక్టర్లు బారులు తీరాయి. ఈ సంవత్సరం పత్తి పంట దిగుమతి రాకపోవడంతో యాసంగిలో రైతులు మొక్కజొన్న పంట అధికంగా సాగు చేశారు . ఈసారి దిగుబడి అధికంగా రావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, గోదాంలో పూర్తిగా నిండిపోయాయి. చిట్యాల మండలం తో పాటు చుట్టుపక్కల మండలాలు టేకుమట్ల, మొగుళ్లపల్లి తోపాటు మరికొన్ని మండలాల రైతులు, మార్క్ పేడ్, పిఎసిఎస్ ఆధ్వర్యంలో మక్కలు కొనుగోలు చేశారు. దీంతో మండల కేంద్రంలోని పిఎసిఎస్ ఎరువుల గోదాం ఖాళీగా ఉండడంతో మక్కలను గోదాంలో నిల్వ చేసేందుకు భారీగా ట్రాక్టర్ల ద్వారా మక్కలను తీసుకువచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
21 మే 2026

పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి, మే 20 (జనంసాక్షి) : ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన పక్కా ఓటర్ల జాబితాను రూపొందించడమే జిల్లా యంత్రాంగం, రాజకీయ పార్టీల ముఖ్య లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ లో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం అత్యంత పారదర్శకంగా, కచ్చితమైన విచారణతో బాధ్యతాయుతంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రతి రాజకీయ పార్టీ తక్షణమే తమ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని, అధికారులతో రాజకీయ నాయకులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం జూన్ 15నుండి ప్రారంభం అవుతుందని తెలిపారు.జూన్ 15 నుండి 24 వరకు బూత్ స్థాయి అధికారులకు పూర్తిస్థాయి శిక్షణ, ప్రిపరేషన్, ప్రింటింగ్ ఉంటుందని అన్నారు. జూన్ 25 నుండి జూలై 24వ తేదీ వరకు బిఎల్ఓలచే ఇంటింటికీ వెళ్లి సమగ్ర విచారణ, జూలై 24 న పోలింగ్ కేంద్రాలను ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పునర్వ్యవీకరించటం, జూలై 31న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. జూలై 31 నుండి ఆగస్టు 30వ తేదీ వరకు ముసాయిదాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ, జూలై 31 నుండి సెప్టెంబర్, 28 వరకు అభ్యంతరాలు, అభ్యంతరాయల పరిష్కారం, అక్టోబర్ 1న ఓటర్ల తుది జాబితా అధికారిక ప్రచురణ చేయడం జరుగుతుందని వివరించారు.కొత్త ఓటర్ల నమోదు, జాబితా ప్రక్షాళనలో బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి క్షుణ్ణంగా విచారణ చేసిన అనంతరం మాత్రమే కొత్త ఓటరు నమోదు ప్రక్రియ చేపడతారని, స్థానికంగా చనిపోయిన వారి పేర్లను తొలగించడం, వలస వెళ్లిన వారిని గుర్తించడంతో పాటు అర్హులైన కొత్త ఓటరు ఎవరూ కూడా జాబితాలో చేర్చే బాధ్యత బీఎల్ఓలపై ఉందని స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాల నియమ నిబంధనలపై స్పష్టతనిచ్చారు. ప్రతి కొత్త పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండాలని, ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి 2 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించకుండా ఉండేలా వీలైనంత సమీపంలోనే కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఫామ్-6 ద్వారా కొత్త ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.ఓటర్ల జాబితాలో తప్పుల సవరణలు, మార్పులు, చేర్పుల కోసం ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక దృఢమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు ప్రక్రియలో సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వర రావు, ఎండీ అజిద్, వి.రవి,కె.కరుణాకర్, ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్తను రోడ్లపై విచ్చలవిడిగా వేస్తే కఠిన చర్యలు తప్పవు

- మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి

హాలియా, మే 20 (జనం సాక్షి) : చెత్తను రోడ్లపై విచ్చలవిడిగా వేస్తే చర్యలు తప్పవని హాలియా మునిసిపాలిటీ కమిషనర్ కే. రవీందర్ రెడ్డి అన్నారు. చెత్తను బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై వేయకూడదని, తడి మరియు పొడి చెత్తను వేరుచేసి నియమిత మునిసిపల్ వాహనాలకు అందజేయాలని మునిసిపాలిటీ పలు సందర్భాల్లో నోటీసులు మరియు పత్రికల ద్వారా హెచ్చరించింది. అయితే కొందరు వ్యాపారులు నిర్లక్ష్యంగా చెత్తను బయట వేయటం కొనసాగించడంతో కమిషనర్ ఆదేశాల ప్రకారం అంగడి బజార్, మిర్యాలగూడ రోడ్ మరియు సాగర్ రోడ్ ప్రాంతాలలో నియమ ఉల్లంఘనలకు అధికారులు చర్య తీసుకున్నారు. మొదటిసారి ప్రతి ఉల్లంఘనకారి రూ.500 జరిమానా విధించారు. మరోసారి ఇదే రీతిగా నిర్లక్ష్యం కనిపిస్తే రూ.5,000 జరిమానా విధించి ఆ షాపు లైసెన్సును రద్దు చేయనున్నట్లు కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ రవికుమార్ గారు, మునిసిపల్ సిబ్బంది మరియు జవాన్లు పాల్గొన్నారు. కమిషనర్ గారు స్థానిక ప్రజలకు, వ్యాపారులకు పర్యావరణ శుభ్రతను పాటించుకోవాలని, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని మరొకసారి హెచ్చరించారు. మునిసిపాలిటీ ఈ చర్యల ద్వారా శాంతి, శుభ్రత మరియు పర్యావరణ రక్షణలో ప్రజాభిప్రాయాన్ని మరింత పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరిన్ని సమగ్ర నోటీసులు మరియు రోడ్డు శుభ్రత కార్యక్రమాల వివరాలు త్వరలోనే ప్రకటించబోతున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ కరవు

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- జడ్చర్ల హత్యకు గురైన వైష్ణవి కుటుంబానికి పరామర్శ

జడ్చర్ల, మే 20 (జనంసాక్షి) : రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. జడ్చర్లలో ఇటీవల దారుణ హత్యకు గురైన పీజీ విద్యార్థిని బండి వైష్ణవి కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. వైష్ణవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, ఆమె తల్లిదండ్రులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పట్టపగలే ఉన్మాదులు కత్తులతో దాడులు చేస్తుంటే హోంమంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, పోలీస్ వ్యవస్థ పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో షీ టీమ్స్, నిరంతర పెట్రోలింగ్‌తో మహిళలు సురక్షితంగా ఉండేవారని, నేడు పోలీస్ యంత్రాంగం కేవలం పాలకుల ఆస్తుల రక్షణకే పరిమితమైందని ఆరోపించారు. మరో ఘటనలో మైనర్ బాలికపై జరిగిన అగాయిత్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధితులను కించపరుస్తూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. పేద కుటుంబంలో పుట్టి, గురుకులాల్లో చదువుకుని ప్రొఫెసర్ కావాలనే ఉన్నత ఆశయాలతో ఉన్న వైష్ణవి లాంటి బిడ్డలకు జరిగిన అన్యాయంపై తెలంగాణ సమాజం గొంతు విప్పాలని పిలుపునిచ్చారు. వైష్ణవి కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు రామ్మోహన్, నాగిరెడ్డి, ఇంతియాజ్ ఖాన్, నరసింహ, కరాటే శ్రీను, శశి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు పర్యాటక రంగానికి ప్రపంచ స్థాయి గుర్తింపు

- ఇన్‌ఫ్లుయెన్సర్‌లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్లకు ప్రత్యేక ఆహ్వానం
- జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు

ములుగు ప్రతినిధి, మే 20 (జనంసాక్షి) : ములుగు జిల్లా పర్యాటక రంగాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు నిర్వహిస్తున్న 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'పై గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్ లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా ఈ వినూత్న పోటీని చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులు, కంటెంట్ క్రియేటర్లు ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సు, బొగత జలపాతం, ఆదివాసీ సంస్కృతి, ఇతర పర్యాటక ప్రాంతాలపై 4కె రీల్స్ రూపొందించి సమర్పించాలని కోరారు. ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులు, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా హ్యాండ్లర్ లకు పోటీ నిర్వహణపై విధి విధానాలు పలు అంశాల గూర్చి పూర్తి వివరాలు ఈ సమావేశంలో తెలియజేయునట్లు జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆరు ఎకరాల ఎర్రచందనం తోట దహనం

- 10 లక్షల ఆస్తి నష్టం
- గుండె పగిలేలా విలపిస్తున్న రైతు దొడ్డి గిరి
- 6,000 మొక్కలతో పాటు కాలిబూడిదైన డ్రిప్, పైప్‌లైన్లు
- ఆదుకోవాలంటూ ప్రభుత్వం, విద్యుత్ శాఖకు బాధితుడి ఆవేదన
- గుర్రంపోడు మండల పరిధిలోని జూనూతల స్టేజి వద్ద ఘోర ప్రమాదం

గుర్రంపోడు, మే 20 (జనంసాక్షి) : నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల పరిధిలో ఘోర ప్రమాదం సంభవించింది. జూనూతల స్టేజి సమీపంలో విద్యుత్ తీగలు ఒకదానికొకటి తాకడం (ఫేస్ టు ఫేస్ షార్ట్ సర్క్యూట్) వల్ల దేవరకొండకు చెందిన దొడ్డి గిరి అనే రైతుకు చెందిన ఆరు ఎకరాల ఎర్రచందనం తోట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడి బంధువు మురారి శెట్టి అంజయ్య తీవ్ర ఆవేదనతో తెలిపారు.క్షణాల్లో బూడిదైన ఆరేళ్ల కష్టం:బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తోట గుండా వెళ్తున్న విద్యుత్ స్తంభం వైర్లు ఒకదానికొకటి ఘర్షణకు గురై ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. తోటలో ఎండిన గడ్డి ఉండటంతో మంటలు క్షణాల్లో విస్తరించాయి. ఈ దారుణ అగ్నిప్రమాదంలో తోటలో ఉన్న 6,000 ఎర్రచందనం మొక్కలు పూర్తిగా కాలిపోయాయి. వీటితో పాటు లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న డ్రిప్ సిస్టమ్, మెయిన్ పైప్‌లైన్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయి.ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్:కళ్లముందే ఆరేళ్ల కష్టం, పెట్టుబడి బూడిద కావడంతో రైతు దొడ్డి గిరి కన్నీరుమున్నీరవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి, బాధితుడికి రూ.10 లక్షల పరిహారం అందించి న్యాయం చేయాలని బాధితుడి కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ములుగు జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలి

ములుగు ప్రతినిధి, మే 20 (జనంసాక్షి) : ములుగు జిల్లాను పూర్తిస్థాయిలో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని, వారసత్వ కట్టడాలను పరిరక్షించడం అందరి బాధ్యత అని, పర్యాటక ప్రాంతాలతో ములుగు జిల్లాకు విశిష్ట స్థానం ఉందని, జిల్లా చరిత్ర, సంస్కృతి సంప్రదాయాల ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక "పర్యాటక వారోత్సవాల" వేడుకలలో భాగంగా బుధవారం ములుగు మండలం జాకారం గ్రామంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్, నేషనల్ హైవే యు-టర్న్ వద్ద నుంచి గ్రామంలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన కాకతీయుల కాలం నాటి పురాతన శివాలయం వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ పురాతన శివాలయాన్ని సందర్శించి, ఆలయ చరిత్రను పర్యాటక శాఖ గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్, స్థానిక సంస్థలు సంపత్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జి, ఇరిగేషన్ అధికారి అప్పలనాయుడు, విద్యా శాఖ అధికారి సిద్ధార్థ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంతన్ గౌరెల్లి గ్రామాభివృద్ధికి కీలక అడుగు

- తాగునీరు, డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన సర్పంచ్ కోర్ర అరవింద్ నాయక్

యాచారం, మే 20 (జనం సాక్షి) : మంతన్ గౌరెల్లి గ్రామంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తక్షణమే నిధులు మంజూరు చేశారు. బుధవారం గ్రామ సర్పంచ్ కోర్ర అరవింద్ నాయక్ నేతృత్వంలో గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలోని 6, 7వ వార్డులతో పాటు, 2, 3వ వార్డులు మరియు స్థానిక పాఠశాల పరిధిలో ఎదురవుతున్న తాగునీటి ఎద్దడిని సర్పంచ్ ఎమ్మెల్యే కి వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, వెంటనే ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో మాట్లాడారు. సదరు వార్డులలో కొత్త బోరు మోటార్లు, పైప్‌లైన్ల ఏర్పాటు పనులను తక్షణమే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.దీంతో పాటు గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు, అధునాతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి రూ. 10 లక్షల రూపాయల ప్రత్యేక నిధులను ఎమ్మెల్యే మంజూరు చేశారు. గ్రామ ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి, నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి సర్పంచ్ కోర్ర అరవింద్ నాయక్ మరియు గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలలలోని నిర్మాణ మరమ్మతుల పనులను వెంటనే పూర్తి చేయాలి

యాదాద్రి కరస్పాండెంట్, మే 20 (జనం సాక్షి) : జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న నిర్మాణం మరమ్మతుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లా పరిధిలోని పీఎం శ్రీ పాఠశాలలు, కేజీబీవీలు, భవిత కేంద్రాలు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న నిర్మాణ, మరమ్మతు పనుల పురోగతిని పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని మరమ్మతుల పనులు, కేజీబీవీల నాబార్డ్ పనులు, సివిల్ రిపేర్లు పనులు పూర్తిచేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా వచ్చే నెలలో పూర్తి అయ్యేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిర్మాణాల్లో ఎలాంటి లోపాలు లేకుండా ఇంజినీరింగ్ అధికారులు తరచూ పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎంప్లాయిమెంట్ మరియు బీసీ సంక్షేమ అధికారి సాహితీ, టీజీఈడబ్ల్యూఐడిసి డి.ఈ. శివకుమార్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఈఈ దాసయ్య, జిల్లా విద్యాశాఖ ఇంచార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్, ఏఈలు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదిహేను రోజులైనా పట్టించుకునే వారేరీ..?

- దిక్కుతోచని స్థితిలో రైతులు

పుల్కల్, మే 20 (జనంసాక్షి) : ధాన్యం ఆరబోసి పది హేను రోజులైనా పట్టించుకునే వారు కరువయ్యారని దిక్కు తోచని స్థితిలో రైతులు లబోదిబోమంటున్నారు. మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో ధాన్యం ఆరబోసి పది హేను రోజులు అయిపోయింది,మ్యాచర్ కూడా వచ్చింది కానీ అధికారులు ఎవరు ఇటువైపు వచ్చిన పాపాన పోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.మ్యాచర్ వచ్చింది కదా తూకం వేయండి అని అడిగితే లారీలు లేనిది మేమేం చేయాలని నిర్వాహకులు సమాధానం చెబుతున్నారని రైతులు వాపోయారు.ఆరబోసిన ధాన్యాన్ని నింపడానికి కనీసం బస్తాలు ఇవ్వమంటే ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మా ధాన్యాన్ని ఎప్పుడు తరలిస్తారు సారు అని నిర్వాహకులను అడిగితే రేపు మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు.ఆరు కాలాలు కష్టపడి పండించిన ధాన్యం చేతికి అందిందని మురిసిపోవాలో లేదా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అకాల వర్షాలు కురిసి ధాన్యం తడిసిపోతుందని బాధపడాలో తెలియడంలేదని మిన్పూర్ గ్రామానికి చెందిన రైతులు రాజు, పత్తి చెన్నయ్య అక్కడికి వెళ్లిన విలేకరులతో ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు తరలిస్తారో లేదో వేచి చూడాలి మరి.

సీఎం పర్యటన దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి కరెస్పాండెంట్, మే 20 (జనం సాక్షి) : ఈ నెల 23వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో టెంపుల్ సిటీ వద్ద వేద పాఠశాల శంకుస్థాపనకు విచ్చేస్తున్న సందర్భంగా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, అదనపు ఎస్పి లక్ష్మీనారాయణ, జిల్లా స్థాయి అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ , రెవెన్యూ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఇ ఇ అర్ అండ్ బి , ఎస్పీ ఇరిగేషన్, ట్రాన్స్ పోర్ట్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, పంచాయితీ, ఈ ఈ పంచాయతీ రాజ్, వైద్య శాఖ, ట్రాన్స్ కో , హార్టికల్చర్ డిపిఆర్ఓ,సివిల్ సప్లై , ట్రాఫిక్ తదితర శాఖల ఏర్పాట్ల పై సమీక్షించారు. అధికారులు సంపూర్ణ సమన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా పనులు పూర్తి చేయాలని, టెంపుల్ సిటీ వద్ద హెలిప్యాడ్ అన్ని ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను, భద్రత ఏర్పాట్లు, శాంతి భద్రతలు, పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తును, భారీ కేడింగ్ పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను, అగ్నిమాపక పరికరాలను, సేవలను అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక శాఖను, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖను, రోడ్ల మరమ్మత్తుల పనులను అర్.అండ్.బి, అధికారులు, శానిటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, మున్సిపాలిటీ, జిల్లా పంచాయితీ శాఖ, ఈ ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం బక్రీద్ ఏర్పాట్లపై, ధాన్యం కొనుగోలు, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) సెన్సెస్, పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 28న పవిత్ర బక్రీద్ పండగ ఉన్నందున ఈద్గా ల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. బక్రీద్ పండగ దృష్టిలో పెట్టుకొని ఎలాంటి సమస్యలు లేకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయతో విధులు నిర్వహించాలని అన్నారు. మసీదుల వద్ద పటిష్టమైన పారిశుద్ధ్యం , మంచినీరు కరెంటు, వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని అన్నారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ ఈద్గాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు రవాణాలో మరింత వేగం పెంచాలని సరిపడా హమాలీలతో కొనుగోలైన ధాన్యం త్వరగా లోడింగ్ చేసి మిల్లులకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, రెవిన్యూ డివిజనల్ అధికారులు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, డిఆర్డిఏ నాగిరెడ్డి, పోలీస్ అధికారులు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓలా ఎలక్ట్రిక్ ఆదాయం భారీగా తగ్గుముఖం

న్యూఢిల్లీ: ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ త్రైమాసిక ఫలితాలను విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి గానూ రూ.500 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.870 కోట్లతో పోలిస్తే 42.5% నష్టం తగ్గుముఖం పట్టింది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం రూ.265 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే సమయంలో ఆదాయం రూ.611 కోట్లతో పోలిస్తే 56.62% తగ్గినట్లు ఓలా రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.2,253 కోట్లు ఆదాయం ఆర్జించినట్లు తెలిపింది. క్యూ4లో ఏకీకృత స్థూల మార్జిన్ 38.5 శాతం కాగా.. పూర్తి ఆర్థిక సంవత్సరానికి 30.6 శాతంగా ఉందని ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. నాలుగో త్రైమాసికంలో 20,256 యూనిట్లను విక్రయించినట్లు తెలిపింది. మొత్తం త్రైమాసికానికి రూ.1,73,794 యూనిట్లు అమ్ముడైనట్లు పేర్కొంది. బుధవారం ట్రేడింగ్ సెషన్‌లో ఓలా ఎలక్ట్రిక్ షేరు విలువ ఒక శాతం పెరిగి రూ.36.94 వద్ద ముగిసింది.

వర్క్‌ఫ్రమ్ హోమ్ అని చెప్పి.. లేఆఫ్ మెయిల్స్

ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాలో ఉద్యోగ తొలగింపులు ప్రారంభమయ్యాయి. సంస్థ తొలుత తమ ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోమ్ చేయాలని చెప్పి.. సడన్‌గా లేఆఫ్ మెయిల్స్ పంపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయం నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సింగపూర్, యూఎస్, యూకే వంటి ప్రాంతాల్లోని ఉద్యోగులకు తొలుత ఇంటినుంచే పని చేయాలని కంపెనీ తెలిపింది. అందుకు వారు సిద్ధమవుతుండగా.. సరిగ్గా తెల్లవారుజామున ప్రభావిత ఉద్యోగులకు లేఆఫ్ మెయిల్స్ పంపింది. ఎలాంటి గందరగోళం జరగకుండా ఉండేందుకు సంస్థ ఇలాంటి చర్యలు తీసుకున్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ చర్యపై నెట్టింట తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక, మెటా తన సింగపూర్‌లోని టీమ్‌కు తొలుత ఈ మెయిల్స్ పంపించింది. ఉదయం 4 గంటలకు (భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 1:30 గంటలకు) వారికి అవి అందాయి. ఈ తొలగింపులకు ముందు ప్రపంచవ్యాప్తంగా మెటాలో దాదాపు 78 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. తాజాగా 10 శాతం అంటే.. దాదాపు 8,000 మందిని ఉద్యోగం నుంచి తొలగించనుంది. ఇందులో ఎక్కువగా ఇంజినీరింగ్, ప్రొడక్ట్ బృందాలు ప్రభావం కానున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ ఏడాది చివర్లో కంపెనీ మరికొన్ని తొలగింపులు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. 7వేల మందిని ఏఐ విధుల్లోకి మార్చనున్నట్లు మెటా హెచ్‌ఆర్ చీఫ్ జానెల్లె గేల్ ఇప్పటికే తెలిపారు.

లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబయి:
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. చివరి గంటలో కోలుకున్నాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో ఓ దశలో 600కు పైగా పాయింట్ల నష్టాలను చవిచూసిన నిఫ్టీ లాభాల్లో ముగియడం గమనార్హం. ఆసియా మార్కెట్‌లు చాలా వరకు నష్టాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్‌లు లాభాల్లో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 74,806.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,200.85) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,529.41 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివర్లో కోలుకుని 117.54 పాయింట్ల లాభంతో 75,318.39 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 41 పాయింట్ల లాభంతో 23,659 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.83గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. బీఈఎల్, టెక్ మహీంద్రా, ఎటెర్నల్, టాటా స్టీల్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 109 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4491 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

పెప్సికో ఇండియా రూ.5,700 కోట్ల పెట్టుబడులు

దిల్లీ: ప్రముఖ ఆహార, పానీయాల సంస్థ పెప్సికో.. భారత్‌లో విస్తరణ ప్రణాళికల కోసం 2030 నాటికి రూ.5,700 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఆహార వ్యాపారం తయారీ సామర్థ్యాలను విస్తరించడంపై దృష్టి పెట్టనున్నట్లు పెప్సికో ఇండియా, దక్షిణాసియా సీఈఓ జాగృత్ కోటేచా పేర్కొన్నారు. ఈ పెట్టుబడులను మధ్యప్రదేశ్, అస్సాం, తమిళనాడుల్లోని మూడు తయారీ కేంద్రాలపై పెట్టనున్నారు. ప్రపంచవ్యాప్తంగా పెప్సికోకు ఉన్న అగ్రగామి 13 మార్కెట్లలో భారత్ ఒకటని.. ఇక్కడ పెరుగుతున్న ప్రజల ఆదాయం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కారణంగా వృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని, దీంతో భారీ పెట్టుబడులకు కట్టుబడి ఉన్నామని కోటేచా స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లో కాన్సంట్రేట్ ప్లాంట్, అస్సాంలో స్నాక్స్ ప్లాంట్‌లను రాబోయే కొద్ది నెలల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దక్షిణాదిలో స్నాక్స్ వ్యాపారాన్ని విస్తరించడానికి ఇటీవల తమిళనాడులో స్థలాన్ని కంపెనీ కొనుగోలు చేసింది. 2025 డిసెంబరుతో ముగిసిన 12 నెలల కాలానికి పెప్సికో ఇండియా రూ.9,789 కోట్ల ఆదాయాన్ని, రూ.905 కోట్ల లాభాన్ని నమోదుచేసింది. ప్రస్తుతం కంపెనీ వద్ద రూ.1600 కోట్లకు పైగా నగదు నిల్వలు ఉన్నాయి. దీంతో కంపెనీ బ్యాలెన్స్ షీట్ బలంగా ఉందని పెప్సికో ఇండియా, దక్షిణాసియా సీఎఫ్ఓ సవితా బాలచంద్రన్ తెలిపారు.

ఉద్యోగుల తొలగింపునకు ఏఐ సాకు

: గూగుల్ డీప్‌మైండ్ సీఈవో

వాషింగ్టన్: కృత్రిమ మేధ ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. టెక్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరణ వల్ల భవిష్యత్‌లో తీవ్ర ఉద్యోగ సంక్షోభం పొంచిఉందని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ఏఐ వినియోగంపై గూగుల్ డీప్‌మైండ్ సీఈవో డెమిస్ హిస్సాబిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐని ఉత్పత్తి పెంచుకోవడానికి వాడుకోవాలే కానీ, ఉద్యోగుల తొలగింపు కోసం కాదని స్పష్టం చేశారు. సరైన ముందుచూపు లేకనే పలు టెక్ సంస్థలు వేలాదిమంది ఉద్యోగులను తొలగిస్తున్నారని వ్యాఖ్యానించారు. గూగుల్ ఎ/ా కార్యక్రమంలో గూగుల్ డీప్‌మైండ్ సీఈవో క్లిష్టమైన కోడింగ్‌లను అభివృద్ధి చేసే జెమిని 3.5 ఫ్లాష్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇలాంటి కొత్త మోడళ్లను అభివృద్ధి చేయడం అంటే కోడింగ్ చేసే ఉద్యోగుల అవసరం తగ్గుతుందని అర్థం కాదని అన్నారు. ఉద్యోగులను తొలగించడానికి చాలా టెక్ కంపెనీలు ఏఐని ఓ సాకుగా వాడుకుంటున్నాయేమోనని అనుమానం వ్యక్తం చేశారు. దీనిని 'ఏఐ వాషింగ్'గా అభివర్ణించారు. కేవలం ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం ద్వారా ఖర్చులు ఆదా చేయడం కంటే.. తమకు ఉత్పాదకతే ముఖ్యమని పేర్కొన్నారు. కోడింగ్‌లో ఏఐ మరింత మెరుగైతే.. తన కంపెనీలోని ఇంజినీర్లతో మరిన్ని కొత్త ప్రాజెక్టులు చేయించే అవకాశం ఉంటుందని గూగుల్ డీప్‌మైండ్ సీఈవో పేర్కొన్నారు. ముందుచూపు లేకపోవడం వల్లే డెవలపర్‌ల స్థానంలో ఏఐని తీసుకురావాలని పలు కంపెనీలు ప్రయత్నిస్తున్నాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇదీ చదవండి: ఎయిర్‌టెల్ నుంచి ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్ 5జీ పథకాలు

హెచ్‌డీఎఫ్‌సీ ఉద్యోగులకు రెండు రోజుల వర్క్ ఫ్రమ్ హోం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ముడి చమురు సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ.. పొదుపు మంత్రం పాటించాలని, కార్పొరేట్ సంస్థలు వర్క్ ఫ్రం హోమ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ ఆ దిశగా అడుగులు వేస్తోంది. కస్టమర్లతో నేరుగా సంబంధం లేని వ్యాపార, కార్పొరేట్ బ్యాంకింగ్‌లకు సంబంధించిన ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రం హోం ప్రకటించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని, నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తామని వెల్లడించింది. ఆ తర్వాత సంస్థ పనితీరును సమీక్షించి ఈ విధానం మున్ముందు కొనసాగించాలా? లేదా? అనే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. బ్యాంకులో అంతర్గత విభాగాలైన ట్రెజరీ ఆపరేషన్స్, బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ బ్యాంకింగ్, హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్, ఫైనాన్స్ అకౌంట్స్ వంటి ఉద్యోగులకు మాత్రమే ఈ వర్క్ ఫ్రం హోం వర్తిస్తుంది. బ్యాంకు కస్టమర్లతో నేరుగా సంబంధం ఉండే ఉద్యోగుల విధులు యథావిధిగా కొనసాగుతాయని హెచ్‌డీఎఫ్‌సీ తెలిపింది. వర్క్ ఫ్రం హోం వల్ల వినియోగదారులకు బ్యాంకు సేవల్లో ఎలాంటి అంతరాయం ఉండదని పేర్కొంది.



ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్

యుద్ధం వేళ రక్షణరంగ కంపెనీల్లో అమెరికా అధ్యక్షుడి కటుంబం సొమ్ములు..!

వాషింగ్టన్: యుద్ధం ప్రపంచంలో అన్ని వర్గాలకు నష్టాలను మిగుల్చుతుంటే.. ట్రంప్ కుటుంబానికి మాత్రం లాభాలను కురిపిస్తోంది. ఇరాన్ పోరు వేళ ఆ కుటుంబ పెట్టుబడులపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అమెరికా స్టాక్ మార్కెట్‌లో అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధ్యక్షుడిగా కొనసాగుతూనే ఈ ఏడాది వేల సంఖ్యలో లావాదేవీలు చేయడం ఇప్పటికే చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఆయన ఎంచుకున్న కంపెనీల విషయం వెలుగులోకి వచ్చింది. ఆయన విధానాలతో నేరుగా ప్రభావితమయ్యే, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో లాభపడే సంస్థల్లో భారీ ఆర్డర్లు ప్లేస్ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆయన ఫోర్ట్‌ఫోలియోలో అమెరికా ఆయుధ సంస్థలు లాక్‌హీడ్ మార్టిన్, జనరల్ డైనమిక్స్, నార్తరోప్ గ్రూమన్ షేర్లు ఉన్నాయి. ట్రంప్ ఇటీవల చైనా పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా చైనాకు ఎన్విడియా (ఔలతిటతిజీ) చిప్‌ల ఎగుమతులపై ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎగుమతి నిబంధనలను సడలిస్తూ.. ఎన్విడియాకు చెందిన అధునాతన చిప్‌లను ఆమోదిత చైనా కస్టమర్లకు విక్రయించడానికి అంగీకరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ కుటుంబం 6 మిలియన్ల డాలర్ల మేరకు ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసింది. ట్రంప్ కుటుంబ వ్యాపారాలను చూస్తున్న ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. అధ్యక్షుడి పోర్ట్‌ఫోలియోను థర్డ్ పార్టీలు నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. "షేర్లు ఈ కంపెనీల్లోనే కొనాలి.. వాటినే ఎంచుకోవాలి అని ట్రంప్ కానీ, ఆయన కుటుంబం, ట్రంప్ ఆర్గనైజేషన్ నుంచి కానీ ఎలాంటి సూచనలు అందవు" అని ఆ ప్రతినిధి తెలియజేశారు. తమ సంతకాలతో ప్రభావితమయ్యే కంపెనీల్లో ట్రేడింగ్‌కు అమెరికా అధ్యక్షులు దూరంగా ఉంటారు. మామూలుగా అగ్రరాజ్య (జూం) ఉద్యోగులు తమ ప్రభుత్వ విధానాల వల్ల ప్రభావితమయ్యే ఆస్తులను కలిగి ఉండటానికి ఆ దేశ చట్టాలు అనుమతించవు. కానీ, ఈ విషయంలో అధ్యక్షుడికి మాత్రం మినహాయింపు ఉంటుంది. అయితే అధ్యక్షుడి పెట్టుబడులు ఏయే రంగాల్లో ఉన్నాయో తెలియడమే ఇక్కడ సమస్య అని ఎథిక్స్ అధికారులు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇవి ఆయన తీసుకొనే నిర్ణయాలను ప్రభావితం చేస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఫెడరల్ ఎథిక్స్ ఏజెన్సీలో ఫైల్ అయిన స్టాక్ ట్రేడింగ్ రిపోర్ట్ ప్రకారం.. ఈ ఏడాది 100 మిలియన్ల లావాదేవీలు జరిగాయి. ఇక్కడ స్టాక్స్ అమ్మకాల కంటే కొనుగోళ్లే ఎక్కువగా ఉన్నాయి. అయితే వాటి కచ్చితమైన విలువ మాత్రం వెలుగులోకి రాలేదు. ఇక, ఎన్విడియాతో పాటు యాపిల్, బోయింగ్, టెస్లాలో కూడా ట్రంప్ కుటుంబానికి షేర్లు ఉన్నాయి. చైనా పర్యటన సందర్భంగా అధ్యక్షుడి వెంట వెళ్లినవారిలో ఆ దిగ్గజ సంస్థల సీఈఓలు కూడా ఉండటం గమనార్హం. "ఆయన రక్షణశాఖ మంత్రి అయితే.. ఆయన చేసేది నేరం అవుతుంది. టెక్నికల్‌గా అధ్యక్షుడు ఇదంతా చేయొచ్చు. కానీ ఇది నమ్మకాన్ని ఉల్లంఘించడమే అవుతుంది" అని గత ప్రభుత్వాల్లో పనిచేసిన అధికారులు వ్యాఖ్యానించారు.

ట్రంప్‌నకు వాన్స్ మద్దతు..

ఈ కథనాలపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ స్పందించారు. ట్రంప్‌నకు మద్దతుగా మాట్లాడారు. "ట్రంప్ అధ్యక్ష కార్యాలయంలో కంప్యూటర్ ముందు కూర్చొని తన రాబిన్‌హుడ్ ఖాతా ద్వారా లావాదేవీలు చేయరు" అని వ్యాఖ్యానించారు.

రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించండి

వ్యయాలకు అదనపు ఆర్థిక సాయం కోరారు. సాస్కీ పథకం కింద రూ.5వేల కోట్ల ప్రత్యేక సాయం, విద్యారంగంలో పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు ఇవ్వాలని కేంద్రమంత్రిని భట్టి విక్రమార్క కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమన్నారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. 2014-2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థల (ఎస్‌పీవీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందంటూ కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని నిర్మలా సీతారామన్ దృష్టికి భట్టి విక్రమార్క తీసుకెళ్లారు. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని, దీనిలో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు.

మోదీ-మెలోనీ 'మెలోడీ' మూమెంట్ వైరల్..

న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రస్తుతం ఇటలీ పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా మోదీ-ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ మధ్య ఆత్మీయ సంభాషణ మరో సారి నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ఈ ఇద్ద రు నేతలు తమ స్నేహానికి గుర్తుగా వాడు తోన్న 'మెలోడీ' అందరికీ సుపరిచితమే. ఇప్పుడు ఆ పేరు మీద ఉన్న చాక్లెట్లను మెలోనీకి మోదీ గిఫ్ట్‌గా ఇచ్చారు. ఇదే సమయంలో భారత స్టాక్‌మార్కెట్ మదుపర్లు అనూహ్యంగా స్పందించారు. ఈ మెలోనీ రీల్ వైరల్ అయిన కొద్దిసేపటికే పార్లే సంస్థ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. స్టాక్ ఎక్స్ఛేంజీలో పార్లే ఇండస్ట్రీస్‌కు చెందిన 8 లక్షల షేర్లు చేతులు మారాయి. మామూలుగా ఒక వారంలో సగటున 2 లక్షల షేర్లు, నెలలో సగటున 3 లక్షలు షేర్ల కొనుగోలో లేక అమ్మకమో జరుగుతుంటుంది. నేటి ట్రేడింగ్‌లో ఆ సంఖ్య చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ సంస్థ పార్లే ఇండస్ట్రీస్ బీఎస్ఈలో లిస్ట్ అయింది. రీసైక్లింగ్ విభాగంలోనూ ఇది కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అయితే దీనికి మెలోడీ చాక్లెట్లకు ఎలాంటి సంబంధం లేదు. ఆ చాక్లెట్లను పార్లే ప్రొడక్ట్స్ సంస్థ తయారుచేస్తోంది. పార్లే-జి, మొనాకో, హైడ్ అండ్ సీక్, మాంగోబైట్.. ఈ సంస్థ బ్రాండ్లే. మెలోడీ చాక్లెట్లపై జార్జియా మెలోనీ వీడియో షేర్ చేయగానే పార్లే-జి సంస్థ స్పందించింది. "1983 నుంచి దేశాల మధ్య సంబంధాలను మధురంగా మారుస్తున్నాం" అంటూ ఇన్‌స్టాలో ఆ వీడియోను షేర్ చేసింది. ముంబయి కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఈ కంపెనీ.. స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అవలేదు. ఈ రోజు మెలోడీ మూమెంట్ వైరల్ అయిన తర్వాత పార్లే పేరు విషయంలో మదుపర్లు ఒకింత గందరగోళానికి గురైనట్లు కనిపిస్తోంది. కొనుగోళ్ల మద్దతుతో నేటి ట్రేడింగ్‌లో పార్లే ఇండస్ట్రీస్ అప్పర్ సర్క్యూట్‌ను తాకినప్పటికీ.. ఊగిసలాట కనిపించింది.

మెట్రో రెండో దశకు కేంద్రం సానుకూలం

తదుపరి నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 162 కిలోమీటర్ల మేర మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించిందని, సానుకూలంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని మనోహర్‌లాల్ ఖట్టర్ వెల్లడించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనపైనా సమావేశంలో చర్చించారు. అమృత్ 2.ా పథకంలో భాగంగా మూసీ నదిలో కలుస్తున్న మురుగు నీటిని శుద్ధి చేసేందుకు మొత్తం 39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లనులను మంజూరు చేశామని, ఈ ప్రాజెక్టు కోసం రూ.3 వేల 975 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఖట్టర్ చెప్పారు. 39 ఎస్?టీపీల ద్వారా రోజుకు 972 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం వస్తుందన్నారు. శుద్ధి చేయని మురికి నీరు నేరుగా మూసీ నదిలో కలవకుండా ఎస్‌టీపీలతో నిరోధించవచ్చన్నారు. మూసీ నది పరిరక్షణతో పాటు నగర పారిశుద్ధ్య మెరుగుదలకు ఇది ఎంతో దోహదం చేస్తుందని ఖట్టర్ తెలిపారు.

అత్యాధునిక సాంకేతికత నేరగాళ్లకే చేరితే!

- ప్రపంచానికి మైథోస్ భయాలు..
- ఆంథ్రోపిక్ కొత్త ఏఐ మోడల్ ప్రకంపనలు!

వాషింగ్టన్: రిలీజ్‌కాని ఓ ఏఐ మోడల్ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. ప్రపంచ బ్యాంకింగ్, ఫైనాన్స్ వ్యవస్థలను భయపెడుతోంది. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ నుంచి ఇండియా వరకు అత్యున్నత స్థాయి వ్యక్తులు ఉరుకుల పరుగుల మీద అత్యున్నత సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆ ఏఐ మోడల్ పేరే ఆంథ్రోపిక్‌కు చెందిన క్లాడ్ మైథోస్. ఇంతకీ దీనిపై ఎందుకీ ఆందోళన? సాధారణంగా మనుషులు కొన్ని గంటలు వెచ్చించి చేసే పనులను ఇప్పుడొస్తున్న అత్యాధునిక ఏఐ మోడళ్లు క్షణాల్లో చేసి పెడుతున్నాయి. ఇలా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ వ్యవస్థలో లోపాలను కనిపెట్టేందుకు రూపుదిద్దుకున్న ఏఐ మోడల్ ఆంథ్రోపిక్ మైథోస్. సైబర్ సెక్యూరిటీలోని లోపాలను గుర్తించడంతో పాటు దానికి పరిష్కార మార్గాలను కూడా చూపుతుంది. కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్, బ్రౌజర్‌లలో దశాబ్దాల కాలంగా ఉన్న లోపాలను కూడా కనిపెట్టగలదని నిరూపితమైంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. మరి ఈ ఆయుధం నేరగాళ్ల చేతికి చిక్కితే? సరిగ్గా ఈ ప్రశ్నే ఇప్పుడు అటు బ్యాంకింగ్ రంగాన్ని, టెక్నాలజీ సంస్థలను కలవరపాటుకు గురిచేస్తోంది. బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలు చాలా వరకు ఇంటర్ కనెక్టెడ్‌గా (పేమెంట్స్, స్టాక్ మార్కెట్, క్లియరింగ్ సిస్టమ్‌లు) ఉంటాయి. ఇవి ఐటీ సిస్టమ్‌లపై ఆధారపడి ఉంటాయి. ఒకవేళ ఒక బ్యాంక్‌లో సైబర్ దాడి జరిగితే.. అది ప్రపంచవ్యాప్తంగా ఇతర సంస్థలతో అనుసంధానం అయ్యి ఉంటుంది కాబట్టి, వాటిపైనా ప్రభావం పడుతుంది. పేమెంట్లు, ఫారెక్స్ ట్రేడింగ్, మనీ మార్కెట్, స్టాక్ మార్కెట్, డిపాజిటరీలు, పేమెంట్ గేట్‌వేలు.. ఇలా అన్నీ ప్రభావితమవుతాయి. వాస్తవానికి ఈ ఏఐ మోడల్‌ను పబ్లిక్‌గా ఇంకా రిలీజ్ చేయలేదు. ప్రాజెక్ట్ గ్లాస్ వింగ్‌లో భాగంగా యాపిల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్ వంటి 12 ప్రధాన టెక్ కంపెనీలు దీన్ని పరీక్షించాయి. ఇందులో భాగంగా చేపట్టిన టాస్కుల్లో మనుషుల కంటే సైబర్ సెక్యూరిటీ విషయంలో మెరుగైన పనితీరును కనబరచడంతో పాటు హ్యాకింగ్ టాస్కులను చేపట్టడం గమనార్హం. దీంతో పబ్లిక్ విడుదలను నిలిపివేశారు. అయితే, ఈ 12 కంపెనీలే కాక అనధికారిక యాక్సెస్ జరిగిందన్న రిపోర్టులూ బయటకొచ్చాయి. దీంతో మరిన్ని భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విషయాన్ని కంపెనీ కూడా ధ్రువీకరించింది. ఉన్నత స్థాయి సమావేశాలు ఏఐ మోడల్ ప్రభావాన్ని అంచనా వేయడానికి ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ ఈ నెల మొదట్లో అత్యవసరంగా సమావేశమయ్యాయి. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, ఐఎంఎఫ్ చీఫ్ మైథోస్ పట్ల ఆందోళన వ్యక్తంచేశాయి. భారత్‌లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఏఐ మోడల్స్ వల్ల కలిగే ముప్పు, డేటా సెక్యూరిటీపై దాని ప్రభావం చర్చించేందుకు బ్యాంకింగ్ రంగంలోని ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. బ్యాంకులు తమ ఐటీ సిస్టమ్‌లను బలోపేతం చేసుకోవాలని, వినియోగదారుల డేటాను రక్షించాలని బ్యాంకులకు ఆర్థిక మంత్రి సూచించారు. బ్యాంకులు కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు. ఇటువంటి ముప్పుల నుంచి తప్పించుకోవడానికి సత్వరమే స్పందించేలా ఒక మెకానిజం ఏర్పాటు చేసుకోవాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌కు సూచించారు.

జీతాల్లేవ్.. బతికేదెలా?

మూడు నెలల జీతాలు బకాయి.. గ్రామ పంచాయతీ కార్మికుల ఆవేదన

- పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తప్పదు : యూనియన్
- తక్కువ జీతాలతో కుటుంబ పోషణ కష్టమని కార్మికుల ఆవేదన
- పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలు అందించాలని డిమాండ్

సిరికొండ, మే 20 (జనం సాక్షి):
గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆర్. రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.
బుధవారం డీపీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు, ప్రజారోగ్య పరిరక్షణలో గ్రామ పంచాయతీ కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ వారికి సమయానికి జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామపంచాయతీల్లో రెండు నుంచి మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇటీవల కొన్ని గ్రామాల్లో కేవలం ఒక నెల జీతం మాత్రమే చెల్లించారని, మిగిలిన బకాయిలు ఇంకా చెల్లించాల్సి ఉందన్నారు. గ్రామపంచాయతీల్లో నిధులు లేవని అధికారులు చెబుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఆ నిధులను కార్మికుల జీతాల కోసం వినియోగించవద్దని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయని సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీడీవోలు చెబుతున్నారని తెలిపారు.
గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామ పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, అలాంటి కార్మికులకు కనీస వేతనాలు కూడా సక్రమంగా చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులు నెలల తరబడి జీతాలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కుటుంబ అవసరాలు తీర్చుకోలేక దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఆదివారాలు కూడా విధులు నిర్వహించాలని, ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేయాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. పని చేయకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు.
వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మురికి కాలువలు, చెత్త ప్రాంతాల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలు, శానిటరీ సామగ్రి, సబ్బులు, డెటాల్, గ్లౌజులు వంటి అవసరమైన వస్తువులను ప్రతి నెల తప్పనిసరిగా అందించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతి నెల క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించడంతో పాటు, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు వి. సత్తేవ్వ, జిల్లా నాయకులు అరవింద్, ఒడ్డెటి ఆశన్న, కే. రాజన్న, టి. జగన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభ విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, మే 20 (జనంసాక్షి) :
ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా ఈ నెల 22న శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే జిల్లా స్థాయి సభ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి సభ నిర్వహణ పై వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రారంభం నుండి జిల్లా స్థాయిలో వివిధ శాఖల నుండి అనేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని, వాటన్నింటినీ డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించాలని సూచించారు. ప్రతి శాఖకు సంబంధించిన ప్రగతి పై పది నిమిషాల సమాచారం సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు ఎంపికైన లబ్ధిదారులు, ప్రతి శాఖలో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, లబ్ధిదారుల ఎంపిక, ఆర్థికపరమైన లబ్ధి, వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు, బడిబాట, జాబ్ మేళా వంటి కార్యక్రమాలను గురించి ఈ సభలో వివరించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, సన్న రకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల వివరాలు సభలో వివరించాలని తెలిపారు. సాధించిన విజయాలపై శాఖలు ద్వారా సమాచారం ఇవ్వాలని, లబ్ధిదారుల అభిప్రాయాలు, అనుభవాలు చెప్పడం వంటివి జిల్లా స్థాయి సభలో నిర్వహించాలని అన్నారు. ఇప్పటి దాకా అమలు చేస్తున్న కార్యక్రమాలపై చర్చించాలని, భవిష్యత్తులో చేపట్టనున్న పనులపై వివరించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లా స్థాయి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సిపిఓ రామ్ దత్తారెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కిషోర బాలికలకు ప్రత్యేక వైద్య శిబిరం

జమ్మికుంట,మే 20 (జనం సాక్షి):
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కిషోర బాలికలకు మెప్మా, వావిలాల ప్రాథమిక వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్ మొలుగు చందన, డాక్టర్ మహోన్నత పటేల్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి,డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రవణ్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 15-18 సంవత్సరాలు ఉన్న కిషోర బాలికలకు హిమోగ్లోబిన్,షుగర్ వంటి పరీక్షలు నిర్వించినట్లు వారు తెలిపారు. బాలికలు విధిగా పౌష్టికమైన ఆహారం తీసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 20 - 23వ తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు నిర్వహిస్తున్నామని బాలికలకు ఎటువంటి సందేహాలు ఉన్న వారు నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం,జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్,సూపర్ వైజర్ అనిల్,హెల్త్ సూపర్ వైజర్ అరుణ, కొండపాక సదానందం హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏ ఎన్ ఎం రాధ, మంజుల, రజిత, మెప్మా సి.ఎల్.అర్పిలు జ్యోతి,అర్పిలు,ఆశ వర్కర్లతో పాటు కిషోర బాలికలు పలువురు పాల్గొన్నారు.

రైస్ మిల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

కామారెడ్డి ప్రతినిధి, మే 20 (జనంసాక్షి) : బుధవారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, జంగంపల్లి గ్రామంలోని శాకంబరి రైస్ మిల్లును సందర్శించి, ధాన్యం కొనుగోలు ,అన్‌లోడింగ్ కార్యకలాపాలను సమీక్షించారు. పరిశీలన సందర్భంగా పీపీసీల వద్ద పెండెన్సీ తగ్గించడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రస్తుత పీక్ ప్రొక్యూర్‌మెంట్ సీజన్ , వర్షాల అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి వాహనాల క్లియరెన్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హెడ్ ఆఫీస్ నుండి సుమారు 85 శాతం బాయిల్డ్ రైస్ అలొకేషన్ ముందుగానే అందినందుకు మిల్లర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అన్‌లోడింగ్ సామర్థ్యాన్ని పెంచడం వాహనాల క్లియరెన్స్‌ను వేగవంతం చేయడంలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి, డీఎం సివిల్ సప్లైస్, తహసీల్దార్ డీటీసీఎస్, తదితరులు పాల్గొన్నారు.

సత్య కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

మే 22న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమంను సజావుగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వేదిక ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పార్కింగ్ సదుపాయం, తాగునీటి వసతి మరియు ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఏసీ ఎల్బీ గిరి, జెడ్పీ సీఈఓ చందర్, డీపీఓ మురళి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉప్పల్ భగాయత్‌లో పోలీసుల ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమం

- "మీ సురక్ష - మీ భద్రతే మా ప్రాధాన్యత" నినాదంతో సమావేశం
- రెంటర్లు, గృహ కార్మికుల వివరాలు పోలీస్ యాప్‌లో నమోదు చేయాలని సూచన
- ఆకతాయిల వేధింపులు, రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలపై వాసుల ఫిర్యాదు
- ప్రత్యేక పహారా, నిఘా పెంపుతో భద్రత బలోపేతం చేస్తామని పోలీసుల హామీ

ఉప్పల్, మే 20 (జనం సాక్షి): ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో "మీ సురక్ష – మీ భద్రతే మా ప్రాధాన్యత" అనే నినాదంతో ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు రాయల్ రిడ్జ్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో కాలనీవాసులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. నగర పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న నేరాలు, చోరీలు, ఆకతాయిల వేధింపులు, సైబర్ మోసాల నేపథ్యంలో ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో నివసించే ప్రతి కుటుంబం తమ పరిసరాల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
ముఖ్యంగా రెంటర్లు, గృహ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, ఇతర సేవా సిబ్బంది పూర్తి వివరాలను పోలీస్ శాఖ రూపొందించిన ప్రత్యేక మొబైల్ అప్లికేషన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఈ సమాచారం నమోదు చేయడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు జరిగినా వేగంగా విచారణ జరిపి సమస్యలను పరిష్కరించడానికి సహాయపడుతుందని తెలిపారు. ప్రతి అపార్ట్‌మెంట్, ప్రతి కాలనీ పోలీస్ శాఖతో సమన్వయం కలిగి ఉంటే నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ సమస్యలపై స్పందించిన ఏసీపీ వెంకట్ రెడ్డి కాలనీలో ప్రత్యేక పహారా బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి వేళల్లో మరింత నిఘా పెంచుతామని హామీ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే సీసీ కెమెరాల ఏర్పాటు, బీట్ పోలీసింగ్ బలోపేతం వంటి చర్యలు కూడా చేపడతామని తెలిపారు.
అదేవిధంగా ప్రజలు కూడా ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్ వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ పలు భద్రతా సూచనలు చేశారు.
ఈ కార్యక్రమంలో డీఐ రవికుమార్, ఉప్పల్ ఎస్సై మాధవ రెడ్డి, భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, అపార్ట్‌మెంట్ ప్రతినిధులు, మహిళలు, యువత, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కాలనీవాసులు పోలీస్ శాఖ చేపడుతున్న భద్రతా చర్యలను అభినందించారు. "ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యం" అని పోలీసులు పిలుపునిచ్చారు.

అభివృద్ధిలో భాగంగా పురోగమన పనులు

కౌన్సిలర్: దూడం రజని శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగవంతం.

సిరిసిల్ల టౌన్ మే20(జనంసాక్షి) : సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటై మూడు నెలలు గడుస్తోంది. ఈ క్రమంలో వార్డు కౌన్సిలర్లు వార్డు అభివృద్ధి పనుల్లో తమ కృషిని కొనసాగిస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వార్డుల్లో మంచినీటి సౌకర్యం కోసం మెరుగైన చర్యల తోపాటు రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూస్తున్నారు, స్వచ్ఛ సర్వేక్షణ్ వైపు అడుగులు వేస్తున్నారు. వివిధ పనుల్లో తలమునకలవుతూ, వార్డు ప్రజల అవసరాన్ని గమనిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ఉత్సాహంగా అభివృద్ధి పనుల్లో లీనమవుతున్నారు. దీనికి తోడు మున్సిపల్ సహకారం ఆర్,పి,ల సహాయంతో వాడవాడలో తిరుగుతూ జనగణన లెక్కలు, స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా తడిచెత్త పొడిచెత్త వేరు చేయడానికి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణలో 6వవార్డు కు చెందిన ఆర్,పి లైన గడ్డం లక్ష్మి,శ్రీగాద వనజ, కట్లపద్మ లు ఎండలో సైతం తమ విధులు తాము నిర్వర్తిస్తూ వార్డు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వ్యవహరిస్తున్నారు. పెన్షన్ సర్వే, దరఖాస్తుల సర్వే, మెప్మా సంఘాల్లో లోన్ ల అవసరాల్ని గుర్తిస్తూ ముందుకు సాగుతున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా విద్యుత్ సమస్యతో బాధపడుతున్న విద్యుత్ వినియోగదారులకు ఊరట కల్పించే విధంగా ఎన్పీడీసీఎల్ సహకారంతో ప్రజల ఇబ్బందులను తొలగి స్తున్నారు. 6వ వార్డు కౌన్సిలర్ దూడం రజని- శ్రీనివాస్, చిమ్మని ప్రకాష్,ల ఆధ్వర్యంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, చెడిపోయిన స్తంభాలను తీసివేస్తూ కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. కౌన్సిలర్ దూడం రజనీ శ్రీనివాస్ చొరవతో విద్యుత్ కు సంబంధించిన పనులు వేగవంతం కావడం గమనార్హం. ఇంకా ఇతరత్రా అభివృద్ధి పనుల్ని ముందు ముందు వేగవంతం చేయాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెద్ద కొడప్గల్ మే 20 (జనంసాక్షి):
పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో బుధవారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు జొన్న పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని, దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. సొసైటీ కార్యదర్శి సందీప్ కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎకరానికి 10 క్వింటాళ్ల చొప్పున జొన్నలు కొనుగోలు చేయడం జరుగుతుందని, క్వింటాలుకు 3,699 రూపాయలు మద్దతు ధర ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అంజయ్య, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పల్లె పల్లెలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగిరేద్దాం

- మాదిగ యువతను చైతన్యం చేస్తాం
- ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ

తలకొండపల్లి,మే 20 (జనంసాక్షి) :
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు విద్యా,సంస్థగత నిర్మాణం,జెండా ఆవిష్కరణల కోసం మాదిగ పల్లెల్లోకి ప్రతి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల నాయకులు వెళ్లి అక్కడి మాదిగ యువతను చైతన్యం చేసే విధంగా ముందుకు సాగాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికారప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ అన్నారు.బుధవారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తుడుం శ్రీను మాదిగ అధ్యక్షతన జరిగిన తలకొండపల్లి మండల సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ హాజరై ప్రసంగించారు. ఎస్సీల వర్గీకరణ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30ఏళ్లు పోరాటం చేసి వర్గీకరణ సాధించుకున్నామని ఈ సాధించుకున్న వర్గీకరణ ఫలాలను మన జాతి బిడ్డలు అందిపుచ్చుకునేలా వారిని చైతన్యం చేయడం కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఇచ్చిన కార్యచరణలో భాగంగా గో టు విలేజ్ మాదిగ పల్లెలకు తరలిరండి అనే కార్యక్రమం ఈనెల 25న మొదలై జూలై 05 వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇంజం వెంకటస్వామి మాదిగ విజ్ఞప్తి చేశారు. అలాగే గతంలో తలకొండపల్లి మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు నూతన కమిటీల నిర్మాణం జరిగిందని అలాగే ఎక్కడైతే గ్రామాలలో నూతన కమిటీలు నిర్మాణం జరగలేదో అక్కడ ఎమ్మార్పీఎస్ మరియు ఎంఎస్పి అనుబంధ సంఘాల గ్రామ కమిటీలు నిర్మాణం చేయాలని సూచించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఇతర గ్రామాలలో దిమ్మల నిర్మాణం జరగలేదో అక్కడ నూతన గద్దె నిర్మాణాలు చేసి ఏదైతే మాదిగలకు పండుగ దినోత్సవం అయినా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జూలై 7న 32వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు జరిపించి ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి శ్రీకాంత్ మాదిగ,వీహెచ్పీఎస్ మండల అధ్యక్షులు పెరుమాండ్ల నారాయణ,ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి ఏదుల శరత్ చంద్ర, నాయకులు దర్వుల గోపాల్, పెరుమాండ్ల జంగయ్య, పోతుగంటి కృష్ణ, సొల్లు రాజు, ఉపేందర్, మహేష్, మల్లేష్, జగన్, రాజు, రమేష్, గణేష్, శివ, ఈశ్వర్, రవి, తదితరులు ఉన్నారు.

దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఫోక్స్ కేసు నమోదు

- మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసుల నిర్ధారణ
- అఘాయిత్యం జరిగినట్లు బయటకు చెబితే చంపేస్తామని బాలికను బెదిరింపులు
- ఇద్దరు వ్యక్తులపై ఫోక్సో కేసు నమోదు చేసిన దుండిగల్ పోలీసులు



నిజాంపేట్ మే 20(జనం సాక్షి) :
నగరంలో నిత్యం ఏదో ఒకచోట నేరాలు హత్యలు అత్యాచారాలు, మహిళల వేధింపులు నిత్య కృత్యమై పోతుందనడంలో ఆశ్చర్యం అక్కర్లేదు. ఇటీవల కేంద్ర హోం మంత్రి కుమారుడి పై ఫోక్సో కేసు నమోదైన విషయం అందరికీ విదితమే. తాజాగా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో మైనర్ బాలికపై ఇద్దరు యువకులు అఘాయిత్యానికి పాల్పడినట్లు తాజాగా వార్త వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ 59 సర్కిల్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో గల డబుల్ బెడ్ రూమ్ సముదాయంలో నివసించే మైనర్ బాలికను అదే దుండిగల్ గ్రామానికి చెందిన దార శివకుమార్ వయస్సు(20) డబుల్ బెడ్ రూమ్‌కు దగ్గర టెంట్ హౌస్ పనిచేస్తుంటాడు. అదే డబుల్ బెడ్ రూమ్ లో ఓ మైనర్ బాలికను నిత్యం బాలిక ఇంటిని తెలుసుకొని ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివకుమార్ అనే వ్యక్తి గత నవంబర్ 25 నెలలో లైంగిక వేధింపులతో పాటు అఘాయిత్యానికి పాల్పడినట్లు, అలాగే ఈ విషయం బయటకు తెలిస్తే చంపేస్తానని బెదిరించడం తో ఆ బాలిక భయపడి ఇంట్లో ఎవ్వరికి తెలియపరచలేదు. అంతటితో యువకుడు తన స్నేహితుడైన నిజాంపేట్ రాము అలియాస్ రామ్ వయసు (30) వీరిద్దరూ నిత్యం ఆ బాలికపై వేధింపులు కొనసాగించి అఘాయిత్యానికి పాల్పడినట్లు, నిత్యం చిత్రహింసలు గురి చేస్తుండడంతో ఆ బాలిక విషయం అంతా తల్లిదండ్రులకు తెలపడంతో భయాందోళనకు చెందిన బాలిక తల్లిద ఈ నెల 17న దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో చేయడం జరిగింది. విచారణంతరం ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని 20వ తేదీ ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులు దార శివకుమార్, రాములపై ఫోక్సో కేసు కింద నమోదయ్యే పలు సెక్షన్లపై కేసులు నమోదు చేసి పూర్తి విచారణ తో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ఉప్పల్ భగాయత్‌లో అభివృద్ధికి శ్రీకారం

- రూ.10 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనుల ప్రారంభం
- పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు
- మల్టీ లెవెల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, కమ్యూనిటీ హాల్‌కు ప్రణాళికలు
- భగాయత్‌ను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామన్న రజిత పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్, మే 20 (జనంసాక్షి): ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని హెచ్‌ఎండీఏ భగాయత్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలను వేధిస్తున్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) నిధులతో రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులను ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పనులు ప్రారంభమైనందుకు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భగాయత్ ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా రహదారి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారిపోవడం, ఎండాకాలంలో దుమ్ముతో ప్రజలు ఇబ్బందులు పడటం వల్ల ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు రోజువారీ రాకపోకల్లో కష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నిసార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.
భగాయత్ ప్రాంత అభివృద్ధి కేవలం రోడ్లకే పరిమితం కాదని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. యువత కోసం అత్యాధునిక సౌకర్యాలతో మల్టీ లెవెల్ క్రీడా సముదాయం నిర్మించనున్నట్లు వెల్లడించారు. స్థానిక యువత క్రీడల్లో రాణించేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. అదేవిధంగా కాలనీ వాసులు వివాహాలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఇంకా భగాయత్ ప్రాంతంలో పార్కుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, కొత్త వీధి దీపాల ఏర్పాటు, కాలనీలో శుభ్రత మెరుగు దల వంటి పనులను దశల వారీగా పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి చిన్న సమస్యను పరిష్కరించే దిశగా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. భగాయత్ ప్రాంతంలోని ప్రతి సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు సమకూర్చి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. ఉప్పల్ భగాయత్‌ను నియోజక వర్గంలోనే ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రోడ్ల సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు పనులు ప్రారంభం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు పూర్తయితే భగాయత్ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈగ సంతోష్, నిధానకవి సుధాకర్, పూజల ప్రభాకర్, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, అలుగుల అనీల్ కుమార్, బల్ రెడ్డి, అల్వాల భాస్కర్, డిన్నే భీమ్‌సేన్, పస్తాం శ్రీరాములు, ఈగ నవీన్, మల్లెపెల్లి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
21 మే 2026

ధాన్యం నిల్వ చేసేందుకు గోదాంలను సిద్ధం చేయాలి

- ధాన్యం తరలించేందుకు వాహనాలు, లోడింగ్, అన్ లోడింగ్‌కు హమాలీల సంఖ్యను ఇంకా పెంచాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 20 (జనం సాక్షి); ధాన్యం నిల్వ చేసేందుకు జిల్లాలో అందుబాటులో ఉన్న గోదాంలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం సేకరణ, గోదాంల వినియోగం, తూకం వేసిన బస్తాల తరలింపు, వాహనాలు, హమాలీల సంఖ్య పెంపు, మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయడం, సన్న రకాల సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం, తదితర అంశాలపై బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, వ్యవసాయ, తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతుందని, చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని, రైతులకు క్షేత్ర స్థాయిలో భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజువారీగా సేకరణలో పురోగతి పెంచడంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న గోదాంలను వినియోగం లోకి తీసుకువచ్చి, ధాన్యం నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను వాహనాల ద్వారా తరలించ డం, దీని కోసం సరిపడా వాహనాలు సమకూర్చేలా సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. హమాలీల సంఖ్యను మరింత పెంచి ధాన్యం లోడింగ్, మిల్లులు, అపరల్ పార్కులో అన్ లోడింగ్ చేయడంలో వేగం పెంచాలని ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించి ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. సన్న రకం వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, వచ్చే సీజన్ లో రైతులు సన్న రకం వరి సాగు చేసేలా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో అవగాహన, విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. అకాల వర్షాలు పడితే ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, త్వరితగతిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

డ్రైనేజీలలో పేరుకపోయిన చెత్తా చెదారం

పడకేసిన పారిశుధ్యం

ముత్తారం మే 20(జనంసాక్షి) : ఒకవైపు ప్రజా పాలన. ప్రగతి ప్రణాళిక కొనసాగుతుండగా.. మరోవైపు పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం పోతారం గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీలలో చెత్త చెదారం,వ్యర్థాలు పేరుక పోయి, దిగువకు మురికి పారడం లేదు. దీంతో శుభ్రత కనుమరుగైంది. గ్రామంలో మురికి కాల్వలలో చెత్తాచెదారం,ప్లాస్టిక్ వ్యర్థాలు నిలిచిపోయి..కంపు కొడుతున్నా. స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో రోడ్డుకు వైపులమురికి కాల్వల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. కాల్వలను ఎప్పుడు శుభ్రం చేస్తారో తెలియని అయోమయమైన వాతవరణం నెలకొంది. చెత్త చెదారం మూలంగా కాలువలో నీరు నిలిచిపోయి.. దుర్గందంతో పాటు దోమలు చెలరేగడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పారిశుద్ధంతోపాటు పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యతను నిస్తున్నట్లు సమావేశాలలో అధికారులు మాట్లాడుతున్నారు. కాని గ్రామంలో ఎక్కడా ఆ పరిస్థితి కానరావడం లేదు. కనీసం 15 రోజుల కొకసారైనా మురికి కాలువలను శుభ్రం చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళికలో అధికారులు తమ సిబ్బందితో పచ్చదనం..పరిశుభ్రతపై తూ.. తూ మంత్రంగా ప్రజలకు అవగాహన నిర్వహించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని అంటున్నారు. పారిశుధ్యంపై ఏలాంటీ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామంలో మురికి కాలువలు శుభ్రతకు ఏలాంటీ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు తమ సిబ్బందితో ఎప్పటికప్పుడు మురికి కాల్వలను శుభ్రపరిచి, ప్రజలను కలుషిత వాతావరణం నుండి కాపాడాలని కోరుతున్నారు.

తాగునీటి ట్యాంక్‌లో కుళ్ళిన కోతుల కళేబరాలు

- కుదాభక్షపల్లిలో అధికారుల నిర్లక్ష్యం
- ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం -
- కలెక్టర్ చర్యలకు డిమాండ్

మర్రిగూడ,మే 20(జనం సాక్షి) : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం కుదాభక్షపల్లి గ్రామంలో బట్టబయలైంది. గ్రామానికి తాగు నీరు సరఫరా చేసే సాగర్ వాటర్ ట్యాంక్‌లో కుళ్ళిపోయిన కోతుల మృతదేహాలు లభ్యమవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కుదాభక్షపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్లాట్లకు తాగునీరు సరఫరా చేసే ట్యాంక్‌కు సరైన మూతలు లేకపోవడంతో కోతులు లోపల పడి మరణించాయి. రోజుల తరబడి ఆ కళేబరాలు నీటిలోనే కుళ్ళిపోవడంతో ట్యాంక్ అంతా విషపూరితంగా మారింది. ఈ విషయాన్ని గమనించని పంచాయతీ సిబ్బంది అదే కంపుకొడుతున్న నీటిని గ్రామస్తులకు సరఫరా చేశారు. గత కొన్ని రోజులుగా దుర్వాసన, రంగు మారిన నీరు వస్తున్నా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషపూరితమైన నీటిని తాగిన చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. తాగునీటి శుద్ధతను నిరంతరం పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శి తన విధులను పూర్తిగా విస్మరించారని, కార్యాలయానికే పరిమితమయ్యారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

లంచం తీసుకున్న లేడీ ఎస్ఐ, రైటర్ అరెస్ట్

బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ దాడులు

సికింద్రాబాద్ (జనంసాక్షి): ఓ కేసులో నిందితుని వద్ద నుండి రూ. 30 వేలు లంచం డిమాండ్ చేసి బోయిన్పల్లి పోలీస్ స్టేషన్‌లో తీసుకుంటున్న మహిళ ఎస్ఐ కిరణ్ నందిత, రైటర్ విజయకుమార్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.... బోయినపల్లి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిపై కుటుంబ వివాదల నేపథ్యంలో తండ్రి రెండు సార్లు కేసు పెట్టాడు. అయితే బోయినపల్లి పీఎస్ ఎస్ఐ కిరణ్ నందిత కేసు నమోదైన నిందితున్ని కోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రతి సోమవారం పీఎస్‌లో హాజరు కావాలని సూచించింది. ఆ నిందితుడు తాను బోయినపల్లి నుంచి కొండాపూర్ కు వెళ్తున్నానని, తనకి ప్రతి సోమవారం రావడం వీలుకాదని, హాజరు నుంచి మినహాయింపు కావాలని రైటర్ విజయ్ కుమార్ ను రిక్వెస్ట్ చేశాడు. దీంతో రైటర్ ముందుగా రూ,15 వేలు లంచం డిమాండ్ చేసాడు. ఇందులో 10 వేలు లేడీ ఎస్ఐకి, 5 వేలు అతనికి అని చెప్పాడు. నిందితుడు తాను ఎస్ఐ తో మాట్లాడుతానాని చెప్పి, ఆమెను అడగడంతో ఆమె ఏకంగా రూ.30 వేలు డిమాండ్ చేసింది. దీంతో చేసేది ఏమి ఇస్తానని ఒప్పుకొని.. ఆ బాధితుడు ఏసీబీ అధికారులకి ఫిర్యాదు చేసాడు. బుధవారం మహిళ ఎస్ఐ కిరణ్ నందిత డిమాండ్ మేరకు భాధితుడు రూ.30 వేలు తీసుకుని వచ్చాడు. లేడీ ఎస్ఐ తన చేతితో లంచం డబ్బు తీసుకోకుండా తన స్కూటీ తాళం ఇచ్చి అందులో పెట్టి రావాలని చెప్పింది. బాధితుడు ఆమె చెప్పినట్లు చేసి తిరిగి స్కూటీ తాళాన్ని లేడీ ఎస్ఐకి ఇచ్చాడు. ముందుగానే ప్లాన్ ప్రకారం అక్కడికి చేరుకున్నా ఏసిబి అధికారులు ఇదంతా చూసి, లేడీ ఎస్ఐ కిరణ్ నందిత, రైటర్ విజయ్ కుమార్‌లను అరెస్ట్ చేసి లంచం డబ్బును రికవరీ చేసారు.

రైతులు పండించిన ప్రతి ధాన్యపు
గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, మే 20 (జనంసాక్షి): రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పరిధిలోని మర్రిపల్లి రైస్ మిల్లులను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, మిల్లింగ్ సక్రమంగా జరుగుతుందో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మిల్లర్లు నిబంధనలు పాటిస్తూ ధాన్యం త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని, మిగతా దానికోసం జిల్లా కేంద్రంలోని అపరల్ పార్క్ గోదాంలో దిగుమతికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదనంగా లారీలు, వ్యాన్లు తెప్పిస్తున్నామని, ధాన్యం తరలించదానికి రైతులు ట్రాక్టర్లు కూడా వినియోగిస్తున్నారన్నారు. వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట వేములవాడ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ నాయకులు వకులాభరణం శ్రీనివాస్, సోయినేని కరుణాకర్, నాగం కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు

పెద్దపల్లి మండల విద్యా వనరుల కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

పెద్దపల్లి, మే 20 (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద, సమగ్ర శిక్షా ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మల్లేష్ గౌడ్ బుధవారం మండల విద్యా వనరుల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన సిబ్బందిని గుర్తించి, అటెండెన్స్ రిజిస్టర్‌లో నమోదు చేశారు. తనిఖీ అనంతరం డీఈఓ, ఎంఆర్‌సి సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో జరుగుతున్న కులాల అప్‌డేటింగ్, విద్యార్థుల ప్రమోషన్ (2026-27) కార్యక్రమాల స్టేటస్‌ను సమీక్షించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు. డీఈఓ కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలకు సకాలంలో స్పందించి, అప్పగించిన విధులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. విధులు సక్రమంగా నిర్వహించని సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద స్పష్టం చేశారు.

గ్రామాల్లో అలజడులు సృష్టించడం అవివేకం

పెద్దపల్లి, మే 20 (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాల సందర్భంగా బహుజన వర్గాల వారు బోనాలు తీయడాన్ని కొందరు అడ్డుకోవడం సరికాదని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు ఇరికిల రాజనర్సయ్య, పార్లమెంట్ ఇంచార్జ్ కాదాసి రవీందర్ మాట్లాడుతూ, గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఒకే వర్గంగా కలిసికట్టుగా పండుగలు, ఉత్సవాలు జరుపుకునేవారని గుర్తు చేశారు. కానీ నేటి కంప్యూటర్ యుగంలో కూడా కుల, మత బేధాలు రావడానికి అగ్రవర్ణ ధోరణులు, పెట్టుబడిదారీ రాజకీయ వ్యవస్థలు, మనువాద పార్టీలే కారణమని మండిపడ్డారు.

జగిత్యాల జిల్లాలో ఘోర విషాదం

కోనేరులో పడి ముగ్గురు చిన్నారులు మృతి



జగిత్యాల జిల్లా క్రైమ్, జనం సాక్షి : జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండపూర్ గ్రామంలో కోనేరులో పడి చిన్నారులు మృతి చెందిన సంఘటనతో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆటలాడుకుంటూ వెళ్లిన ముగ్గురు అమాయక చిన్నారులు ప్రమాదవశాత్తు కోనేరులో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయవిదారక ఘటన మేడిపల్లి మండల పరిధిలోని కొండపూర్ గ్రామంలో ఇవాళ సాయంత్రం చోటుచేసుకుంది. ఒకేసారి ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో గ్రామంలో ఒకేసారి తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. కొండపూర్ గ్రామానికి చెందిన వడ్ల గట్ల శేఖర్ తన కుటుంబ సభ్యులతో కలిసి కొండాపూర్ గ్రామంలోని శివగంగ ఆలయానికి మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్లగా ఆటలాడుకుంటున్న పిల్లలు ప్రమాదవశాత్తు మనవిత్ (10), మనస్విని (9), షర్వింద్ (7) అనే ముగ్గురు చిన్నారులు ఆడుకోవడానికి బయటకు వెళ్లారు. కోనేరులో పడి చనిపోయారు ఈ క్రమంలో గ్రామంలోని కోనేరు సమీపంలోకి వెళ్లిన చిన్నారులు ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటి నుంచి బయటకు రాలేక ఊపిరాడక ముగ్గురూ నీటిలోనే ప్రాణాలు విడిచారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. చిన్నారులు కోనేరులో పడిపోయిన విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆ వెంటనే మేడిపల్లి పోలీసులు హుటాహుటిన స్పాట్‌కు చేరుకున్నారు. స్థానికుల సాయంతో కోనేరులో గాలించి చిన్నారుల మృతదేహాలను వెలికితీశారు. ముక్కుపచ్చలారని చిన్నారుల శవాలను చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సేకరించిన ఫిర్యాదు మేరకు కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ కే లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి రిత్యా చిన్నారులను బయటకు పంపవద్దని చెరువుల వద్దకు గాని, ఈత సరదా తో ప్రాణాలతో చెలగాటమాడవద్దని సూచించారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ లక్ష్యం

24 ఏళ్ల తర్వాత తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

- జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే
- జూలై 31న డ్రాఫ్ట్, అక్టోబర్ 1, 2026న తుది జాబితా
- బీఎల్‌ఏల నియామకం ద్వారా రాజకీయ పార్టీల పర్యవేక్షణ

పెద్దపల్లి, మే 20 (జనంసాక్షి): జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో నిర్వహించిన ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణలో 24 సంవత్సరాల తర్వాత ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారి ఎస్ఐఆర్ నిర్వహించారని గుర్తు చేశారు. అక్టోబర్ 1, 2026ను ప్రమాణిక తేదీగా తీసుకొని అప్పటికి 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమన్నారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, డూప్లికేట్ ఓట్లు తొలగింపు కూడా ఈ ప్రక్రియలో భాగమని తెలిపారు. ప్రస్తుత ఓటర్ల జాబితాను 2002 ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నారని, 2002 తర్వాత కొత్తగా చేరిన ఓటర్లు సంబంధిత ఆధారాలు చూపించాలని సూచించారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్‌ఏలను నియమించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని కోరారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని, జూలై 31న డ్రాఫ్ట్ ఎస్ఐఆర్ జాబితా, అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు గంగయ్య, సురేష్, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కీసరగుట్ట హెరిటేజ్ వాక్‌కు విశేష స్పందన

- ఆధ్యాత్మికత, చారిత్రక వైభవానికి ప్రతీకగా కీసరగుట్ట
- ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం : కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 20 (జనంసాక్షి): పురాణాలకు చరిత్రగా, ఆధ్యాత్మికతకు నిలయంగా, సాంస్కృతిక సంపదకు కేంద్రంగా పేరుగాంచిన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం నిర్వహించిన హెరిటేజ్ వాక్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో చారిత్రక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో హెరిటేజ్ వాక్‌లు నిర్వహిస్తున్న నేపథ్యంలో, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో కీసరగుట్టను పర్యాటక శాఖ ఎంపిక చేసింది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు నంది విగ్రహం వద్ద ప్రారంభమైన హెరిటేజ్ వాక్ ఆలయం పైభాగం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఌ జిల్లా పర్యాటక అధికారి (ఇంచార్జ్) ఐ. విజయకుమారి, ఎల్డీఎం శివప్రసాద్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాధిక పాల్గొన్నారు.

అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కోలాటం కళాకారులు, సైక్లింగ్ క్రీడాకారులు, విద్యార్థులు, స్థానిక యువత, ఆలయ పురోహితులు, ఉపాధ్యాయులు, ఎంపీఓలు, స్పోర్ట్స్ బీపీటీలు, ప్రజాప్రతినిధులు పాల్గొనగా సుమారు 150 మంది హెరిటేజ్ వాక్‌లో భాగమయ్యారు.

అనంతరం ఆలయ కమిటీ ఛైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ కలెక్టర్‌కు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు వేదమంత్రోచ్చరణల మధ్య కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం ఘనంగా జరుగుతున్నాయని, దేశవ్యాప్తంగా భక్తులు ఇక్కడికి తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందుతున్నారని తెలిపారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల్లో కొత్తదనంతో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

దేశ, విదేశాల్లో ఉన్న దాతలు కీసరగుట్టపై అపార భక్తి కలిగి ఉన్నారని, వారి విరాళాలతో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ప్రభుత్వం, దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పర్యాటకాభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు అందితే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ కీసరగుట్ట ఆధ్యాత్మిక, పర్యాటక పరంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని, ఆలయ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే సహించం

- వడ్ల కొనుగోలుపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు: ఎమ్మెల్యే విజయరమణరావు
- తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేసి రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- అక్రమ దందాలపై మాట్లాడే ముందు గత పాలన గుర్తు చేసుకోవాలని సూచన
- పెద్దపల్లిలో పారదర్శకంగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయన్న ప్రభుత్వ విప్

పెద్దపల్లి, మే 20 (జనంసాక్షి): ఆధారాలు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హెచ్చరించారు. పెద్దపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల విషయంలో ఎలాంటి రాజకీయ భేదాలు లేకుండా పార్టీలకు అతీతంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తిగా పారదర్శకంగా సాగుతున్నాయని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అవగాహన లేకుండా వడ్ల కొనుగోళ్లపై వ్యాఖ్యలు చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలో క్వింటాల్‌కు 10 నుంచి 15 కిలోల వరకు కోతలు విధించి రైతుల నడ్డి విరిచిన విషయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. అలాంటి వారు ఇప్పుడు రైతుల పక్షాన మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వరి కొనుగోళ్లలో పెద్దపల్లి నాలుగో స్థానంలో నిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేస్తూ మార్కెటింగ్ ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం నష్టాన్ని భరిస్తోందని తెలిపారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక, మట్టి అక్రమ దందాలు సాగాయని, వాటి వెనుక ఎవరు ఉన్నారో ప్రజలకు బాగా తెలుసన్నారు. రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైన గత పాలకులు ఇప్పుడు విమర్శలు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు, టెయిల్‌ఎండ్ ప్రాంతాలకు కూడా సాగునీరు అందించి రైతుల ముఖాల్లో ఆనందం నింపామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్, హరీశ్‌రావు ప్రేరేపణతో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించేవేనని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద తమ అనుచరులతో గందరగోళం సృష్టించి రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు, సీసీ కెమెరాల పనితీరుపై ముమ్మర తనిఖీలు

- షోరూమ్‌లలో మెటల్ డిటెక్టర్లు, ఎమర్జెన్సీ అలారాలు తప్పనిసరి
- హోటళ్లు, లాడ్జీల్లో కఠిన నిబంధనలు
- అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ హెచ్చరిక

కరీంనగర్ బ్యూరో, మే 20 (జనంసాక్షి): కరీంనగర్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా బుధవారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆధ్వర్యంలో బంగారు ఆభరణాల షోరూమ్‌లు, లాడ్జీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వెంకటస్వామి, వేణుగోపాల్, వాసాల సతీష్, ఇన్‌స్పెక్టర్ రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ గౌష్ ఆలం షోరూమ్ నిర్వాహకులు, హోటల్ యాజమాన్యాలకు పలు కీలక సూచనలు చేశారు. బంగారు ఆభరణాల షోరూమ్‌లలో ఖచ్చితంగా అర్హత గల భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, ప్రవేశ ద్వారాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్లు తప్పనిసరిగా ఉపయోగించాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో అప్రమత్తం చేయడానికి ఎమర్జెన్సీ అలారం సిస్టమ్‌లను అమర్చి, పోలీసులకు తక్షణం సమాచారం అందేలా అధునాతన సాంకేతికతను అనుసంధానం చేసుకోవాలన్నారు. హోటళ్లు, లాడ్జీల్లో రూములు అద్దెకు ఇచ్చేటప్పుడు కస్టమర్ల నుంచి ఆధార్ కార్డు లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులు తప్పనిసరిగా సేకరించి, ఫోన్ నంబర్లను క్రాస్ చెక్ చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పదులైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అన్ని వ్యాపార సముదాయాలు, హోటళ్లలో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని, విజువల్స్ స్పష్టంగా ఉండేలా బ్యాకప్ సామర్థ్యం సరిగ్గా ఉండాలని ఆదేశించారు. భద్రతా ప్రమాణాల్లో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు. నగరంలో ప్రజల ఆస్తి, ప్రాణ రక్షణకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని, వ్యాపార సంస్థల నిర్వాహకులు పోలీసు నిబంధనలకు లోబడి వ్యాపారాలు నిర్వహించి, భద్రతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మెటాలో భారీగా ఉద్యోగుల తొలగింపు

వర్క్‌ఫ్రమ్ హోమ్ అంటూనే సడన్‌గా లేఆఫ్స్

న్యూఢిల్లీ, మే20 (జనంసాక్షి) : ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాలో ఉద్యోగ తొలగింపులు ప్రారంభ మయ్యాయి. సంస్థ తొలుత తమ ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోమ్ చేయాలని చెప్పి.. సడన్‌గా లేఆఫ్ మెయిల్స్ పంపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయం నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సింగపూర్, యూఎస్, యూకే వంటి ప్రాంతాల్లోని ఉద్యోగులకు తొలుత ఇంటినుంచే పని చేయాలని కంపెనీ తెలిపింది. అందుకు వారు సిద్ధమవుతుండగా.. సరిగ్గా తెల్లవారుజామున ప్రభావిత ఉద్యోగులకు లేఆఫ్ మెయిల్స్ పంపింది. ఎలాంటి గందరగోళం జరగకుండా ఉండేందుకు సంస్థ ఇలాంటి చర్యలు తీసుకున్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ చర్యపై నెట్టింట తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక, మెటా తన సింగపూర్‌లోని టీమ్‌కు తొలుత ఈ మెయిల్స్ పంపించింది. ఉదయం 4 గంటలకు భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 1:30 గంటలకు వారికి అవి అందాయి. ఈ తొలగింపులకు ముందు ప్రపంచవ్యాప్తంగా మెటాలో దాదాపు 78 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. తాజాగా 10 శాతం అంటే.. దాదాపు 8,000 మందిని ఉద్యోగం నుంచి తొలగించనుంది. ఇందులో ఎక్కువగా ఇంజినీరింగ్, ప్రొడక్ట్ బృందాలు ప్రభావం కానున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ ఏడాది చివర్లో కంపెనీ మరికొన్ని తొలగింపులు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. 7వేల మందిని ఏఐ విధుల్లోకి మార్చనున్నట్లు మెటా హెచ్ఆర్ చీఫ్ జానెలలె గేల్ ఇప్పటికే తెలిపారు.

నేటి నుంచి సరస్వతి అంత్యపుష్కరాలు

- ఏర్పాట్లు పూర్తి చేశాం : మంత్రి సురేఖ



వరంగల్, మే 20 (జనంసాక్షి) : సరస్వతి అంత్య పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఈ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. బుధవారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయంలో కంచి పీఠాధిపతి విజయేంద్రస్వామితో కలిసి కొండ సురేఖ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం బయట మంత్రి కొండా సురేఖ విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ అంత్య పుష్కరాలకు రూ. 200 కోట్లకు పైగా నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. రోజుకు ఒక స్వామీజీ స్నానంతో ఈ పుష్కరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పుష్కరాలు జరిగే ఈ పది రోజులు.. 10 మంది పీఠాధిపతులు వస్తారని వివరించారు. కాళేశ్వరంలో జరిగే ఈ సరస్వతి పుష్కరాల్లో ప్రతి రోజు సాయంత్రం గోదావరి హారతి ఇస్తారని చెప్పారు. లాగే ఈ పుష్కరాల సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామని కొండా సురేఖ వివరించారు. ఈ పుష్కరాల సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున సేవలందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బాసర నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం వరకు దేవాలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. గురువారం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద సరస్వతి నది అంత్య పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. మే 21 నుంచి జూన్ 1వ తేదీ వరకు మొత్తం 12 రోజుల పాటు ఈ అంత్య పుష్కరాలు జరుగనున్నాయి.

గవర్నర్‌తో డీజీపీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి భేటీ

హైదరాబాద్, మే 20(జనంసాక్షి) : రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను బుధవారం లోక్‌భవన్‌లో పలువురు ప్రముఖులు కలిశారు. తొలుత డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్ గవర్నర్‌ను కలిసి రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని వివరించారు. అనంతరం ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి గవర్నర్‌తో భేటీ అయ్యారు. నూతన విద్యా విధానం అమలు, ఉన్నత విద్యలో చేపడుతున్న సంస్కరణలను ఆయనకు తెలిపారు. కడేల్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ సీఎండీ సోహన్‌లాల్ కడేల్ నేతృత్వంలోని బృందం గవర్నర్‌ను కలిసి బీమా రంగానికి సంబంధించిన అంశాలను చర్చించింది. బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఎన్. మల్లారెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసింది. '5వ ఎడిషన్ భారత్ కే అన్మోల్ నారీ శక్తి అవార్డ్స్-2026' నిర్వాహకుడు మహ్మద్ నిజాముద్దీన్ తన బృందంతో కలిసి గవర్నర్‌ను కలిశారు. మహిళా సాధికారత కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ప్రజల విశ్వాసంతోనే అధికారులకు గుర్తింపు

- ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు హైడ్రా కమిషనర్ దిశానిర్దేశం

హైదరాబాద్, మే 20 (జనంసాక్షి) : ప్రజాసేవలో నిబద్ధత, పరిపాలనలో పారదర్శకత, ప్రజల సమస్యల పరిష్కారంలో చొరవ చూపించినప్పుడే అధికారులకు మంచి గుర్తింపు లభిస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ప్రతి నిర్ణయంలో ప్రజల సంక్షేమమే అధికారుల ప్రదాన లక్ష్యం కావాలని సూచించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్నప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు హైడ్రా కమిషనర్ బుధవారం దిశానిర్దేశం చేశారు. సమస్యను క్షేత్ర స్థాయిలో తెలుసుకోవడంతో పాటు ప్రజలతో ప్రత్యక్ష అనుబంధం ఉన్నప్పుడే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టడం ద్వారా ప్రజల విశ్వాసం పొందవచ్చునని చెప్పారు. ప్రతి నిర్ణయంలో నిష్పక్షపాత ధోరణి పాటిస్తూ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఉద్యోగాన్ని హోదాగా కాకుండా బాధ్యతగా భావించి సేవా దృక్పథంతో ముందుకు సాగాలని హైడ్రా కమిషనర్ సూచించారు. "భూముల పరిరక్షణ మరియు ఆక్రమణల తొలగింపు" అంశంపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రభుత్వ భూముల సంరక్షణలో రెవెన్యూ అధికారుల పాత్ర, భూ ఆక్రమణల నివారణకు అనుసరించాల్సిన చట్టపరమైన విధానాలు, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని భూ రికార్డుల నిర్వహణ.. వివరాలను పొందు పరచడంలో చొరవ చూపాలన్నారు. అధికార విధులు నిర్వహించడంలో మీ ప్రత్యేకత కనపడాలని.. మీకంటూ ఒక బ్రాండ్ సృష్టించాలన్నారు. నిజాయతీ.. నిబద్ధత, పారదర్శకతతో వ్యవహరించి.. విధులకు న్యాయం చేస్తున్నామనే భావన ఒత్తిడిని దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు ఆసక్తిగా పాల్గొని వివిధ అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. హైడ్రా కార్యకలాపాలపై ఆరాతీశారు. ఆక్రమణలు తొలగించినప్పుడు ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిపాలనాపరమైన ఇబ్బందులపై ఆరాతీశారు. చెరువుల పునరుద్ధరణతో పాటు.. వర్షాకాలంలో వరదల కట్టడికి హైడ్రా తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు.

భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా ఏర్పాట్లు

దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యార్

కాళేశ్వరం, మే 21 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో మే 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు 12 రోజుల పాటు అత్యంత పవిత్రమైన 'సరస్వతి అంత్య పుష్కరాలు' వైభవంగా జరగనున్నాయని దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్ తెలిపారు. బుధవారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు గోవిందహరి లతో కలిసి సరస్వతి ఘాట్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్న గోదావరి సంగమం ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో జరిగే ఈ పుష్కర స్నానాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. అంత్య పుష్కరాల మొదటి రోజైన మే 21న కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి విచ్చేసి పవిత్ర పుష్కర స్నానాన్ని ఆచరించి ఈ వేడుకలను శాస్త్రోక్తంగా ప్రారంభిస్తారని తెలిపారు. పుష్కర స్నానానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు వసతి, తాగునీరు, ఘాట్ల వద్ద రక్షణ చర్యలతో పాటు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో భక్తులను అలరించేందుకు అద్భుతమైన, ఆహ్లాదకరమైన సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించను న్నారని తెలిపారు. ప్రతి రోజు సాయం టత్రం కాశీ పండితులచే సరస్వతి నది హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ 12 రోజుల పాటు జరిగే పవిత్ర సరస్వతి అంత్య పుష్కరాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, పుష్కర స్నానాలు ఆచరించి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకుని పుణ్యఫలాన్ని పొందాలని భక్తులకు పిలుపునిచ్చారు. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు అవసర మైన సమాచారం, అత్యవసర సేవలు అందించేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌కు 9030632608 నంబర్‌ను సంప్రదిం చవచ్చని తెలిపారు. భక్తులు ఏవైనా సమస్యలు, సూచనలు లేదా సహాయం అవసరమైతే వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచిం చారు. అధికారులు అప్రమత్తంగా ఉండి సేవలు అందిస్తారని కలెక్టర్ తెలిపారు. అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులు సహకరించి, అధికారులు సూచించిన మార్గదర్శకాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

శంషాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

హైదరాబాద్, మే 20 (జనంసాక్షి) : శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైగ్రేడ్ గంజాయి భారీగా పట్టుపడింది. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరు ప్రయాణికుల వద్ద గంజాయిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు గుర్తించారు. నిందితులు విమానం దిగిన వెంటనే డీఆర్ఐ అధికారులకు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని నిలువరించి లగేజీ తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. నిందితులు అత్యంత చాకచక్యంగా వాటర్ బాటిల్స్, స్నాక్ టిన్స్, ఫుడ్ బాక్సుల్లో హైగ్రేడ్ గంజాయిని ప్యాక్ చేసి స్మగ్లింగ్‌కు ప్రయత్నించారు. మొత్తం 8.705 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.3.05 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన డీఆర్ఐ అధికారులు.. ఇద్దరు నిందితులను ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న డ్రగ్స్ నెట్‌వర్క్, ఇతర సంబంధాలపైనా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఇటీవల గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు, బంగారం వంటి విలువైన వస్తువులు తరలిస్తూ స్మగ్లర్లు భారీగా పట్టుపడుతున్నారు.

ప్రవాసుల సంక్షేమానికి ప్రత్యేక కృషి

తెలంగాణ ఎన్నారై సలహా కమిటీతో మంత్రి కొండపల్లి

అమరావతి, మే20 (జనంసాక్షి) : ప్రవాసాంధ్రుల సంక్షేమం, సమస్యల పరిష్కరానికి ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారంఏపీ ఎన్ఆర్టీ భవన్‌లో మంత్రి కొండపల్లితో తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై సలహా కమిటీ సమావేశమైంది. ఏపీలో అమలవుతున్న ఉత్తమ ఎన్నారై పద్ధతులు, సంక్షేమ కార్యక్రమాల అధ్యయనం కోసం ఏపీలో తెలంగాణ కమిటీ పర్యటిస్తోంది. గల్ఫ్ వలసదారులు, విదేశీ కార్మికుల సంక్షేమంపై ఏపీలో అమలవుతున్న పద్ధతులపై తెలంగాణ కమిటీ అధ్యయనం చేస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రవాసాంధ్రులకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సేవలు, అత్యవసర సహాయక చర్యలను తెలంగాణ బృందం పరిశీలించింది. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వలస కార్మికుల సమస్యలు, నకిలీ ఏజెంట్లపై ఏపీ పోలీస్ ఎన్నారై సెల్ తీసుకుంటున్న చట్టపరమైన చర్యలపై చర్చించారు. గల్ఫ్ వలసదారుల భద్రత, బీమా సౌకర్యాలు, స్వదేశానికి తిరిగి వచ్చిన వారి కోసం అమలు చేస్తున్న పునరావాస పథకాలపై అధికారులను అడిగి తెలంగాణ సభ్యులు తెలుసుకున్నారు. ఏపీఎన్ఆర్టీ విధానాలపై అక్కడి ప్రభుత్వానికి తెలంగాణ ఎన్నారై సలహా కమిటీ సభ్యులు ఓ నివేదిక ఇవ్వనున్నారు. మంత్రి కొండపల్లితో జరిపిన చర్చల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ బీఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకుల భూపతి రెడ్డి పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370